# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

సంపుటి : 56 | సంచిక : 11 | నవంబరు, 2023 | పేజీలు : 24 | వెల : రు. 10/-


# పాలస్తీనీయులపై అమెరికా, ఇజ్రాయిల్ దుష్టకూటమి సాగిస్తున్న హింసాకాండను వెంటనే ఆపాలి

**గత** 23 రోజులుగా అమెరికా అండదండలతో పాలస్తీనా ప్రజానీకంపై ప్రత్యేకించి గాజాపై, ఇజ్రాయిల్ మూకుమ్మడి దాడులను సాగిస్తోంది. గాజాలోని ప్రజలకు నీరు, విద్యుత్, ఆహారం అందకుండా మార్గాలనన్నీ దిగ్బంధం చేసింది. జనావాసాలపై బాంబులవర్షం కురిపిస్తూ ఇప్పటికి ఏడు వేలమందికి పైగా పాలస్తీనీయులను హతమార్చింది. వీరిలో వృద్ధులు, మహిళలు, పసిబిడ్డలు అధిక సంఖ్యలో వున్నారు. గాజాలోని ఆసుపత్రిపై కూడా భీకర దాడులకు పాల్పడి, చికిత్స పొందుతున్న వందలాది మందిని హత మార్చింది. కూలిన భవనాల శిధిలాల క్రింద వుండిపోయి వేలాదిమంది అలాగే మరణించారు. వారిని వెలికితీసే చర్యలకు కూడా అవకాశం లేని పరిస్థితులను కల్పిస్తోంది. లక్షలాది మంది పాలస్తీనీయులను గాజా నొదిలి వెళ్ళమని అల్టిమేటం జారీచేసి భూతల యుద్ధాన్ని తీవ్రంచేసింది. ఈజిప్టు సరిహద్దు రఫా ద్వారా బాధిత ప్రజానీకానికి అనేక దేశాలు అందజేసే ఆహారం, మందులు, ఇతర అవసరాల ట్రక్కులను లోనికి ప్రవేశించనీయకుండా అడ్డుకుంటూ దుర్మార్గంగా వ్యవహరిస్తోంది.



ఈ పరిస్థితుల నేపధ్యంలోనూ ఇజ్రాయిల్ యూదు మతోన్మాద జింగోయిష్టు శక్తుల క్రూరాతి క్రూరమైన అణచివేతలకు, దాడులకు, అక్రమ నిర్బంధాలకు, హత్యాకాండలకు బలవుతున్నా లెక్కపెట్టకుండా స్వేచ్ఛా స్వాతంత్రాల కోసం, తమ విముక్తి కోసం పాలస్తీనా ప్రజల పోరాటం మొక్కవోని దీక్షతో కొనసాగుతూ ఉంది. ఇటీవల కాలంలో జాతీయ విమోచన పోరాటాల చరిత్రకు ఇది ఒక ఉత్తేజాన్ని కలిగిస్తోంది. గడిచిన 75 సంవత్సరాలుగా ఇజ్రాయిల్ దురాక్రమణదారులు పాలస్తీనీయులను గదుముకుంటూ గదుముకుంటూ వారిని రెండు ప్రదేశాలకు–గాజా , వెస్ట్ బ్యాంక్‌లకు పరిమితం చేశారు. ఒకనాటి పాలస్తీనా విమోచన సంస్థ నాయకుడైన యాసర్ అరాఫత్ మరణానంతరం (2004), 'ఫతా' పార్టీకి చెందిన మహమ్మద్ అబ్బాస్ పిఎల్‌ఓకు నాయకుడైనాడు. వెస్ట్ బ్యాంక్ లో నాలుగవ వంతు మంది యూదులు కూడా ఉంటారు. అక్కడ కూడా అప్పుడప్పుడు ఘర్షణలు జరుగుతూ ఉండటం, పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోతుండటం జరుగుతూ వస్తోంది.

గడచిన 20 రోజులకు పైగా పాలస్తీనాలో కేవలం 365 చదరపు కిలోమీటర్లలో అధిక జనసాంద్రతతో కూడిన ఒక చిన్న ముక్కగా ఉన్న గాజా ప్రాంతం, తన చావు బతుకుల పోరాటంతో తీవ్ర చర్చనీయాంశంగా ప్రపంచ ప్రజానీకం ముందుకు వచ్చింది. ఈనాటి ప్రపంచ ప్రజానీకాన్ని, ప్రభుత్వాలను, పాలస్తీనా పోరాటం బరిగీసి అడుగుతోంది, మీరు ఎటువైపు? అని! అంతేకాదు యూదు జాత్యహంకార ఇజ్రాయిల్ ప్రభుత్వం, గాజా ప్రజానీకంపై సాగిస్తున్న అమానుష యుద్ధానికి మద్దతుగా ఎవరు ఉన్నారో, వ్యతిరేకంగా ఎందరు ఉన్నారో, తప్పని పరిస్థితులలో తటస్థంగా ఎవరు ఉన్నారో నేడు జరిగిన ఒక 'పరీక్షలో' స్పష్టమైంది. గాజా ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించే సమరశీల పోరాట సంస్థ హమాస్, నైతికంగా రాజకీయంగా ప్రపంచ ప్రజల, శాంతికాముకుల మద్దతునే కాక వారి సంఘీభావాన్ని కూడా పొందగలుగుతోంది. దాన్ని రుజువు పరచటానికే జరిగిందా అన్నట్లున్న ఒక పరీక్షలో అమెరికన్ సామ్రాజ్యవాద



భారత విప్లవోద్యమ నాయకులు

కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డికి జోహార్లు

నవంబర్ 9

కా. సి.పి.

వర్ధంతి

జనశక్తి
విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

వెబ్‌సైట్ :
www.janasakthionline.com
ఈ-మెయిల్ :
janasakthi1963@gmail.com

సంపుటి : 56
సంచిక : 11

లోపలి పేజీల్లో....

అంతర్జాతీయం :
పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు 1
పాలస్తీనాకు సంఘీభావం-పిలుపు 6
వివిధ దేశాల కార్మికుల ఆందోళనలు 23
రాజకీయార్థికం :
మద్దతు ధర-గిట్టుబాటు ధర 4
పీడితులకు న్యాయం ఎండమావే 8
బొంబాయి జౌళి కార్మికుల
సమ్మె-గుణపాఠాలు -కొమరయ్య 17
ఆకలి సూచీలో దిగువన ఆకలి 21
చరిత్ర :
కొండమొదలు గిరిజనోద్యమం
- ఎస్-ఝాన్సి 11
పుస్తక పరిచయం :
'అమెరికా ప్రశ్నావళికి జవాబు' 7
ప్రకటన :
న్యూస్‌క్లిక్‌పై దాడులకు ఖండన 10
నవంబర్ 27,28 ధర్నా-ఎస్‌కెఎమ్ 24
రిపోర్టు :
కోరన్న, మంగన్నల వర్ధంతి సభలు 24
సాగునీటి ఆందోళన బళ్ళారి 22

వెల : విడిప్రతి..................రూ.10/-
సంవత్సర చందా....రూ. 100/-

చిరునామా :
ఎస్.శేషమ్మ, ఎడిటర్
32-13-26/1, బి.ఎం.ఆర్. రోడ్,
ఎం.ఆర్.పురం, విజయవాడ-10.

యుద్ధ కూటమి అత్యంత అవమానకరమైన రీతిలో నైతిక ఓటమిపాలైంది. అలాగే భారత ప్రభుత్వ అవకాశవాద విధానాలు కూడా ఈ సందర్భంగా బట్టబయలయినాయి.

## గాజా పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి అత్యవసర సర్వసభ్య సమావేశం

27-10-2023 నాడు ఐక్యరాజ్యసమితి నిర్వహించిన అత్యవసర సర్వసభ్య సమావేశం, ప్రపంచ దేశాలకు ఒక పరీక్ష పెట్టినట్లయింది. మొత్తం 193 దేశాలలో 121 దేశాలు (అంటే ప్రభుత్వాలు) తక్షణమే గాజాపై సాగుతున్న దాడులను నిలిపివేయమనీ రెండు వైపుల నుండి, యుద్ధాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేయమనీ (Truce), గాజాలోని బాధితులకు కనీస అవసరాలను అందజేయమనీ జోర్డాన్ దేశం ఐక్యరాజ్యసమితిలో ప్రవేశపెట్టిన తీర్మానం మంచి మెజారిటీతో గెలిచింది. "ఎక్కువ కాలం నిలువ గలిగిన మానవీయమైన సంధి తక్షణమే" ఇజ్రాయిల్ హమాస్‌ల నడుమ అమలులోకి రావాలని ఐక్యరాజ్యసమితి తీర్మాన సారాంశం. గాజా ప్రజానీకానికి అత్యవసర సర్వీసులైన నీరు, ఆహారం, విద్యుత్తు, వైద్య సేవలను తక్షణమే అందజేయనియ్యాలని అత్యధిక మెజారిటీతో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం తీర్మానించింది. పై తీర్మానాన్నివ్యతిరేకించిన కేవలం 14 దేశాలలో ఇజ్రాయిల్, అమెరికాలతో పాటు మరొక 12 చిన్న దేశాలు నిలిచాయి. ఇజ్రాయిల్, అమెరికాల దురాక్రమణ పూరిత కూటమిని బలపరిచిన దేశాలు 7.3% ఉండగా, పాలస్తీనాలో తక్షణమే యుద్ధం నిలిపివేయాలని, గాజా ప్రాంత ప్రజలను ఆదుకోవాలని కోరిన దేశాలు 62.5% ఉన్నాయి.

ఇప్పుడు తటస్థులుగా చెప్పుకుంటూ ఓటింగ్ నుండి గైర్హాజరైన 45 దేశాల గురించి ఆలోచిద్దాం. వీటిలో చాలా సందర్భాలలో అమెరికా ఆదేశాలతో నడుస్తున్న నాటో కూటమికి చెందిన ఇంగ్లాండు, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, ఫిన్‌లాండ్, గ్రీస్, స్వీడన్, ఉక్రెయిన్ లాంటి దేశాలు ఉన్నాయి. ఆసియా పసిఫిక్ కూటమి పేరుతో అమెరికాతో జతకట్టిన భారతదేశం, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలు కూడా ఉన్నాయి. జి-7 దేశాలలో ఒక్కటి కూడా అమెరికాతో పాటు ఇజ్రాయిల్‌కు అనుకూలంగా ఓటు చేయకపోవడం గమనార్హం. జి-7 దేశాలలో ఒకటైన, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో వీటో అధికారం కూడా ఉన్న, ఫ్రాన్స్ దేశం జోర్డాన్ ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా ఓటు చేసింది. "పౌరుల కష్టాల ముందు మరే సమర్ధనా నిలువదు. బాధితులందరూ సానుభూతికి అర్హులే, అన్ని జీవితాలు సమానమైనవే, అందులో ఎక్కువ తక్కువలు లేవు." అని ఫ్రాన్స్ దేశ అధ్యక్షుడు ఇమాన్యువల్ మేక్రన్ ప్రకటించాడు.

ఆ విధంగా ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో జోర్డాన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అమెరికన్ సామ్రాజ్యవాదులు వ్యతిరేకిస్తూ, తమ పాత అనుచర బృందాలలో మరి ఏ ఒక్క దేశాన్ని కూడా కూడా తమ వెంట నిలుపుకోలేకపోవటం దాని రాజకీయ నైతిక ఓటమిని సూచిస్తుంది. అదే సమయంలో అభివృద్ధిచెందిన దేశాల నడుమ, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మిగిలిన సామ్రాజ్యవాద దేశాలలో గూడుకట్టుకుని ఉన్న వైరుధ్యాలకు కూడా ఇది సూచికగా ఉంటుంది.

## పాలస్తీనాకు ప్రపంచవ్యాప్త ప్రజా మద్దతు

సాంప్రదాయకంగా అమెరికన్ సామ్రాజ్యవాదానికి సానుకూలంగా ఉండే దేశాలు కూడా దాని యుద్దోన్మాద వైఖరికి అనుకూలంగా ఓటు చేయకపోవడం వెనుక , ఇజ్రాయిల్ నెతన్యాహు ప్రభుత్వ అమానుష హత్యాకాండకు వ్యతిరేకంగా, దాని జాతి నిర్మూలనా విధానాలను ఖండిస్తూ ప్రపంచ వ్యాప్తంగా చెలరేగిన ప్రజల, శాంతికాముకుల సంఘీభావ ప్రదర్శనలు ఒక ముఖ్య కారణం.

ఇటీవల కాలంలో మరి యే సందర్భంలోనూ అమెరికన్ సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావంతో కూడిన ఇంతటి సంఘీభావాన్ని మనం చూడలేదు. కేవలం మధ్యాసియాలోనూ అరబ్ దేశాలలోనే కాకుండా ఐరోపా ఖండంలో, కెనడా, అమెరికాలలోని అనేక నగరాలలో జాతి నిర్మూలన విధానాలను ఖండిస్తూ సభలు, ఊరేగింపులు నిర్వహించారు. అమెరికాలోని తమ మతం పేరిట ఇజ్రాయిల్ మరియు అమెరికా పాలకులు సాగిస్తున్న జాత్యహంకార హత్యాకాండను ఖండిస్తూ న్యూయార్క్ నగరంలో యూదులు సభలు, ఊరేగింపులు చేశారు. ఆస్ట్రేలియాలో, లాటిన్ అమెరికా దేశాలైన బ్రెజిల్, మెక్సికో, వెనిజులా, అర్జెంటైనా, చిలీ తదితర దేశాలలోనూ, మొరాకో, ఈజిప్ట్, దక్షిణాఫ్రికా, అల్జీరియా తదితర ఆఫ్రికా ఖండ దేశాలలోనూ పాలస్తీనాకు సంఘీభావంగా అనేకానేకం ఇలాంటి ప్రజా ప్రదర్శనలు జరిగాయి.

ఇక్కడ గుర్తించాల్సిన ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే పై తీర్మానానికి అనుకూలంగా తటస్థంగా ఉండిన దేశాలలో కూడా, ఆఖరికి ఇజ్రాయిల్‌తో సహా, యుద్ధానికి వ్యతిరేకంగా శాంతిని కోరుతూ, పాలస్తీనా స్వతంత్ర రాజ్య హక్కుని బలపరుస్తూ దాదాపు ప్రతి దేశంలోనూ ఇలాంటి సంఘీభావం వ్యక్తం అయింది. ఇదంతా ఏదో ఒక మేరకు ప్రపంచ ప్రజలలో గూడు కట్టుకుని ఉన్న అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక భావజాల ప్రభావంగా చెప్పవచ్చు. ప్రపంచ ప్రజా వ్యతిరేకత

పెరిగిపోతున్న పరిస్థితులలో ఏకధ్రువ ప్రపంచ ఆధిపత్య శక్తిగా రాజకీయంగా అమెరికా సాపేక్షంగా బలహీనపడటాన్ని ఇది చూపుతోంది.

## భారతదేశపు అవకాశవాద పాత్ర

ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసినప్పుడు, "ఇది యుద్ధాల కాలం కాదనీ, యుద్ధం ద్వారా దేన్నీ పరిష్కరించలేమనీ" పుతిన్‌కి నీతులు చెప్పిన నరేంద్ర మోడీ, అక్టోబర్ 7న హమాస్ చేసిన దాడిని అదే రోజున ఖండిస్తూ ప్రకటన జారీ చేశాడు. ఇక్కడ గుర్తుపెట్టుకోవాల్సిన కొన్ని విషయాలు ఏమిటంటే 1948లో ఏర్పడిన ఇజ్రాయిల్‌తో పూర్తిస్థాయి దౌత్య సంబంధాలను 1992 దాకా భారతదేశం ఏర్పాటు చేసుకోలేదు. 2017 దాకా నరేంద్ర మోడీ తప్ప అధికారికంగా భారత ప్రధాని ఒక్కరు కూడా ఇజ్రాయిల్‌ను సందర్శించలేదు. ప్రస్తుత వివాదానికి వస్తే ఒక్కసారి కూడా గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న అమానుష దాడిని ఖండించే వైఖరి తీసుకోకుండా, 27న జోర్డాన్ ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా ఓటు చేయకుండా, ఓటింగ్ నుండి గైర్హాజర్ అయిన 45 దేశాలలో ఒకటిగా భారతదేశం ఉండిపోయింది. తామేదో పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకులమన్నట్లు ప్రజలను నమ్మించడానికి ప్రయత్నించే భాజపా ప్రభుత్వం, మధ్యాసియాలో తక్షణమే శాంతిని కోరుకుంటున్న 121 దేశాలకు భిన్నంగా, అత్యధిక పాశ్చాత్య దేశాలతో పాటు ఓటింగు నుండి గైరహాజ రావటం ద్వారా అమెరికన్ సామ్రాజ్యవాద శక్తులకు ఎలాంటి ఇబ్బంది కలిగించని అవకాశవాద వైఖరి తీసుకుంది. దక్షిణాసియా దేశాలలో భారతదేశం మినహా శ్రీలంక, నేపాల్‌లతో సహా మిగిలిన అన్నీ తీర్మానానికి అనుకూలంగా ఓటు చేస్తే భారతదేశం ఒకటే ఒంటెత్తు పోకడతో వ్యవహరించింది. ఇజ్రాయిల్ ప్రభుత్వం ప్రదర్శించే యూదు మతోన్మాద దురహంకార విధానాలను ఖండించడానికి లభించిన కొద్దిపాటి అవకాశాన్ని కూడా వినియోగించకుండా, తన తరహా ముస్లిం ద్వేష మతోన్మాద తత్వాన్ని ఈ రూపంలో కూడా భాజపా ప్రభుత్వం బయట పెట్టుకుంది.

## "చావనైనా చస్తాం కానీ మా నేలను వదిలిపోము"

గడచిన 20 రోజులుగా ఇజ్రాయిల్ ప్రభుత్వం, పాలస్తీనా ప్రజలపై ప్రత్యేకించి కేవలం 23 లక్షల జనాభా ఉన్న గాజా ప్రాంతంపై భీకరమైన దాడులు సాగిస్తోంది. సుమారు 7500 మంది పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోగా వేలాది మంది గాయపడ్డారు. రోగులకు చికిత్స జరిగే ఆసుపత్రులపై కూడా రాకెట్ దాడులు సాగించి అమానుష హత్యాకాండ కావిస్తున్నారు. గాజాకు ఉత్తర దిక్కుగా ఉండే సుమారు పది లక్షల మంది ప్రజలను ఖాళీ చేసి పారిపొమ్మని, ఆవాసాలను వీడి వెళ్ళమని తాఖీదులు జారీ చేస్తున్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదుల ప్రత్యక్ష మద్దతుతో మొత్తంగా పాలస్తీనీయ జాతి సంహారక యుద్ధాన్ని పెద్దఎత్తున కొనసాగిస్తున్నారు. గాజా ప్రాంత ప్రజలకు కనీస బతుకు తెరువు అవకాశాలను అందనివ్వకుండా చేసి పరోక్షంగా వారి మరణాలకు కారణం అవుతున్నారు.

ఇలాంటి పరిస్థితుల నడుమ కూడా భారతదేశపు పాలస్తీనా రాయబారి అద్నాన్ అబూ అల్ హైజా , ఇటీవల ఇలా అన్నారు: "బాంబు దాడులతో ఇజ్రాయిలీలు ఎన్ని దాడులు చేసినా, పాలస్తీనావాసులు మరణమైనా కోరుకుంటారు కానీ ఇతర దేశాలలో శరణార్థులుగా జీవించరు. 1948, 1967 కాలపు పొరపాట్లను తిరిగి మేము కొనసాగించము. చావనైనా చస్తాం కానీ మా నేలను ఈసారి వదిలిపోము. గాజాపై సాగుతున్న విధ్వంసకాండ పట్ల మౌనం వహిస్తున్న పాశ్చాత్య దేశాలు, ఉక్రెయిన్‌తో సహా ఈనాడు సంభవిస్తున్న మరణాలపై మాట్లాడే నైతిక అర్హతను కోల్పోయాయి. మా వద్ద బందీలుగా ఉన్న 200 మంది పైచిలుకు ఇజ్రాయిలీల గురించి మాట్లాడేవారు, ఇజ్రాయిలీల జైళ్లలో బందీలుగా ఉన్న పదివేల మంది పాలస్తీనీయుల గురించి మాట్లాడటం లేదు."

**(ది హిందూ, 27 అక్టోబర్ 2023)**

## ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ ప్రసంగం

78 ఏళ్ల క్రితం ఐక్యరాజ్యసమితి ఏర్పడిన రోజైన గత అక్టోబర్ 24న దాని ప్రధాన కార్యదర్శి ఆంటోనీయో గుటెరస్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు చాలా విలువైనవి.

"1. పాలస్తీనీయులు భూములను కోల్పోయారు. హమాస్ దాడి ఒక్కసారిగా శూన్యంలో నుంచి చేసినది కాదు. ఆక్రమణలతో 56 ఏళ్లుగా పాలస్తీనీయులు అణచివేతకు గురవుతున్నారు. సెటిల్‌మెంట్లు, హింసాత్మక చర్యల కారణంగా వారు తమ భూమిని కోల్పోయారు. వారి ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులయ్యారు. తమ సమస్యకు రాజకీయ పరిష్కారం లభిస్తుందనే ఆశ వారిలో అడుగంటిపోయింది. పాలస్తీనీయుల సమస్యకు హమాస్ దాడులు పరిష్కారం కాదు.. అలాగే హమాస్‌పై దాడులపేరిట పాలస్తీనీయులను శిక్షించడమూ సరికాదు.

"2. ఇజ్రాయిల్ పాలస్తీనాగా రెండు దేశాల ఏర్పాటే పరిష్కారం!" అని గుటెరస్ పేర్కొన్నారు.

ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఒకరు ఇంత స్పష్టంగా వాస్తవికంగా మాట్లాడటం 78 ఏళ్లలో ఇదే తొలిసారి కావచ్చు. అందుకే ఇజ్రాయిల్ ప్రతినిధులకు ఆగ్రహం కలిగింది. ఆయన రాజీనామాను డిమాండ్ చేస్తూ ప్రకటన విడుదల చేశారు. గుటెరస్ ప్రకటనలో నూటికి నూరుపాళ్ళు వాస్తవం ఉంది. అదే సమయంలో ఒక సూత్రబద్ధ పరిష్కారం కూడా ఉంది.

## మధ్యాసియాలో నైతిక ఓటమి పాలైన అమెరికన్ సామ్రాజ్యవాద యుద్ధ కూటమి!

తొలుత బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దుష్ట ప్రయోజనాల కోసం మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో పాలస్తీనాలో ఇజ్రాయిల్ దేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించిన (1917) నాటి నుండి మొదలైన పాలస్తీనా సమస్య, రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికన్ సామ్రాజ్యవాదం పగ్గాలను తన చేతుల్లోకి తీసుకుంది. యూదు జాత్యహంకార ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని అండజేసుకుని పశ్చిమాసియా ప్రాంతంలోని రవాణా మార్గాలూ, చమురు సంపదపై అధిపత్యానికి ప్రయత్నించడంతో మధ్యాసియా ప్రాంతం నిత్యం రగులుతూ ఉంది. సోవియట్ యూనియన్‌లో శ్రామికవర్గశక్తులు ఓటమిపాలైన దగ్గర నుండి అమెరికన్ సామ్రాజ్యవాదం ఏకైక అగ్రరాజ్యంగా మారి ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా, సిరియా ఇలా అనేక దేశాలను తన పాదాక్రాంతం చేసుకునే దురాక్రమణపూరిత విధానాలను వేగవంతం చేసింది. అమెరికాకు ఉన్న ఆర్థిక సంపత్తికి పోటీగా చైనా, ఆయుధ సంపత్తికి పోటీగా రష్యా ప్రపంచ పటంమీదకు రావడంతో అమెరికా, దాని డాలర్ ప్రభావం మసకబారటం మొదలైంది. ఈ ఆర్థిక, ఆయుధ శక్తుల ప్రపంచ పోటీలో భాగంగా మధ్యాసియా ప్రాంతంలో ఇటీవల రష్యాకు, చైనాకు సానుకూలమైన కొన్ని కీలక మార్పులు జరిగాయి. దానితో అమెరికన్ సామ్రాజ్యవాదం తన మధ్యాసియా ప్రాంత మిలిటరీ వ్యూహానికి పోటీ లేని కేంద్రంగా ఇజ్రాయిల్‌ను నిలబెట్టుకునే ప్రయత్నంలో భాగంగా సౌదీ అరేబియా, యూఏఈ , బహరేన్ దేశాలతో ఇజ్రాయిల్‌కు స్నేహ సంబంధాలు బలపడే రీతిలో ప్రయత్నాలు చేసింది. మధ్యప్రాచ్యపు రాజకీయ భౌగోళిక స్వరూపాన్ని తిరిగి లిఖించాలనే అమెరికా, ఇజ్రాయిల్ దేశాల కుట్రలో ఇజ్రాయిల్ ప్రజానీకం సమిధలు కారాదు. ఇజ్రాయిల్ గాజా ప్రాంతాన్ని దురాక్రమించటాన్ని, బందీ చేయటాన్ని వ్యతిరేకించాలి.

**(తరువాయి 5వ పేజీలో)**

# కనీస మద్దతు ధరను మించి రైతుపంటలకు న్యాయమైన గిట్టుబాటు ధర కావాలి

**మన** దేశంలో తయారవుతున్న ప్రతి సరుకుకూ దాని ధరను ఆయా కంపెనీలు నిర్ణయించి ప్రకటిస్తాయి. అలా సరుకుల ధరను నిర్ణయించడంలో అవి ఆ సరుకు ఉత్పత్తి చేయడానికి అయిన ఉత్పత్తి ఖర్చులతో పాటు తిరిగి ఆ సరుకు పునరుత్పత్తికి కావాలసిన పెట్టుబడి సంచయాన్ని కుడా లాభంతో కలిపి లెక్కించుకొని ఆ సరుకు ధరను నిర్ణయిస్తాయి. పెట్టుబడి సంచయానికి కూడా కావాల్సిన అదనపు విలువ కనుక వారి వద్ద పోగుపడకపోతే వారు అసలు ఉత్పత్తే చేయరు. కానీ భారతదేశపు వ్యవసాయం యొక్క పరిస్థితి అది కాదు. ఒక పంట ఉత్పత్తి చేయడానికి అవసరమైన ఖర్చులతో పాటు తన కుటుంబ శ్రమ విలువను, వచ్చే పంటకు కావాల్సిన పెట్టుబడి కూడా కలిసి వచ్చే విధంగా ఆ పంటకు ధర నిర్ణయం జరిగితే, అది ఆ పంటకు న్యాయమైన గిట్టుబాటు ధర అవుతుంది. మన దేశ రైతాంగానికి పంటలపై అలాంటి న్యాయమైన గిట్టుబాటు ధరలు పొందే హక్కు లేనే లేదు. పునరుత్పత్తికి కావాల్సిన పెట్టుబడి మాట అటుంచి, పెట్టిన ఉత్పత్తి ఖర్చును ఆయినా పొందే కనీస మద్దతు ధరను సైతం మన రైతాంగం పొందలేక పోతున్నది.

గిట్టుబాటు ధర సాధన అన్నది, ఒక పంట పండించడంలో పాల్గొన్న వారంతా గౌరవ ప్రదమైన జీవన ఆదాయాన్ని ఆ పంట ద్వారా పొందడం వారి హక్కుగా గుర్తిస్తుంది. దానిని సాధించుకునే పోరాటపు క్రమంలో కనీస మద్దతు ధరనైనా ఒక హక్కుగా సాధించుకోవడం ఒక ముఖ్యమైన ఉపశమన చర్య అవుతుంది. ఇప్పటి వరకూ అమలవుతున్న కనీస మద్దతు ధరల మాయాజాలం ఇలా ఉంది.

## కనీస మద్దతు ధర మాయాజాలం

రైతుల ఆత్మహత్యలపై వార్తలు, అనేక సార్లుగా సాగిన రైతాంగపు ఆందోళనల తర్వాతనే ప్రభుత్వాలు రైతుల పంటలకు కనీస మద్దతు ధరల విధానాన్నైనా ప్రకటించాయి. అది కూడా కేవలం 22 పంటలకు, మరియూ చెరుకుకు ప్రకటించిన ప్రోత్సాహక ధరలతో కలిపితే 23 రకాల పంటలకు మాత్రమే ప్రభుత్వాలు ప్రకటించాయి. మొదట వ్యవసాయ ధరల నిర్ణాయక కమిషన్ (సి ఏ సి పి)వరుసగా మూడు సంత్సరాలపాటు పంటల రేట్ల సగటు ధర ఆధారంగా కనీస మద్దతు ధరను ప్రకటించేది. దీనిపై జరిగిన ఆందోళనల తర్వాత, 'ఒక పంటకి అవుతున్న ఉత్పత్తి ఖర్చు, ఆ పంటకు ఉన్న డిమాండ్-సప్లై పరిస్థితి, జాతీయ అంతర్జాతీయ మార్కెట్లో ఆ పంటల ధరలు, ఆ పంటల యొక్క ధరల మార్పు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పైన పడే ప్రభావం, వ్యవసాయానికి వ్యవసాయేతర రంగాలకీ ఉన్న సంబంధం, వంటి 7 అంశాల ఆధారంగా ఇప్పుడు ఈ కమిషన్ కనీస మద్దతు ధర నిర్ణయిస్తామని చెబుతున్నది. వీటన్నిటి బట్టి నిర్ణయించిన వ్యవసాయ ఉత్పత్తి ఖర్చుకు, స్వామినాథన్ కమీషన్ చెప్పిన విధంగా అదనంగా 50 శాతాన్ని కలిపి కనీస మద్దతు ధరను నిర్ణయిస్తున్నట్లుగా కమిషన్ ప్రకటించింది.

వరి పంటకు మద్దతు ధరను నిర్ణయించడంలో ప్రభుత్వాలు వాడుతున్న గణాంకాల లెక్కల చిక్కులను పక్కనపెట్టి, వాటి సారాంశంలోకి వెళ్ళి మనం పరిశీలిస్తే... ఒక రైతు తన పొలంలో వాడుతున్న ఎరువులు, పురుగు మందులు; దుక్కి, నాట్లు, వంటి పెట్టుబడి ఖర్చులు (A2 ఆంటారు), అతని కుటుంబ శ్రమ (FL ఆంటారు), ఇవి కాక అతను భూమికి చెల్లించిన కౌలు, పన్నులు తదితర ఖర్చులను (C2 అంటారు) కూడా కలపాలి. అయితే ప్రభుత్వం ఏ 2 + ఎఫ్ ఎల్ లను పంట ఖర్చుగా పరిగణించి దానికి 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధరను ప్రకటిస్తున్నట్లు ఇప్పుడు చెబుతున్నది. ఈ ప్రకారం ధాన్యం సాధారణ రకానికి 2022-23 సంవత్సరానికి క్వింటాలకు రూ.2040గా ప్రకటిస్తే, ఈ ఎన్నికల కాలంలో 2023 -24 సంవత్సరానికి రూ.2183 గా నిర్ణయించింది. ఇదే "ఏ" గ్రేడు ధాన్యానికి 2060 రూపాయలను కనీస మద్దతు ధరగా ప్రకటించింది.

ప్రతీ ఎన్నికల సంవత్సరాలలో వరి, గోధుమల కనీస మద్దతు ధరను పెంచినట్లు ప్రకటిస్తుంటారు. ఇది ఎన్నికల సంవత్సరమని మనం గుర్తుంచుకోవాలి. స్వామినాథన్ కమీషన్ C 2 కు 50 శాతం అదనంగా కలపమంటే, ప్రభుత్వం కేవలం సగటు వ్యవసాయ ఖర్చు అంచనాపై 50 శాతం కలిపానని చెపుతున్నది. దీనిపై రైతు ఉద్యమ నాయకుల అంచనా ప్రకారం ఒక్క 2022-23 సంవత్సరంలోనే, సమగ్ర వ్యవసాయ ఖర్చు (C 2) ప్రకారం ఒక క్వింటాల్ ధాన్యానికి 2707 రూపాయలు, రైతుకు కనీస మద్దతు ధరగా దక్కాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం నిరుడు వరికి ప్రకటించిన కనీస మద్దతు ధర 2040 రూ. అంటే, ప్రతి క్వింటాల్‌కు రైతు 767 రూపాయిల చొప్పున నష్టపోయాడు. 2022 సంవత్సరంలో రైతుల నుండి సేకరించిన ధాన్యానికి రైతు నష్ట పోయింది లెక్క వేస్తే, అది 87 వేల కోట్ల రూపాయలుగా ఉంటుంది. అదీ ఒక్క సంవత్సరంలో, ఒక్క వరి పంట లోనే రైతులు నష్ట పోతున్నారు. ఇదేవిధంగా పత్తికి క్వింటాల్‌కు 8,095 రూ॥ సమగ్ర వ్యవసాయ ఖర్చు కాగా, ప్రభుత్వ మద్దతు ధర రూ॥ 6,080 మాత్రమే. అలా ప్రతి క్వింటాల్ ప్రత్తి పైనా రైతాంగం రూ॥ 2,015 లను నష్టపోతున్నది.

ఇక్కడ వ్యవసాయ ధరల కమీషన్ కనీస మద్దతు ధరలను నిర్ణయించడానికి, వ్యవసాయ ఖర్చులను లెక్కించడానికి అన్ని రాష్ట్రాల వ్యవసాయ ఖర్చులను సగటు చేసి లెక్కించు తోంది. ఈ వ్యవసాయ ఖర్చులు దేశవ్యాపితంగా అసమానంగా ఉన్నాయి. ఎక్కువ ఉత్పాదకత వల్ల, కూలి రేట్లు ఎక్కువ ఉన్న రాష్ట్రాల రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు.ఆయా రాష్ట్రాల రైతుల పంటల ఖర్చులు ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరకన్నా ఎక్కువగా ఉన్నాయి. మరోపక్క ఈ లెక్కలు చూపిస్తూ ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో కూలి రేట్లు ఎక్కువగా ఉండటం వల్ల కనీస మద్దతు ధర యొక్క ఫలితాలు పొందలేకపోతున్నారని, కనుక యాంత్రీకరణ వైపు ఇక్కడ వ్యవసాయం మరలాలని ప్రభుత్వ కమీషన్‌లు నిర్దేశిస్తున్నాయి.

ప్రభుత్వాలు ఈ కనీస మద్దతు ధరల లెక్కింపు విధానంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని, దానివల్ల తరుగుతున్న నిజ విలువను పరిగణన లోకి తీసుకోలేదు. గత 10 సంవత్సరాల సగటు కాలాన్ని పరిశీలిస్తే సంవత్సరానికి ఆరు శాతం ద్రవ్యోల్బణం పెరుగుతున్నది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులతో సంబంధం లేకుండా పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఇప్పుడు 23 రకాల పంటలకు ప్రకటించిన కనీస మద్దతు ధరల ప్రకారం చూసినా, మూడు లక్షల కోట్ల రూపాయలు రైతాంగం సంవత్సరానికి నష్టపోయారు. స్వామినాథన్ కమిషన్ నివేదిక ననుసరించి, పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని కూడా ప్రాతిపదిగ్గా తీసుకుంటే, 2006-07 నుండి 2019-20

వరకు దేశవ్యాప్తంగా 24 లక్షల కోట్ల రూపాయలను ఒక్క ధాన్యం పంట మీదనే రైతాంగం నష్ట పోయారు. (తలన్మై ఉజవార్ మక్కల్ అధికారం, తమిళనాడు కరపత్రం ఆధారంగా)

ఈ వ్యవసాయ ధరల కమిషన్ ద్రవ్యోల్బణాన్ని విస్మరించి ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో వ్యవసాయ కూలీల రేట్లు గత ఐదు సంవత్సరాలలో ఎక్కువగా ఉన్నాయని పేర్కొంది. వాస్తవానికి 5 శాతం ద్రవ్యోల్బణం రేటుతో లెక్కవేస్తే ఐదు సంవత్సరాల క్రితం లక్ష రూపాయలు ఉంటే ఇప్పుడు దాని విలువ 40,000 మాత్రమే. కనుక ద్రవ్యోల్బణం ప్రాతిపదిక చూసుకుంటే పంటలకు గిట్టుబాటు ధరలుగానీ, వ్యవసాయ కూలీల నిజ ఆదాయాలలో పెరుగుదల గానీ లేదని, పైపెచ్చు తగ్గుదలే ఉందని అర్థ మౌతుంది.సంవత్సరానికి 3 లక్షల కోట్ల రూ॥గానీ, ఒక్క ధాన్యం పండిస్తున్న ప్రాంతాల నుండీ 24 లక్షల కోట్ల రూపాయిలు గానీ ఎక్కడికి పోయాయి? ఇవన్నీ గ్రామాలలోకే వచ్చి ఉంటే పెట్టుబడి సంచయం ఎంత పెరిగేది? గ్రామాల జీవన చిత్రం ఇంతకంటే గణనీయంగా మారేది.

గ్రామల నుండి ఇలా సంపదల తరలింపు ఫలితంగా, గ్రామాలు కునారిల్లుతున్నాయి. రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. పొట్టచేత పట్టుకొని వలసలు పోతున్నారు. గ్రామాలకు మిగులుతున్న కొద్దిపాటి వనరులను పంపకం చేసుకునే విషయంలో గ్రామీణ ఉత్పాదక వర్గాలైన రైతులు – కూలీల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడటానికి, వీళ్ళ కష్టార్జితాన్ని దోస్తున్న బహుళ జాతి కంపెనీలు, మార్కెట్ శక్తులే కారణమనిఅర్థం చేసుకోవచ్చు. ఇప్పటిదాకా ప్రభుత్వాలు అమలు చేస్తున్న కనీస మద్దతు ధరల విధాన నిర్ణయంలోని దగాలను చూసినాక ఈ కనీస మద్దతు ధరల విధానం యొక్క ఆచరణలోని బండారాన్ని పరిశీలించాలి.

## ఇప్పుడు అమలవుతున్నది కనీస మద్దతు ధర కాదు, గరిష్ట మార్కెట్ నిర్ణయ ధర

దేశంలో 22 రకాల పంటలకు ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధరను అమలు చేసి తీరాలనే బాధ్యత ప్రభుత్వానికి లేదు. ప్రభుత్వము ప్రకటించే కనీస మద్దతు ధరనే పంటలు చేతికి వచ్చే సమయానికి, ప్రైవేట్ మార్కెట్ దోపిడీ శక్తులు దానినే గరిష్ట మార్కెట్ ధరగా భావించి అంతకు ఎంత తక్కువకు వీలైతే అంత తక్కువకు పంటలను కొనుగోలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మధ్య కోస్తా జిల్లాలైన ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాల వ్యవసాయం ప్రధానంగా పేద, కౌలు రైతాంగం చేతుల మీదుగానే నడుస్తున్నది. ఈ కౌలు రైతాంగం స్థానిక గ్రామీణ వ్యాపారులు, సంపన్న వర్గాల నుండి అప్పు తీసుకుని వారి నుండే వ్యవసాయానికి కావలసిన ఎరువులు, పురుగు మందులు తదితర అవసరాలన్నీ కొనుగోలు చేస్తారు. అత్యధిక సందర్భాల్లో ఇదంతా పద్దుల రూపంలో సాగుతుంది. పెట్టుబడి కింద అప్పు తీసుకున్న కౌలు రైతు, తన అప్పు ఇచ్చిన వ్యాపారులకి పంటను, వారు నిర్ణయించిన రేట్ల ప్రకారమే అప్పచెప్పాలి.ఫలితంగా కళ్ళాలలోని పంటను కళ్ళాలలోనే అమ్ముకోవాల్సి వస్తున్నది. ఆ విధంగా కనీస మద్దతు ధరను పొందే అవకాశాన్ని పేద కౌలురైతాంగం కోల్పోతున్నది. ఫలితంగా కౌలు రైతాంగం తమ వ్యవసాయాలను అప్పుతో మొదలుపెట్టి తిరిగి అప్పుతో ముగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఆ కౌలు రైతుల కష్టార్జితమే ఆదాయం రూపంలో వారి ఇంటికి వస్తుంది. లేకపోతే నష్టం రూపంలో మరింత రుణ భారం వారిని ముంచెత్తుతుంది. ఇది రైతుల ఆత్మహత్యల రూపంలో రైతుల పాలిట విషాదంగా ముగుస్తుంది. ఈ విధంగా కనీస మద్దతు ధర విశాలమైన గ్రామీణ ప్రజానీకానికి ఈనాటికీ అందని ద్రాక్ష పండు లాగానే మిగిలిపోయింది.

ప్రభుత్వాలు పసుపు, మిర్చి వంటి పంటలను కనీసం మద్దతు ధరల పరిధిలోకి తీసుకురాలేదు. వాటిని మార్కెట్ శక్తుల వ్యాపార ప్రయోజనాలకు లోబడి ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. మరోపక్క ప్రభుత్వాలు రైతాంగం ఎరువులు, పురుగు మందులు ట్రాక్టర్లు, వంటి పరికరాలపై పెట్టే ఉత్పాదక ఖర్చులను, వాటి ధరలను నిర్ణయించే అధికారం బడా పారిశ్రామికవేత్తలకే వదిలేశారు. ఫలితంగా ప్రపంచంలో అత్యధిక ధరలను చెల్లించి వ్యవసాయానికి కావలసిన ఎరువులు, పురుగు మందులను భారతదేశ రైతు కొనుగోలు చేయాల్సివస్తుంది. మరో పక్క ధరల నియంత్రణ పేరుతో, కనీస మద్దతు ధరల వంటి చర్యల పేరుతో ప్రభుత్వాలు వ్యవసాయ ఉత్పత్తుల ధరలను మాత్రం నియంత్రిస్తున్నాయి. తద్వారా వాటి ధరలను పెరగనివ్వకుండా చూస్తున్నాయి.

ఈ విధంగా కనీస మద్దతు ధరల విధానాన్ని, దాని ఆచరణను చూసిన తరువాత పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడానికి మూలం ఈ వ్యవస్థలోనే ఉందని స్పష్ట మౌతున్నది. ఉత్పత్తిని పేద, మధ్యతరగతి, కౌలు రైతాంగం చేత సాగించటం, కానీ, వారి ఉత్పత్తి నుండి పెట్టుబడి పునరుత్పత్తి జరగకుండా ఆ అసంఖ్యాక ఉత్పత్తిదారులను గ్రామాలనుంచీ పట్టణాల వరకూ వ్యాపించిన ఫైనాన్సు, మార్కెట్ దోపిడీశక్తుల చేతులలో బందీలుగా ఉంచటం, ఉత్పత్తిశక్తులు పురోగమించకుండా నిరోధించడమే, ఈ అర్ధవలస–అర్థ భూస్వామ్య వ్యవస్థ లక్షణం. జాతీయ పరిశ్రమలు, చేతి వృత్తుల విషయంలో ఇదే విధానం అమలవుతున్నది. గ్రామీణ, పట్టణ, ఉత్పాదక మేథో శ్రమశక్తులను కొల్లగొట్టడం మీదనే ఈ వ్యవస్థ యొక్క నిర్మాణం ఏర్పడి కొనసాగుతున్నదని గమనించాలి. అందుకే రైతాంగానికి కనీస మద్దతు ధరని ఒక హక్కుగా అమలు చేయడానికి ప్రభుత్వాలు సిద్ధపడవు. కనీస మద్దతు ధరను ఒక హక్కుగా సాధించుకోవడానికి రైతాంగం కదులుతూనే, గిట్టుబాటు ధరల సాధనలో గ్రామాలను సామ్రాజ్యవాదుల, వారి దళారీ విధానాల భల్లూకపు పట్టునుండి విడిపించుకొనేందుకు పీడిత వర్గాలన్నిటితో కలసి నడవాలి. ★

## అమెరికా... (3వ పేజీ తరువాయి)

ప్రపంచస్థాయి, స్థానిక దేశాల వైరుధ్యాల, సంఘర్షణలో భాగంగా ఆ ప్రాంతపు ఇటీవల పరిణామాలను చూడవలసి ఉంటుంది. అటు ఉక్రెయిన్‌లోనూ ఇటు పాలస్తీనాలోనూ ప్రధానదోషి, యుద్ధోన్మాదియైన అమెరికన్ సామ్రాజ్యవాదమే! అక్టోబర్ 10వ తేదీ నాటికే 2000 మంది పైగా సైనికులతో కూడిన, అనేక యుద్ధ విమానాలను కలిగి ఉన్న భారీ నౌకలను ఇజ్రాయిల్‌కు మద్దతుగా అమెరికా తరలించింది. ఇజ్రాయిల్ ద్వారా పాలస్తీనాను పూర్తిగా తుడిచి వేయాలనే దుష్ట పథకం అమలు చేస్తున్నారు. పాలస్తీనాను ఒక దేశంగా కూడా గుర్తించడానికి సిద్ధంగా లేని అమెరికా యుద్ధోన్మాద కూటమి యొక్క భౌతిక ఓటమిపైనే మధ్యాసియాలోనూ, నేటి ప్రపంచంలోనూ శాంతికి అవకాశం ఉంది. ఐకరాజ్యసమితి చేసిన అనేక తీర్మానాలను నిర్ణయాలను అమెరికా ఇజ్రాయిల్‌లు అమలు పరచడానికి నిరాకరిస్తుంటే UNO ఏమీ చేయలేకపోతోంది. ఈ అక్టోబర్ 24వ తేదీన భద్రతామండలిలో గుటేరస్ చూపిన పరిష్కారాన్ని ఎవరు అమలుపరచాలి అనేది అసలు సమస్య. మొత్తంగా ప్రపంచ ప్రజానీకం, శాంతికాముక శక్తులు సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు ఏకమై అమెరికన్ సామ్రాజ్యవాదానికి, జాత్యహంకార ఇజ్రాయిల్‌కి ముక్కుతాడు వేయగలిగితే తప్ప, పాలస్తీనా సమస్యకు నిజమైన పరిష్కారం లభించదు. అందుకు ఈనాటి పాలస్తీనా నైతిక విజయం మాత్రమే సరిపోదు. భౌతిక విజయం కూడా తప్పనిసరి!!

**30-10-2023** ★

# పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిలుద్దాం!

## అమెరికా సామ్రాజ్యవాదుల అండతో ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధాన్ని ఖండిద్దాం!!

**– సిపిఐ(ఎం–ఎల్) పిలుపు**

**106** సంవత్సరాలుగా పాలస్తీనా ప్రజలు తమ మాతృభూమి రక్షణ కోసం, తమ అస్థిత్వం కోసం చేస్తున్న పోరాటం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఇజ్రాయెల్ సాగిస్తున్న వరుస దాడులకు, నరమేధానికి వ్యతిరేకంగా గాజాను పాలిస్తున్న 'హమాస్' సంస్థ అక్టోబరు 7వ తేదీన మెరుపు దాడులకు పూనుకుంది. గొప్ప మిలిటరీ శక్తిగా అహంభావం ప్రదర్శించే ఇజ్రాయెల్ ఈ ప్రతిఘటనతో ఉలిక్కిపడింది.

దొంగే, "దొంగ, దొంగ" అని అరిచిన చందంగా అతి పెద్ద టెర్రరిస్టు అయిన ఇజ్రాయెల్, 'హమాస్' సంస్థను టెర్రరిస్టుగా చిత్రించింది. ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు 'హమస్‌లంతా మరణించినవారే" అని చెబుతూ వచ్చిన మాటలు నిజం కాదనీ, పాలస్తీనా ప్రజల పోరాట కొనసాగింపును ఈ ఘటనలు ప్రపంచం ముందుకు మరోసారి చర్చకు తెచ్చాయి.

మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత పాలస్తీనా భూభాగం బ్రిటన్ ఆధీనంలోకి వచ్చింది. అరబ్బు ప్రజలు ప్రధానంగా నివసించే ఈ భూభాగంలోకి బయటి నుండి యూదులను తనే ప్రోత్సహించి చేర్చింది. పాలస్తీనాలోనే యూదుల కోసం ప్రత్యేక రాజ్యం ఏర్పాటుకు బ్రిటన్ చేసిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా 1935లోనే గాంధీతో సహా ఆనాటి జాతీయోద్యమ నాయకత్వ మంతా మాట్లాడింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిశాక బ్రిటన్, అమెరికాలు పూనుకుని ఐక్యరాజ్య సమితిలో తెచ్చిన 'ఇజ్రాయెల్' దేశ ఏర్పాటు తీర్మానం 181కి వ్యతిరేకంగా 1948లో నెహ్రూ ప్రభుత్వం ఓటు వేసింది. ఆ తర్వాత కాలంలో పాలస్తీనా ప్రజా ఉద్యమ నాయకుడైన యాసర్ అరాఫత్‌ను మన పాలకులు ఆ దేశ ప్రధాని హోదాలో గుర్తించారు కూడా.

ఈ చరిత్రనంతా పక్కన పెట్టిన మోడీ, ఇజ్రాయెల్ దురాక్రమణదారులకు వత్తాసుగా, వారికి అండగా వుంటామంటూ ప్రకటనలు విడుదల చేస్తున్నాడు. అమెరికన్ సామ్రాజ్య వాదుల కనుసన్నలలో నడుస్తున్నాడు.

1948లో కేవలం 55 శాతం భూభాగంతోనే ఇజ్రాయెల్ ఏర్పడగా, ఇపుడు దాన్ని 80 శాతానికి ఇజ్రాయెల్ విస్తరించింది. 365 చ.కి.మీ.ల విస్తీర్ణం వున్న గాజా ప్రాంతంతో పాటు వెస్ట్ బ్యాంక్, జెరూసలేంలు మాత్రమే మిగిల్చారు. ఆ భూభాగాల నుండి ఇజ్రాయెల్ సేనలు వైదొలగాలన్న ఐక్యరాజ్య సమితి తీర్మానాలను కూడ ఇజ్రాయెల్ అమలు జరపకుండా మొండికి వేస్తున్నది. అమెరికా దానికి అండగా నిలుస్తూ ఐక్యరాజ్య సమితిలో చర్చకు వచ్చే తీర్మానాలన్నిటినీ వీటో చేస్తున్నది.

ఆయిల్ వనరులకు కేంద్రంగా, అరబ్బు దేశాల మధ్య వున్న ఇజ్రాయెల్‌ను ఒక అప్రకటిత మిలిటరీ స్థావరంగా అమెరికా వాడుకుంటూ, ఆయిల్ వ్యాపారంపై తన పట్టును కాపాడుకునేందుకు, తన ఆధిపత్య యుద్ధ వ్యూహాన్ని అమలు పరుస్తోంది. పాలస్తీనా ప్రజలకు అండదండలుగా వుంటూ వచ్చిన అరబ్బు దేశాలను విడగొట్టి, ఇజ్రాయెల్‌తో స్నేహ సంబంధాలు పెంచే వ్యూహాన్ని అనుసరిస్తోంది.

మధ్య ప్రాచ్యంపై పట్టు కోసం అమెరికా సాగిస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా రష్యా, చైనాలు కూడ తమ ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు తగిన ఎత్తుగడలు అనుసరించడం ద్వారా 'ఏక ధృవ ప్రపంచం' అన్న పరిస్థితిని సాధ్యం కాకుండా చేస్తున్నాయి.

హమాస్ ప్రతిఘటనకు ప్రతిగా గాజాపై ఇజ్రాయెల్ దాడుల్ని పెంచింది. అమెరికా ప్రత్యక్షంగా ఆయుధ సాయాన్నే గాక, సైన్యాన్ని కూడ పంపింది. గాజా ప్రజలపై దాడులు ఆపకుంటే తామూ చూస్తూ కూచోబోమని ఇరాన్ హెచ్చరించింది.

అమెరికా, బ్రిటన్‌లాంటి సామ్రాజ్యవాద దేశాలతో సహా అరబ్బు దేశాలన్నిటా, ప్రపంచంలోని శాంతికాముక శక్తులందరూ ఇజ్రాయెల్ దౌష్ట్యాల్ని ఖండిస్తూ వీధుల్లో కొచ్చారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించారు.

గాజాలోని ప్రజలకు నీరు, విద్యుత్తు వంటి సౌకర్యాలను నిలిపివేసి, ఇజ్రాయెల్ దిగ్బంధం చేసింది. గాజాలోని ఆసుపత్రిలో భీకర పేలుళ్ళు జరిపి వందలాదిమంది పాలస్తీనా ప్రజలను హతమార్చే దుర్మార్గానికి ఇజ్రాయెల్ పాల్పడింది. ఇజ్రాయెల్ పౌరుల్ని హమాస్ చంపుతోంది అని ప్రచారం చేస్తూ, తను మాత్రం జంకుగొంకూ లేకుండా సాధారణ ప్రజల్ని, పిల్లల్ని, వృద్ధుల్ని వేలాదిగా చంపుతోంది. గాజాను ఖాళీ చేయమని పాలస్తీనీయులకు అల్టిమేటం జారీ చేసింది.

ఈ దురాగతాల్ని ఖండిస్తూ, పాలస్తీనా భూభాగాల నుండి ఇజ్రాయెల్ వైదొలగి గత ఒప్పందాల ప్రకారం పాలస్తీనా స్వతంత్రంగా మనగలగడానికి తగిన వత్తిడిని పెంపొదిం చేందుకు, మనదేశంలో కూడ సంఘీభావాన్ని, మద్దతునూ కూడగడదాం. భారత ప్రభుత్వంపై, పాలక పార్టీలపై వత్తిడి తెద్దాం.

**19.10.23**

***విప్లవాభినందనలతో...***

**సి పి ఐ (ఎం–ఎల్)**

**ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర కమిటీలు**

**ఇజ్రాయెల్‌కు మద్దతుగా మోడీ చేస్తున్న ప్రకటనలు, దేశ గౌరవానికే భంగకరం!!!**

పుస్తక పరిచయం

# 'అమెరికా వారి ఒక ప్రశ్నావళికి నా జవాబు'

**ఒక** నిరుపేద రైతు కుటుంబంలో జన్మించి, కులక్‌ల(భూస్వాముల) పొలాల్లో వ్యవసాయ కూలీగా పనిచేసే యువతి, ప్రస్కోవ్యా ఏంజెలినా. రష్యన్ అక్టోబర్ విప్లవ విజయానంతరం, సోవియట్ ప్రభుత్వం చేపట్టిన సమిష్టి వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తూ, ట్రాక్టరు డ్రైవరుగా శిక్షణ పొందిన రష్యా మొదటి మహిళ.

స్త్రీలు ట్రాక్టర్ డ్రైవింగ్ చేయటానికి పనికిరారనీ, అది వారికి సాధ్యంకాని పని అనీ, తీరా ట్రాక్టర్ డ్రైవర్‌గా శిక్షణపొంది తన గ్రామ సమిష్టి వ్యవసాయక్షేత్రంలో పని(ట్రాక్టర్ డ్రైవర్‌గా) చేయబోతే, ఆమెను గ్రామప్రజలు గేలి చేసి అడ్డు కొంటారు. అయితే ఆ అడ్డంకిని తప్పించుకొని ఆమె పనిలోకి దిగి, ట్రాక్టర్‌ను తోలటానికి మహిళలు అన్నివిధాలా సమర్థులేనని నిరూపిస్తుంది. అంతేగాక పార్టీ వారిని ఒప్పించి, తన గ్రామం నుండి ఎంపిక చేయబడ్డ కొందరు యువతులకు ట్రాక్టర్ డ్రైవింగులో శిక్షణ యిప్పించి, దేశంలోని మొట్టమొదటి మహిళా ట్రాక్టరు డ్రైవర్ల దళాన్ని తయారుచేస్తుంది.

తిరిగి ఆమెకు జరిగినట్లే , ఆ ఊరిలోని ప్రజలు, ఆ మహిళా దళం ట్రాక్టర్లను నడపకుండా అడ్డుకొన్నారు. ట్రాక్టరు విభాగ మేనేజర్ మహిళలకు యిచ్చి ట్రాక్టర్లను అవి పాడయి పోవటానికి (మహిళలు సక్రమంగా తోలలేరు కనుక)) వాటిని ఆ దళంకు అప్పగించ నిరాకరిస్తాడు. అప్పుడు పార్టీ నాయకత్వం కలుగజేసుకొని మహిళా డ్రైవర్లకు ట్రాక్టర్లు యిచ్చి, వారిచేత సమిష్టి వ్యవసాయక్షేత్రాలలో ఆ మహిళా డ్రైవర్లు పనిచేసేటందుకు వీలు కల్పిస్తారు.

సోవియట్ యూనియన్ పునర్నిర్మాణంలో సమిష్టి వ్యవసాయ క్షేత్రాల పాత్ర గణనీయమైనది. అంతవరకూ కేవలం ప్రకృతి దయాదాక్షిణ్యాల మీదనే నిర్వహింపబడే వ్యవసాయం, సోవియట్ ఆధ్వర్యంలో శాస్త్రీయ వ్యవసాయ పద్ధతుల ద్వారా నిర్వహింపడింది. అతి గరిష్ఠ వ్యవసాయో త్పత్తినీ సాధించింది. ఈ ప్రక్రియలో ట్రాక్టర్లు వ్యవసాయ సాధనాలుగా నిర్వహించిన పాత్ర అమోఘమయినది. ఆ ట్రాక్టర్లను నడిపిన, వ్యవసాయాన్ని అభివృద్ధిచేసిన మహిళా ట్రాక్టర్ డ్రైవర్ల పాత్ర అమోఘమయినది.

తాను జీవితాంతం ట్రాక్టరు డ్రైవరుగానే పనిచేస్తూ పంటల ఉత్పత్తిలో గణనీయమైన లక్ష్యాలను చేరుకోవటంకోసం అహర్నిశలూ కృషిచేసిన ఏంజెలినా, 1937లో కమ్యూనిస్టుపార్టీ సభ్యురాలైంది. ఆమె భూసంబంధ ఉద్యోగుల యూనియన్ సభ్యురాలైంది. 1938లో ఆమె 'నా దళం' అనే పుస్తకాన్ని ప్రచురించింది. వార్తా పత్రికలలో అనేక వ్యాసాలను వ్రాసింది. ఆమెకు సైన్యం 'గార్డ్స్‌మన్' అనే బిరుదునిచ్చింది. ఆమె సోవియట్ యూనియన్ యొక్క సుప్రీం సోవియట్‌కు (అత్యున్నత శాసనసభకు) రెండుసార్లు డిప్యూటీగా(పార్లమెంటు సభ్యురాలుగా ఎన్నుకోబడింది). ఆమెకు 'హీరో ఆఫ్ ది సోషలిస్టు లేబర్' అనే బిరుదు యిచ్చారు. ఆమెకు స్టాలిన్ బహుమానం యిచ్చారు. రెండుసార్లు 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' బహుమతినిచ్చారు. అదేవిధంగా ఆమెకు 'ఆర్డర్ ఆఫ్ రెడ్ బ్యానర్'ను యిచ్చారు. ఇవిగాక ఆమెకు ఎన్నో పతకాలు వచ్చాయి.

అయితే ఆమె యింత అత్యున్నత స్థాయికి చేరుకోవటానికి-ఒక నిరక్షరాస్యురాలైన వ్యవసాయ కూలీ నుండి, అత్యున్నత స్థాయి సోవియట్ శాసనసభ్యురాలు అవటం ఎలా జరిగింది? ఏయే పరిస్థితులు, కారణాలవలన ఆమె ఆ స్థాయికి ఎదిగింది అన్నది ప్రధానమైన, కీలకమైన ప్రశ్నగా వుంటుంది. విప్లవం విజయవంతమై, కార్మికవర్గ ఆధిపత్యాన బోల్షివిక్‌లచే సోషలిస్టు సామాజిక వ్యవస్థ నెలకొల్పబడి, అది అందించిన అవకాశాలవల్లనే కేవలం యిటువంటివి సాధ్యం! అన్నదే యిందుకు జవాబుగా వుంటుంది.

పెట్టుబడిదారీ దేశాలలోని వ్యక్తుల మాదిరి కేరీరిజంతో వ్యవహరించటంవలన ఆమె ఉన్నత స్థితికి చేరుకోలేదు. పెట్టుబడిదారీ దేశాలలో నూటికో - కోటికో మాత్రమే అటువంటిది సాధ్యమయ్యేటట్లు సోవియట్ సామాజిక వ్యవస్థ నిర్వహింపబడలేదు. ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించింది. సోవియట్ యూనియన్‌లో వందల, వేలమంది ఉన్నతస్థాయికి చేరుకోవటం సంభవించింది.

ప్రమోషన్ వస్తే తప్ప, చేస్తున్న వృత్తిలోనే మిగిలిపోతే గుర్తింపు వుండదనే అభిప్రాయాలను తప్పుడు అభిప్రాయాలుగా ఏంజెలినా తేటతెల్లం చేసింది. అనేక సందర్భాలలో ప్రమోషన్లు యిస్తామన్నా, ఉన్నత పదవులు యిస్తామన్నా నిరాకరించి, సోషలిస్టు వ్యవస్థలో ఏ ఉద్యోగమైనా, ఏ పదవి అయినా సమానమైనవేనని ఆమె తన అనుభవం ద్వారా నిరూపించింది.

**ప్రస్కోవ్యా ఏంజెలినా**

హిట్లర్ నాజీ సైన్యం సోవియట్‌పై దండయాత్రచేసి, దురాక్రమణ యుద్ధం జరిపిన సందర్భంలో పార్టీ పిలుపుమేరకు తాను నివసిస్తున్న సస్యశ్యామలంగా తయారుచేయబడ్డ ఉక్రెయిన్ ప్రాంతం నుండి, తీవ్రమయిన మంచుతో పంటలు పండని కజకస్థాన్ ప్రాంతానికి తన దళంతో తరలివెళ్ళింది. అక్కడ పంటలు పండని ప్రాంతంలో, తాను గడించిన అనుభవంతో, ఆ ప్రాంతంలో శాస్త్రీయ పద్ధతుల ద్వారా పంటలు పండించి, ఆహారాన్ని ఉత్పత్తి గావించి, పోరాడుతున్న సైనికులకు ఆహారాన్ని అందే ఏర్పాటు చేయటంద్వారా, యుద్ధంలో ఆహారం కూడా ఒక ఆయుధమే! అన్న విషయాన్ని నిరూపించింది.

హిట్లర్ వ్యతిరేక యుద్ధకాలంలో ఆమె కుటుంబ సభ్యులు అష్టకష్టాలను (యితరుల వలెనే) అనుభవించారు.

ఆమెకు నేరుగా స్టాలిన్‌తో పరిచయ మయ్యింది. ఆమె సుప్రీం సోవియట్ జర్మని వ్యతిరేక యుద్ధం సాగిస్తున్న కాలంలో జరిపిన సమావేశానికి హాజరయింది. సోవియట్ యూనియన్ యొక్క రాజ్యాంగాన్ని ఆమోదించ టానికి స్టాలిన్ ఆధ్వర్యాన నిర్వహింపబడ్డ ఎనిమిదవ అసాధారణ కాంగ్రెసుకు ప్రతినిధి. స్టాలిన్ వ్రాసిన బోల్షివిక్ పార్టీ స్థూల చరిత్ర అన్న గ్రంథంలో, స్టాలిన్ ఈమెను ప్రశంసిస్తూ పేర్కొంటాడు.

అటువంటి ఈమెకు న్యూయార్కుకు చెందిన 'ప్రపంచ జీవిత చరిత్రల ఎన్‌సైక్లో పీడియా'ను ప్రచురించే ప్రచురణ యొక్క సంపాదకుడు ఒక ఉత్తరం వ్రాస్తూ, తాము ప్రఖ్యాతిచెందిన వ్యక్తుల జీవిత చరిత్రలను తమ ఎన్‌సైక్లోపీడియాలో ప్రచురిస్తున్నామనీ, అటువంటి ప్రఖ్యాతి చెందిన వ్యక్తులలో ఒకరిగా, ప్రస్కోవ్యా ఏంజెలినాను ఎంచుకొన్నామనీ చెబుతూ ఆ ఉత్తరంతోపాటు ఒక ప్రశ్నావళిని పంపుతూ అందుకు జవాబులు యివ్వమని కోరతాడు. అయితే, ఆ ప్రశ్నావళిలో ఏయే సామాజిక పరిస్థితుల కారణంగా ఆమె అంతటి స్థాయికి చేరుకోగల్గింది? అన్న ప్రశ్న తప్ప, అనవసరమైన అనేక వివరాలను అడుగుతున్న ప్రశ్నలు వున్నాయి.

**(తరువాయి 22వ పేజీలో)**

# వర్గ విభజిత సమాజంలోని న్యాయస్థానాల్లో పీడిత ప్రజలకు న్యాయం ఎండమావే

**ఇటీవల** కొద్ది కాలవ్యవధిలో తమిళనాడు రాష్ట్రం, మద్రాస్ హైకోర్టు; ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, అలహాబాద్ హైకోర్టులు ఇచ్చిన రెండు తీర్పుల గురించి అనేక పత్రికలలో ప్రముఖంగా వార్తలు వచ్చాయి; కొన్ని పత్రికలలో సంపాదకీయాలు కూడా రాశారు.

తమిళనాడు రాష్ట్రంలో మూడు దశాబ్దాల క్రితం ఆదివాసులపై సాగించిన హింసాకాండ, దాడులు, అత్యాచారాల కేసులో విచారణ న్యాయస్థానం 269 మంది ప్రభుత్వ-పోలీసు, అటవీ, రెవిన్యూ సిబ్బంది, అధికారులను దోషులుగా పేర్కొని, శిక్షలు విధించగా, ఆ శిక్షలను యధాతధంగా ఖరారు చేస్తూ మద్రాస్ హైకోర్టు ఈ సం॥రం సెప్టెంబర్ 29న 'సంచలన' తీర్పునిచ్చింది.

కాగా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం-నోయిడా సమీపంలో 'నిఠారీ' గ్రామంలో దాదాపు రెండు దశాబ్దాల క్రితం జరిగిన ఘోర వరుస హత్యల ఘటనలపై నమోదైన 19 కేసులను విచారణ చేసిన సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం, ఇద్దరు నిందితులకు మరణశిక్ష విధించగా, వారిద్దరినీ కూడా నిర్దోషులుగా ప్రకటిస్తూ ఈ సం॥ అక్టోబర్ 17న అలహాబాద్ హైకోర్టు 'మరో సంచలన' తీర్పు వెలువరించింది.

ఈ 'సంచలనాత్మక' తీర్పులను, సమగ్ర దృష్టితో పరిశీలించటం అవసరం.

❖❖❖

శ్రీగంధం, ఎర్రచందనం మొదలైన విలువగల అటవీ సంపదను అక్రమంగా తరలించే వ్యాపారం అనాదిగా సాగుతూ వస్తోంది. అడవులలో చెట్లు నరికింది మొదలు, అత్యంత భారీ దుంగలను అడవి దాటించి, ప్రధాన రహదారులపై వందలమైళ్ళ దూరం తరలించి, ఓడలలో ఇతర దేశాలకు చేర వేయటం వెనుక బడా పాలక రాజకీయ నాయకులున్నారనేది బహిరంగ సత్యం. వందల కోట్ల రూపాయలను ఈ అక్రమ వ్యాపారంలో పోగేసుకునే ఈ మాఫియా ముఠాలు, పాలకపార్టీ లన్నింటినీ 'సంతృప్తి' పరుస్తుంటాయనేదీ వాస్తవమే! అందుకే అధికారంలో ఏ పార్టీ వున్నా వీరి దందా నిరాటంకంగా సాగిపోతోంది.

అయితే కొన్ని సందర్భాలలో అధికార రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు అప్పుడే కళ్ళు తెరిచినట్లుగా అక్రమ కలప రవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్ వంటి కార్యకలాపాలపై 'కొరడా ఝుళిపిస్తుంటారు. వీరి ప్రతామంతా అసలైన, కీలక వ్యక్తులపైగాక, ఈ కలప, ఎర్రచందనం తరలింపులో కూలీకి వెళ్ళి పనిచేసే నిరుపేదలపై - ప్రత్యేకించి అటవీ సమీప ప్రాంతాల ఆదివాసీ కుటుంబాలపై- చూపిస్తుంటారు. శేషాచలం కొండలపైనున్న ఎర్రచందనాన్ని తరలిస్తున్న ఘటనలలో కూడా పాలక రాజకీయ నాయకుల పనుపున ప్రభుత్వ యంత్రాంగం నిరుపేద కూలీలపై, అటవీప్రాంత ఆదివాసులపై అక్రమకేసులు బనాయించటం, దౌర్జన్యాలు, దాడులు, వేధింపులు సాగించటాన్ని చూస్తున్నాం. చట్టభీతి లేకుండా అధికార రాజకీయ నాయకుల దన్నుతో ఆదివాసులపై దాడులు, హింసాకాండ సాగించటమేగాక, కలప దుంగల ముందు వారిని నిలిపి ఫోటోలు తీయించి, వారిపై అక్రమ కేసులు బనాయించి, అక్రమ కలప తరలింపును నిరోధించటానికి తామెంతో చెమటోడుస్తున్నట్లు ప్రచార మాధ్యమాల ద్వారా ప్రదర్శించుకుంటూ వుంటారు. సరిగ్గా ఇలాంటి ఘటనే జయలలిత ముఖ్యమంత్రిగానున్న కాలంలో తమిళనాడు రాష్ట్రంలో జరిగింది.

ఎర్రచందనాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారనే ఆరోపణతో తమిళనాడు రాష్ట్రం, ధర్మపురి జిల్లాలోని ఆదివాసీ గ్రామమైన వాచాతిపై ఒకేసారి పోలీసు, ఫారెస్టు, రెవిన్యూ అధికారులు, సిబ్బందితో కూడిన 269 మంది బృందం 1992 జూన్ 20న దాడిచేశారు. 655 మంది ఆదివాసులున్న ఆ గ్రామంలో 3 రోజులపాటు సోదాలు నిర్వహించి మహిళలు, పసివారు, వృద్ధులందరిని అనాగరికంగా దాడిచేసి కొట్టారు; వారి ఇళ్ళనన్నీ ధ్వంసం చేశారు; గ్రామంలోని బావిలో విషం కలిపి తాగునీరు అందుబాటులో లేకుండా చేశారు; ఒక బాలికతో సహా 18 మంది మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారు. ఇంత దుర్మార్గానికి పాల్పడి, చివరగా వారిపైనే అక్రమ కలప రవాణా కేసులు బనాయించారు.

వాచాతి గ్రామంపై దాడులు, హింసా కాండకు పాల్పడిన రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలోని ఉన్నతాధికారులు, సిబ్బందిపై ఆదివాసులు పెట్టిన కేసు నమోదు చేయడానికే తొలుత న్యాయస్థానం తిరస్కరించింది. ప్రజలు, ప్రజాస్వామికవాదుల నుండి వివిధ రూపాలలో వ్యక్తమైన వత్తిడుల ఫలితంగా ఈ కేసుని సిబిఐకి అప్పగించారు. సిబిఐ నాలుగు సం॥లలో ఛార్జిషీటు దాఖలు చేసిన తర్వాత కూడా ధర్మపురిలోని సెషన్స్ కోర్టు, ఈ కేసు విచారణను 15 సం॥ల కాలం సుదీర్ఘంగా సాగించింది. అంతిమంగా, 2011 సం॥లో, ఈ కేసులో ఆరోపణలు మోపబడిన 269 మంది నిందితులలో అప్పటికి మరణించిన 54 మందికి మినహా మిగిలిన వారందరికీ తరతమ స్థాయిలలో న్యాయస్థానం శిక్షలు విధించింది.

శిక్షలకు గురైన వారంతా మద్రాసు హైకోర్టు నుండి సులభంగా 'స్టే' తెచ్చుకొని, తమ ఉద్యోగ కాలాన్ని నిరాటంకంగా పూర్తి చేసుకున్నారు. ప్రభుత్వం నుండి రావలసిన ప్రావిడెంట్ ఫండ్, తదితర సదుపాయాలనన్నీ పొందారు.

కాగా, తీరిగ్గా వీరి 'అప్పీల్'పై విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు, విచారణకోర్టు విధించిన శిక్షలనే ఖరారు చేస్తూ ఇటీవల తీర్పునిచ్చింది. 30 సం॥ల కాలం సుదీర్ఘ న్యాయపోరాటం చేసిన బాధితులకు ఇది ఉపశమనం కల్గిస్తుందనటంలో సందేహం లేదు. అయితే, అధికార, అంగ, అర్థబలమున్న ఈ నిందితులంతా సుప్రీంకోర్టులో ఈ తీర్పును సవాల్ చేసే అవకాశముంది. చివరగా ఈ కేసు అక్కడ ఎలా ముగియనుందో?!

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం-నోయిడాలోని 'నిఠారీ' గ్రామంలో 2005-06 సం॥ల మధ్యకాలంలో వరుస హత్యల ఘటనలు సంచలనం కల్గించాయి. ఈ ప్రాంతంలోని అనేకమంది నిరుపేద, అనాథ బాలలను, మహిళలను అపహరించి, హత్య గావించి వారిపై అత్యాచారాలకు పాల్పడ్డారనే తీవ్రమైన నేరారోపణలతో 19 కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసులను సుదీర్ఘంగా విచారించిన దిగువ న్యాయస్థానాలు, కేవలం ఇద్దరిని నిందితులుగా తేల్చి, వారికి మరణశిక్ష విధించాయి.

వాస్తవానికి నిరుపేద, అనాథ బాలలను, యువతులను అపహరించి, వారి అవయవాలతో వ్యాపారం చేసే ముఠా, పాలక రాజకీయ నాయకుల దన్నుతో సాగుతుందనే ఆరోపణలు కూడా ఆ సమయంలో వున్నప్పటికీ, పోలీసు యంత్రాంగం ఆ జోలికే పోలేదు. తమవెనుక

ఏ 'పెద్దమనుషుల' అండదండ లేకుండా, కేవలం ఇద్దరు వ్యక్తులే ఒక ప్రాంతంలో 19 మందిని అపహరించి హత్యగావించటమనేది సాధ్యం కూడా కాదు. ఏమైనా, అసలైన దోషులను తెరముందుకు తేకుండానే నాటకం నడిపారు. దశాబ్దాల కాలం గడిచాక, ఈ వరుస హత్యా ఘటనలపట్ల ప్రజాగ్రహం కొంత చల్లారాక, కేసు విషయం వార్తలలో నుండి కొంత మరుగయ్యాక, సాంకేతిక అంశాల కారణాలు చూపుతూ ఉన్నత న్యాయస్థానాల నుండి వారిని 'బయటకు' తెచ్చుకోవటం జరుగుతోంది. విచారణాధికారులు సాక్ష్యా ధారాలను సక్రమంగా చూపలేకపోయారంటూ ఇద్దరు నిందితులకు క్రింది కోర్టు విధించిన మరణశిక్షలను కూడా అలహాబాద్ హైకోర్టు రద్దుచేస్తూ, వారిని నిర్దోషులుగా విడుదల చేస్తూ 2023 అక్టోబర్ 17న తీర్పునిచ్చింది. మరి ఆ 19 మంది నిరుపేద, అనాథబాలల, మహిళల హంతకులెవరు?

1991 ఆగస్టు 6న, గుంటూరుజిల్లా చుండూరు గ్రామంలో పట్టపగలు, నడిబజారులో భూస్వామ్య, అగ్రకుల పెత్తందార్లు మారణా యుధాలతో దళితవాడపై మూకుమ్మడిగా దాడిచేశారు. ప్రాణాలు కాపాడుకునేందుకు పరిగెడుతున్న వారిని వెంటాడి, వేటాడి 8 మంది దళితులను నిలువునా హత్యగావించారు; కత్తులతో క్రూరంగా నరికి తుంగభద్ర మురుగు కాల్వలోకి తోసేసిన ఘటన రాష్ట్రవ్యాపితంగా సంచలనం కలిగించింది. దళితులను హత్య గావించిన దోషులను కఠినంగా శిక్షించాలని రాష్ట్రస్థాయిలో అసంఖ్యాక ఉద్యమాలు సాగాయి. ఫలితంగా ఈ కేసు విచారణకు చుండూరులో ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పరచి, 212 మంది నిందితులపై 12 కేసులను సుదీర్ఘంగా విచారణ చేశారు. 2007 సం॥లో ఈ ప్రత్యేక న్యాయస్థానం చుండూరు మారణకాండలో, 21 మందికి జీవితఖైదును, 35 మందికి ఏడాది శిక్షను విధించింది. ఆర్థిక, రాజకీయ అండ దండలున్న వీరంతా హైకోర్టుకు అప్పీల్ చేయగా, సాక్ష్యాధారాలు తగిన విధంగా లేవంటూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2014 ఏప్రిల్ 22న తీర్పునిచ్చింది. తదనంతరకాలంలో సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పుకే సమర్థన నిచ్చింది. మరి, చుండూరు దళితులను కిరాతంగా హత్యగావించింది ఎవరు?

2007 ఆగస్టు 20న 13 మంది స్పెషల్ పార్టీ ఏపి పోలీసులు, విశాఖ జిల్లా, వాకపల్లి ఏజన్సీ గ్రామంలో కూంబింగ్ నిర్వహించే క్రమంలో 11 మంది ఆదివాసీ మహిళలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడ్డారు. బాధిత ఆదివాసీ మహిళలు కట్టుబాట్లకు వెరవక, ముందుకొచ్చి, నోరువిప్పి తమపై జరిగిన ఘోరాల్ని వివరించారు. ఆదివాసీ మహిళలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడిన పోలీసులను శిక్షించాలని ప్రజలు, ప్రజా సంఘాలు దీర్ఘకాలంపాటు ఆందోళన సాగించారు. దశాబ్దన్నర పైగా కాలం ప్రత్యేక కోర్టులో సాగిన ఈ కేసు విచారణాక్రమం తర్వాత, సాక్ష్యాధారాలను సక్రమంగా చూపలేకపోయిన కారణంగా కేసును కొట్టివేస్తూ, 13 మంది నిందితులను నిరపరాధులుగా ప్రకటిస్తూ ప్రత్యేక న్యాయస్థానం 2023 ఏప్రిల్ 6న తీర్పునిచ్చింది. కేసును సరైన పద్ధతిలో దర్యాప్తు చేయలేక పోయారని విచారణాధికారులపై ఘాటైన వ్యాఖ్యలు చేస్తూ, బాధితులపట్ల అంతులేని ఆవేదనను ఒలకబోస్తూ ఇచ్చిన తీర్పు బాధితులకు ఎలాంటి ఉపశమనాన్ని ఇస్తుంది?! న్యాయమూర్తుల 'విచక్షణాధికారం' ఈ కేసులో బాధితుల పక్షం తీసుకోలేకపోయిందెందుకని?!

మోడీ ముఖ్యమంత్రిగానున్న కాలంలో గుజరాత్ రాష్ట్రంలో 2002 సం॥లో జరిగిన మతకల్లోలాలు, ముస్లిం మతమైనారిటీలపై మతోన్మాదుల అమానుష హింసాకాండ అందరి దృష్టిలో వున్నదే. ఆ సందర్భంగానే గర్భవతి అయిన బిల్కిస్ బానోపై, ఆమె కుటుంబంపై హిందూమతోన్మాదమూకలు 2002 మార్చి 3న దాడికి పాల్పడ్డారు; ఆమెపై అత్యాచారం చేశారు; అడ్డువచ్చిన 3 సం॥ ఆమె కూతురును ఆమె కళ్ళముందే ఘోరంగా చంపేశారు; ఆమె కుటుంబంలోని మొత్తం 14 మంది ఈ దాడుల్లో హతులయ్యారు; వారిలో 7గురి మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయి.

తమ కుటుంబాన్ని, జీవితాన్ని సర్వనాశనం చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని కోరుతూ, ఎన్నో బెదిరింపులను ఎదుర్కొంటూనే ప్రాణాలకు తెగించి బిల్కిస్‌బానో న్యాయస్థానంలో పోరాటం చేసింది. దశాబ్దాల కాలం తర్వాత ఎట్టకేలకు విచారణ న్యాయస్థానం ఈ కేసులో 11 మందిని దోషులుగా పేర్కొని, వారందరికీ యావజ్జీవ శిక్ష విధించింది. పాలక రాజకీయ నాయకుల అండదండలున్న వీరు, ఆ శిక్షను అనుభవించాల్సిన అవసరం లేకుండానే, ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేసుకొని వాదనలు వినిపించాల్సిన కనీస అవసరం లేకుండానే, ఆ శిక్ష నుండి తప్పించుకోగలిగారు. 75 సం॥ల స్వాతంత్ర్య దినోత్సవ 'అమృత' కాలంలో సత్ప్రవర్తన కలవారిని జైళ్ళ నుండి విడుదల చేసే పేరిట కేంద్ర, రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వాలు నిస్సిగ్గుగా బిల్కిస్‌బానో కేసులో యావజ్జీవ ఖైదు శిక్షననుభవిస్తున్న వారందరినీ న్యాయస్థానాల ఆమోదంతో విడుదల గావించారు. పూల దండలతో, మేళతాళాలతో వారందరినీ కారాగారం నుండి ప్రదర్శనగా తీసుకెళ్ళి సన్మానం చేయగలి గారంటే, బిల్కిస్‌బానో వంటి కేసులలో ఘోర హింసాకాండకు, హత్యలకు, అత్యాచారాలకు పాల్పడిన దోషుల 'సత్ప్రవర్తన'ను నిర్ణయిస్తున్న దెవరు?!

1985 జులై 7న ప్రకాశంజిల్లా, కారంచేడులో అగ్రకుల భూస్వాముల హంతకదాడులలో ఆరుగురు దళితులు ప్రాణాలు కోల్పోయారు; ముగ్గురు మహిళలపై భూస్వామ్య, పెత్తందార్లు అత్యాచారాలు చేశారు; దళితవాడలోని ఇళ్ళను తగులబెట్టారు; దోచుకున్నారు; బీభత్సం సృష్టించారు; దళితులందర్నీ చెట్టుకొకరు పుట్టకొకరుగా తరిమివేశారు. దేశవ్యాపితంగా ఈ ఘటన సంచలనం కలిగించింది. దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ రాష్ట్రస్థాయిలో ఆందోళనలు జరిగాయి. అయినప్పటికీ, దీర్ఘకాల విచారణ తతంగాన్నంతా ముగించుకొని, 23 ఏళ్ళకు వచ్చిన తుది తీర్పులో అనేకమందిని నిరపరాధులుగా ప్రకటించగా, కొందరికి నామమాత్ర శిక్షలు పడ్డాయి. అధికార, అంగబలం కల నిందితులు దీనిపై సుప్రీంకోర్టు వరకు వెళ్ళి సవాల్ చేశారు. సుప్రీంకోర్టు ఒకరికి జీవితఖైదు, 30 మందికి కేవలం 3 ఏళ్ళ జైలుశిక్షతో కేసును ముగించింది.

2012 జూన్‌లో శ్రీకాకుళం జిల్లా లక్ష్మిపేటలో ఐదుగురు దళితులను గ్రామ పెత్తందారీశక్తులు, మారణాయుధాలతో దాడులు చేసి హతమార్చిన కేసులో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పరచి విచారణ జరుపుతామని చెప్పినప్పటికీ –బాధిత దళితులకు ఈనాటికీ 'ఉపశమనం' కలగలేదు!

బీహార్ రాష్ట్రం, లక్ష్మణ్‌పూర్ బాతేలో, 1997 డిశంబర్‌లో అగ్రకుల భూస్వాముల రణబీర్‌సేన 27 మంది మహిళలు, 14 మంది పిల్లలతో సహా 58 మంది దళితులను ఊచకోత కోసిన కేసులను విచారించిన జిల్లా న్యాయస్థానం నిందితులలో కొందరికి నామమాత్రపు శిక్షలు విధించింది. కాగా, ఈపాటి శిక్షలను కూడా రద్దుచేస్తూ నిందితులంతా నిరపరాధులేనని పాట్నా హైకోర్టు 2013 అక్టోబర్‌లో తీర్పునిచ్చింది!

ఒడిషా రాష్ట్రం, కంధమాల్‌లో హిందూ మతోన్మాదులు ఒక చర్చిని, 14 మంది క్రిస్టియన్ల ఇళ్ళను తగులబెట్టిన కేసులో 54 మంది ముద్దాయిలను నిర్దోషులుగా ప్రకటిస్తూ 2023లో ఒడిషా హైకోర్టు తీర్పునిచ్చింది.

మన కళ్ళముందే, ఇటీవలే మణిపూర్ రాష్ట్రంలో కుకీ, నాగా ఆదివాసీ ➞

# న్యూస్‌క్లిక్‌పై దాడులను ఖండిస్తున్నాం

**'న్యూస్‌క్లిక్'** ప్రధాన సంపాదకులు ప్రబీర్ పురకాయస్థను, ఆ సంస్థ హెచ్‌ఆర్ అధికారి అమిత్ చక్రవర్తిని 'ఉపా' చట్టంక్రింద ఢిల్లీ పోలీసులు చట్టవిరుద్ధంగా అరెస్టు చేయటాన్ని సిపిఐ(ఎం-ఎల్)తీవ్రంగా ఖండిస్తోంది. అలాగే 'న్యూస్‌క్లిక్'కు అనుబంధంగా పనిచేస్తున్న వారిపై దాడులు చేయటాన్ని కూడా ఖండిస్తోంది.

న్యూస్‌క్లిక్ మరియు ఇతర సంస్థలు 'భారత వ్యతిరేక ముఠా'గా 'ముక్కల ముక్కల ముఠా'గా ఆగస్టు 7వ తేదీన బిజెపి ఎం.పి.నిశాంత్ దుబే ఆరోపణలు చేశాడు. ఇంకా వీరు చైనా నుండి నిధులు అందుకున్నట్లుగా 'న్యూయార్క్ టైమ్స్' ఆగస్టు 5వ తేదీన ప్రచురించిందంటూ, వీరంతా చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రచారకర్తలుగా పేర్కొన్నాడు.

2023 అక్టోబర్ 3వ తేదీ వేకువఝామున న్యూస్‌క్లిక్ ప్రధాన సంపాదకుడు ప్రబీర్ పురకాయస్థ, హెచ్‌ఆర్ అధికారి అమిత్ చక్రవర్తి, రచయితలు, కాలమిస్టులు, యాంకర్లు, సిబ్బంది, ఇంకా 'న్యూస్‌క్లిక్'తో సంబంధమున్న ఇతరులపై దాడులు జరిగాయి. వారి లాప్‌టాప్‌లు, ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను దాడులలో స్వాధీనం చేసుకున్నారు. న్యూస్‌క్లిక్ కార్యాలయాన్ని, వారి ఇళ్ళను సిబిఐ, ఇడి, ఐటిడబ్ల్యు వంటి సంస్థలు తమ అధీనంలోకి తీసుకొని, వారి ఆరోపణలను ధృఢపరచుకోవాలని చూశాయి. అయితే వారు ఏవిధమైన సాక్ష్యాన్నీ కనుగొనలేకపోయారు. తమపై చేసిన ఆరోపణ లన్నింటినీ నిరాకరించిన న్యూస్‌క్లిక్ వాటిని 'అబద్ధాలు'గా పేర్కొంది. ఇంతకు మునుపు కూడా, ప్రభుత్వం న్యూస్‌క్లిక్, ఎన్‌డిటివి, ద వైర్, బిబిసి, ఇతర మాధ్యమ సంస్థలపై ఇలాగే దాడులను సాగించింది.

ప్రజాసంఘాలను, సామాజిక కార్యకర్తలను, రచయితలను, కళాకారులను, మేధావులను ఈ ప్రభుత్వం కుట్రదారులుగా అభివర్ణిస్తూ, ప్రభుత్వాన్ని, ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను, చట్టాలను ప్రజాస్వామిక పద్ధతిలో ప్రశ్నించిన లేదా విమర్శించిన పౌరులెవరిపైన అయినా, క్రూరనిరంకుశ చట్టాలను ప్రయోగిస్తోంది. వారిని అనేక సం॥ల కాలం జైళ్ళలో నిర్బంధిస్తోంది. జర్నలిస్టులు, ప్రచారమాధ్యమ సంస్థల్ని సైతం బలప్రయోగంతో ఈ విభాగం క్రిందనే పరిగణిస్తోంది. అభూత కల్పనలను వ్యాప్తిచేస్తూ, ఉన్మాదాన్ని ప్రేరేపించే వ్యక్తులు, సంస్థలపై ఏలాంటి చర్యా తీసుకోకుండా, ప్రజల పక్షాన నిలిచే జర్నలిస్టులు, మీడియా సంస్థలపై దాడులు సాగిస్తూ పత్రికా స్వాతంత్ర్యాన్ని ప్రభుత్వం గుంజివేసుకుంటోంది. ప్రపంచ పత్రికా స్వాతంత్ర్య సూచీలోని 180 దేశాల క్రమంలో భారతదేశ స్థానం 161వ స్థానానికి పడిపోవటమే, అతి పెద్ద ప్రజాస్వామిక దేశంలో ప్రజాస్వామ్య విలువలు దిగజార్చబడుతున్నాయనే దానికి దృష్టాంతం. అలాగే అధికారంలో వుండి పాలన సాగిస్తోంది, ఫాశిస్టు ప్రభుత్వమనేదానికి కూడా ఇది ఒక తార్కాణం.

ప్రపంచస్థాయిలో అనేకమంది జర్నలిస్టులు, జర్నలిస్టుసంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు, రచయితలు, కళాకారులు, మేధావులు, అదేవిధంగా అనేక మంది వ్యక్తులు, సంస్థలు - 'న్యూస్‌క్లిక్'తో సంబంధం కలిగిన వ్యక్తులపై, ఆస్తులపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు.

'న్యూస్‌క్లిక్'తో సంబంధాలున్న వారిపై బనాయించిన కేసులన్నింటినీ ఉపసంహరించు కోవాలని, వారందరినీ వెనువెంటనే విడుదల చేయాలని, ఆ సంస్థకు చెందిన, ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఆస్తులు, వస్తువులన్నీ తిరిగి వారికి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రజలకోసం పనిచేసే, అలాగే ప్రజావ్యతిరేక విధానాలను నిరసించే వ్యక్తులు, సంస్థలపై సంఘాలపై చట్టవిరుద్ధ దాడులు చేయటాన్ని, అరెస్టులు చేయటాన్ని సవాల్ చేయాలి. 'ఉపా', 'నాసా', 'మీసా' వంటి క్రూర నిరంకుశ చట్టాలను రద్దుచేయాలి. వామపక్ష, విప్లవ, ప్రజాస్వామిక శక్తులు ఈ దిశగా కృషి సాగించాలి.

**12-10-23** **విశ్వం**

**ప్రధాన కార్యదర్శి**

**కేంద్రకమిటి, సిపిఐ(ఎం-ఎల్)**

---

➡ సమూహాలపై, ఆ ప్రాంతంలోని విలువైన ఖనిజాలను కాజేయాలనే కుట్రతో, వారందరికీ అక్కడ నుండి పారద్రోలాలనే ఉద్దేశ్యంతో, రాజ్యయంత్రాంగం, అధికారపార్టీ కలగలిసి సాగించిన జాతిహనన హింసాకాండ దుర్మార్గమైనది. ఈ సందర్భంలోనూ చేష్టలుడిగిన న్యాయస్థానాలు, పరుషమైన పదజాలంతో పాలక ప్రభుత్వాలపై కొన్ని వ్యాఖ్యానాలు చేయటానికి, విచారణ కమిషన్‌లను నియమించటానికి పరిమితమవటం తప్పితే, నెలల తరబడి నిరాటంకంగా సాగిన ఆ హింసా కాండను నిలువరించటంలో నిస్సహాయంగా వుండిపోవటం, దేనిని సూచిస్తోంది?!

❖❖❖

పైన పేర్కొన్నవన్నీ దేశంలో అత్యంత పీడితులైన ఆదివాసులు, దళితులు, మహిళలు, మతమైనారిటీలపై బరితెగించి రాజ్యం, అధికార పార్టీల అండతో సాగించిన హంతకదాడుల కేసులలో కొన్ని మాత్రమే. అయితే, ఈ కేసుల ఘటనలన్నీ ఆయా సమయాల్లో సమాజంలో సంచలనం కలిగించి, ప్రజాగ్రహాన్ని ఎదుర్కొన్నవే! అయినప్పటికీ 'న్యాయ పోరాటాల్లో' దాదాపుగా అవన్నీ వీగిపోయాయనే స్పష్టమౌతుంది.

ప్రజలపై సాగుతున్న దాడులు, అణచి వేతలకు వ్యతిరేకంగా పాలకులపై, ఉన్నతాధికార యంత్రాంగంపై ప్రజల ఆగ్రహాన్ని ఉపశమింప జేయటానికి చట్టసభలు, పాలనాయంత్రాంగం, పోలీసులు, న్యాయవ్యవస్థలనేవి-సమన్వయంతో కార్యకలాపాలు నిర్వహిస్తూ అంతిమంగా దోపిడీవర్గాల ప్రయోజనాలకే సేవచేస్తున్నాయని స్పష్టమౌతోంది. వర్గ విభజితమైన మన భారత సమాజంలో అణగారిన ప్రజలకు న్యాయస్థానాల్లో న్యాయం ఎండమావిగానే మిగిలిపోతుందని నిరంతరాయంగా దేశంలో జరుగుతున్న ఎన్నో ఘటనలు నిరూపిస్తూవున్నాయి. కాగా, పీడితులపై దాడులు చేసిన కొందరికి, ఎక్కడో ఒకటి, అరా సందర్భాలలో న్యాయస్థానాలు శిక్షలు విధించ వచ్చుగాక! అంతమాత్రాననే, దీనితోనే పీడిత ప్రజలకు న్యాయవ్యవస్థపై విశ్వాసం పెరుగు తుందనుకోవటం అపోహ మాత్రమే. అయితే, అపుడప్పుడు పీడితుల పక్షం వహిస్తున్నట్లుగా న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులను చూపిస్తూ, పాలక ప్రచార, ప్రసార సాధనాలు, పాలకవర్గ మేధావులు బాధితులకు న్యాయం జరిగిందంటూ న్యాయవ్యవస్థ విశ్వసనీయమైనదంటూ ప్రచారం సాగిస్తున్నారు. దోపిడీ వ్యవస్థ వాస్తవ స్వరూపాన్ని మరుగుపరిచే ఈ ప్రయత్నాలపట్ల జాగరూకు లుగా వుంటూ, న్యాయస్థానాలలో 'న్యాయ' పోరాటాలకే పరిమితమవరాదు. పీడితులంతా తమ జీవనస్థాయి పెంచుకొనేందుకు, ఆత్మ గౌరవం కోసం భూమిపై హక్కుకోసం సాగే పోరాటంలో భాగంగా, తమపై సాగుతున్న దాడులు, అణచివేతలను ఐక్యంగా ప్రతిఘటించేందుకు సంసిద్ధం కావాలి. ✸

# 'ఒడిదుడుకులను అధిగమిస్తూ సాగిన అర్థశతాబ్దపు కొండమొదలు గిరిజనోద్యమం'

**కా॥ ఎస్.ఝాన్సి**



'ఒడిదుడుకులను అధిగమిస్తూ సాగిన అర్థశతాబ్దపు కొండమొదలు గిరిజనోద్యమం' అనే 1/4 డెమ్మీ సైజులో 272 పేజీల పుస్తకాన్ని సిపిఐ(ఎం-ఎల్) తూర్పుగోదావరిజిల్లా కమిటి ప్రచురించింది. కా॥ ఇల్లా రామిరెడ్డి ప్రచురణకర్తగా ముద్రించిన ఈ పుస్తకంలో తూర్పుగోదావరిజిల్లా కొండమొదలు కేంద్రంగా 1969లో ప్రారంభమై, కొనసాగుతూన్న గిరిజనోద్యమ ముఖ్య ఘట్టాలనన్నీ కాలక్రమానుగుణంగా ఆవిష్కరించారు.

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ యస్. ఝాన్సీ ఉపోద్ఘాతంలో గత 54 సం॥ల కాలంగా కొండమొదలు కేంద్రంగా గిరిజనోద్యమ కీలక అంశాలన్నింటినీ క్లుప్తంగా పేర్కొన్నారు. గిరిజనోద్యమం ఎదుర్కొన్న ఆటుపోట్లు, ప్రజల అసమాన ధైర్య సాహసాలు, పోలీసు నిర్బంధాలు, దాడులు, ఆత్మరక్షణ విధానాలు, అక్రమ కేసులు, పోలీసులతో బాహాబాహీ తలపడటాలు, కామ్రేడ్ కుంజం రాజులు, మడెం లక్ష్మయ్యల అమరత్వం, కార్యకర్తల నిలకడైన కృషి, స్పష్టమైన అవగాహనతో రాజ్యయంత్రాంగాన్ని ఎదుర్కొన్న ఘటనలు, న్యాయస్థానాల్లో పోరాటాలు, ముఖ్యంగా గత 20 సం॥ల కాలంగా పోలవరం నిర్వాసితుల డిమాండ్లపై ఖచ్చితమైన వైఖరులతో సాగించిన ఉద్యమ కృషి మొదలైన అంశాలన్నింటినీ గుజ్జు రూపంలో స్ఫూర్తిదాయకంగా వివరించారు.

ఈ ఉపోద్ఘాతంలోని అంశాలను విపులంగాను, పరిపుష్టం చేసే విధంగాను ఈ పుస్తకంలోని 6 భాగాలు సాగాయి. మొదటిభాగం 1968-72 వరకు; రెండవభాగం 1973-76 వరకు; మూడవభాగం 1977-85 వరకు; నాల్గవ భాగం 1986-91 వరకు; 5వ భాగం 1992-2004 వరకు; 6వ భాగం 2005-23 వరకు గిరిజనోద్యమ పరిణామ క్రమాన్ని సాధికారికంగా, సవివరంగా అందించాయి.

ఆదివాసులను అడవితల్లి ఒడి నుండి వివిధ రూపాల్లో గుంజివేస్తున్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యంగా నేటితరం యువజనులు గంభీరమైన గిరిజనోద్యమ నిర్మాణానికి పూనుకోవాల్సిన తరుణంలో దీనిని సామూహికంగా అధ్యయనం చేయటం అవసరం. – సంపాదకులు

**(గత సంచిక తరువాయి)**

## 1982 నవంబరు నుండి 1985 సెప్టెంబర్ వరకూ :

82 కాల్పుల తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో 83 జనవరిలో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పాలన ముగిసి ఎన్నికలలో మొదటిసారి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ కొండమొదలుకు సంబంధించి భూస్వాములు, పోలీసులతో వివాదాలు 1985 ఆగస్టులో గిరిజన సంఘ నాయకుడు కామ్రేడ్ చింతలాడ పెద్దిరెడ్డిపై దాడి వరకూ సాగాయి.

24-6-1983న ఏజెన్సీ గిరిజన సంఘం మహాసభ జరిగింది. దీనిలో అప్పటి వరకూ జరిగిన పోరాటాలను సమీక్షించింది. అమరులకు నివాళులు అర్పించింది. తీసుకోవాల్సిన చర్యలను చర్చించింది. ఈ మహాసభలో గిరిజనేతర భూస్వాములు, చిన్నరైతులు, అసలు భూమిలేని వారిపట్ల అనుసరించాల్సిన విధానం రూపొందించబడింది. ఆదివాసుల మధ్య భూపంపకం విధానం రూపొందించటం జరిగింది. గిరిజనేతర పెద్ద రైతుల విషయంలో సీలింగ్ విధించి అమలు చేయడం జరిగింది.

మరోపక్క భూస్వామ్యశక్తులు ఏదో ఒక రూపంలో దాడికి సిద్ధమౌతూ దానికి కోర్టులలో కేసుల రూపం తీసుకొన్నారు. ఈ సమయంలో పోలీసులు మరోసారి రంగంలోకి దిగి భూస్వాముల వైపు వ్యవహరించబోయారు. మినపచేను కోస్తున్న మహిళలను అరెస్టు చేసి పోలీసు క్యాంపులో నిర్బంధించారు. దీనికి నిరసనగా వందలాది మహిళలు పోలీసు క్యాంపును ముట్టడించారు. "పాలిచ్చే తల్లులను అరెస్టు చేశారు. మీరు మీ అమ్మ పాలు తాగలేదా" అని పోలీసు అధికారులను నిలవేశారు. మమ్మల్ని కూడా అరెస్టు చేయమని డిమాండ్ చేశారు. కాల్పుల తర్వాత కూడా కొనసాగుతున్న ప్రజల సమరశీలత, పోలీసు యంత్రాంగాన్ని వెనక్కు తగ్గేలా చేసింది. అప్పుడు కలెక్టర్ రంగప్రవేశం చేశారు. దాదాపు 150 ఎకరాలు కలిగిన శివయ్య పాత్రుడు కుటుంబీకురాలు రామాయమ్మ కుటుంబానికి, ఈ సంవత్సరానికి 40 ఎకరాల పంట వదలమని కోరాడు. ప్రజలు చర్చించుకొని ఆ సంవత్సరం పంట వదలడానికి సిద్ధపడ్డారు. ప్రధాన భూస్వాములే సంఘంతో రాజీ పడుతుంటే మన సంగతి ఏమిటని మిగిలినవారు ఆలోచించారు. ఇది గిరిజనేతరులలో చీలిక తెచ్చింది. కొండమొదలు గ్రామానికి చెందిన గిరిజనులు కొద్ది మంది తప్ప ఎక్కువ మంది అప్పటివరకూ గిరిజనేతర భూస్వాముల వైపే ఉన్నారు. వారూ ఈ చీలికలతో గిరిజనేతరులతో తెగతెంపులు చేసుకొని సంఘం వైపు వచ్చారు.

దీనితో చివరి ప్రయత్నంగా భూస్వాములు 1985 ఆగస్టులో కొండమొదలు గ్రామంలో గిరిజనులపై కక్ష కట్టి దాడి చేసారు. అక్కడ వున్న సంఘ నాయకుడు కామ్రేడ్ చింతలాడ పెద్దిరెడ్డిని కొట్టారు. దీనిపై పత్రికలు, బయట ప్రాంతాల్లో పెద్దఎత్తున నిరసన వ్యక్తం అయ్యింది. జాఫర్ షరీఫ్ వంటి ఎంఎల్ఏలు, కంఠనేని రవీంద్రరావు, మోదుగుల పాపిరెడ్డి లాంటి అడ్వకేట్లు, ఓపిడిఆర్ నాయకులు, వివిధ ప్రజా ప్రతినిధులు ఈ అంశాన్ని లేవనెత్తి ఖండించారు. ఇలాంటి స్థితిలో ప్రభుత్వం రాజమండ్రి సబ్ కలెక్టర్‌ను కొండమొదలు పంపింది. (అప్పటికి రంపచోడవరం రెవెన్యూ డివిజన్ ఏర్పడలేదు.) భూములలో గిరిజనులే సాగులో ఉన్నట్లు ధృవీకరిస్తూ, గిరిజనేతర భూస్వాములు గిరిజనుల సాగుకు అడ్డు రాకుండా, సబ్‌కలెక్టర్ సెక్షన్ 145 ప్రకటించారు. ప్రభుత్వం పోలీసు ఎస్ఐని

ట్రాన్స్‌ఫర్ చేసింది. ఈ సంఘటనల అనంతరం 1969 నుండి 1985 వరకూ ఆదివాసుల న్యాయమైన ఏ అంశాన్నైనా కేవలం శాంతి భద్రతల కోణం నుంచి చూస్తూ వ్యవహరించే ధోరణి చెల్లదని, పోలీసు కాల్పులు, ఆ తర్వాత నిర్బంధం అనంతరం కూడా ప్రజల సమరశీలత తగ్గలేదని ప్రభుత్వ పెద్దలకు నిర్ధారణ అయింది. నిర్బంధం కాక రాజకీయంగానే ఈ ఉద్యమంతో వ్యవహరించాలని నిశ్చయించుకొని రెవెన్యూ యంత్రాగం, సబ్ కలెక్టర్‌లు రంగం మీదకు వచ్చారు.

మరోపక్క ఆదివాసీ భూపోరాటాన్ని దెబ్బ తీయాలని ప్రయత్నించి విఫలమైన భూస్వామ్య వర్గాలు కోర్టులను ఆశ్రయించారు. సబ్ కలెక్టర్ విధించిన 145 సెక్షన్, గిరిజనుల సాగుకు అడ్డుపడరాదని ఇచ్చిన ఆదేశాన్ని హైకోర్టులో సవాలు చేశారు. రెండుసార్లు హైకోర్టులో వారు వేసిన కేసులు వీగిపోయాయి. వారు సుప్రీం కోర్టుకు వెళ్లారు. ప్రతివాదులుగా ఏజెన్సీ గిరిజన సంఘం కూడా సుప్రీంకోర్టుకు వెళ్ళింది. సుప్రీంకోర్టు కూడా ఆదివాసుల సాగు హక్కును గుర్తిస్తూ గిరిజనేతర భూస్వాముల వాదనను తిరస్కరించింది. నాటి రాజకీయ వాతావరణంలో, కొండమొదలు భూ పోరాటాలకు సామాజిక ఆమోదం లభిస్తున్న పరిస్థితిలో కోర్టులూ, లిటిగేషన్ ద్వారా ఆదివాసీ ఉద్యమాన్ని దెబ్బతీయడం భూస్వాములకు సాధ్యం కాలేదు. దీనితో భూస్వామ్య కుటుంబాల వారు 1985లో కొండమొదలు విడిచి వెళ్లిపోయారు.

మహాసభ నిర్ణయంలో భాగంగా మిగిలిన గిరిజనేతర రైతాంగం విషయంలో సీలింగ్ విధానాన్ని అమలు జరిపి వారికి సరిపడిన భూమిని వారికి వదిలి, అదనపు భూములను సంఘం స్వాధీనం చేసుకొంది. ఇలా వచ్చిన భూముల నుండి కొన్ని భూములు తీసి, అసలు భూమిలేని గిరిజనేతరులను పిలిచి వారికి సంఘం భూములు అప్పగించింది. కష్టపడి పనిచేసేవారు ఎవరైనా ప్రజలకు శత్రువులు కారని చెప్పింది. దోపిడీకే సంఘం వ్యతిరేకమని, ఆదివాసులతో దోపిడీ చింత లేకుండా ఉన్నంత కాలం ఏ గిరిజనేతరుల పట్ల ప్రజలకు వ్యతిరేకత ఉండదని స్పష్టం చేసింది.

అప్పటికి మొత్తం 500 ఎకరాల భూమి ఆదివాసుల సాగులోకి వచ్చింది. భూస్వామ్య వర్గాల ప్రచారం ఏమంటే ఆదివాసులు భూములు లాక్కోవడంతో సరిపోయిందా వాళ్ళు వ్యవసాయం చేయాలి కదా? కొండవాళ్ళకు వ్యవసాయాలు ఏం తెలుసు? అని ప్రచారం చేసేవారు. నిజానికి భూములు భూస్వాముల ఆక్రమణలో ఉన్నప్పుడు పాలేర్లుగా, కూలీలుగా వ్యవసాయం చేసిందే ఆదివాసులు. అయినా భూములు స్వాధీనం అయినాయి కానీ ఎద్దులు, నాగళ్లు, పనిముట్లు లేవు. ఏం చేయాలన్న సమస్య సంఘానికి ఎదురైంది. దీని కోసం నాయకత్వం, ప్రజలు పెద్ద సంఘర్షణే పడ్డారు. మొదట ఒక నాగలి, ఎద్దులు ఉన్న కుటుంబం, 9 మంది నాగళ్ళు ఎద్దులు లేని కుటుంబాలు మొత్తం 10 కుటుంబాలను ఒక జట్టుగా చేసారు. వారంతా కొన్ని ఎకరాలు చొప్పున తీసుకొని అందరూ ఎవరి జట్టు వాళ్ళుగా కలిసి వ్యవసాయం చేశారు. ఒకటి, రెండు సంవత్సరాల వ్యవధిలో అందరూ నాగళ్లు, ఎద్దులు సంపాదించు కోవాలని అనుకొన్నారు. ఆదివాసుల నుంచే నాగళ్ళు చేసే వడ్రంగులు తయారయ్యారు. ఈ విధంగా కుటుంబాల వారీగా అందరికీ నాగళ్లు సమకూరిన తర్వాత కుటుంబ కమతాలుగా భూమిని విభజించుకొన్నారు. ఈ క్రమంలోనే సంఘ వ్యవసాయ విధానం రూపొందింది. ఆదివాసీ జీవితం, పోరాటంలో ఉన్న సమిష్టి తత్వాన్ని వ్యవసాయాల్లో కూడా అమలు చేయాలని నిర్ణయించుకొన్నారు. సంఘం భూములు చేసే అందరూ తమ పంటలో నాలుగవ వంతును సమిష్టికి జమ చేయాలి. అలా పోగుపడిన పంటను (ధాన్యం, పొగాకు, మిర్చి తదితరాలను) మరల సెప్టెంబర్-అక్టోబర్ కాలంలో ఆహారానికి కొరత ఏర్పడుతుంది. అప్పుడు ఈ దాచిన పంటను అందరూ పంపకం చేసుకోవాలి. ఇలా ప్రతి ఒక్కరి కష్టార్జితంను ప్రతి ఒక్కరూ కలిసి అనుభవించాలని నిర్ణయించు కొన్నారు. ఇదే విధానం ఇప్పటి వరకూ అమలవుతూ వచ్చింది. ఉమ్మడి పంటలో కొంత భాగం కోర్టులు, కేసులు, సంఘ అవసరాలకి ఖర్చు చేయాలని అనుకొన్నారు. అదే విధంగా భూములలో కొన్ని భూములను కుటుంబాలకు పంచకుండా ముందు ముందు పెళ్ళిళ్ళు అయి కుటుంబాలుగా ఏర్పడే యువకుల కోసం అట్టిపెట్టారు. వాటిలో పంటలు పండించినా అవి కుటుంబ వాటా భూములు మాత్రం కావు.

ఈ మధ్య కాలంలో 1986 ఆగస్టు 16న గోదావరికి భారీ వరదలు వచ్చాయి. 1953 తర్వాత పెద్ద వరదలు అవే. ఇప్పటికీ అవి పెద్ద వరదలు. ఆ వరదలలో ప్రజలను కాపాడటానికి సంఘ కార్యకర్తలు తీవ్రంగా కృషి చేశారు. ప్రజలను కాపాడటమే కాదు పోలీసు క్యాంపులో మునిగిపోతున్న పోలీసులను పడవలలో ఎక్కించుకొని రక్షించి, అన్నం పెట్టి రంపచోడవరం దారి చూపించి పంపారు. మేము మిమ్మలని కాల్చినా, మీరు మమ్మల్ని కాపాడారని పోలీసు కానిస్టేబుళ్లు ధన్యవాదాలు చెప్పి వెళ్లారు. ప్రకృతికి, మానవుడికి మధ్య వైరుధ్యం ఏర్పడిన సందర్భమది.

ఈ విధంగా 1983 గిరిజన సంఘం మహాసభ నుండి 1989-నవంబర్-28,29లలో జరిగిన నాల్గవ మహాసభ వరకూ గిరిజన-గిరిజనేతర భూముల పాలసీ, సంఘ వ్యవసాయాల పాలసీ, పంటల పాలసీలను రూపొందించుకొన్నారు. నాయకత్వ మార్గదర్శనలో సమిష్టి చర్చలు, అనుభవాల ద్వారా రూపొందించుకొన్న విధానాలను సంఘం, ప్రజలు అభివృద్ధిపర్చుకొంటూ అమలు చేశారు. 1985 నుండి ఇప్పటి వరకూ ఈ విధానాలే తిరుగులేకుండా అమలు జరిగాయి. దీనిని బట్టి ప్రజల పాత్ర ఈ విధానాల నిర్ణయంలో ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రజల పాత్ర, భాగస్వామ్యం లేకుండా కొండమొదలులో ఏ ముఖ్య కార్యక్రమంగానీ, విధానంగానీ రూపొందలేదు, అమలు కాలేదు. 1986 తర్వాత ఇప్పటి వరకూ కొండమొదలులో పోలీసు క్యాంపూ లేదు. ఇన్ని సంవత్సరాలలో ఏ శాంతి భద్రతల సమస్యలూ తలెత్తలేదు. సామాజిక సమస్య అయిన ఆదివాసీ ప్రాంతాల భూముల సమస్యను, శాంతి భద్రతల సమస్యగా చిత్రించి, చట్ట విరుద్ధంగా భూములు కాజేసిన భూస్వాములను రక్షించేందుకు పోలీసు క్యాంపు ఏర్పడింది. దీని కోసం ఎంతో ప్రజాధనం ఖర్చు చేశారు. ప్రజలను చిత్రహింసలు పెట్టారు. ఎప్పుడైతే భూములు ఆదివాసీల పరం అయ్యాయో, రాజకీయ చైతన్యాన్ని అంది పుచ్చుకొన్న ప్రజలు, ఉన్నతమైన సంఘ చైతన్యంతో వ్యవహరించడం మొదలుపెట్టారో, అప్పటి నుంచి ఏ శాంతి భద్రతల సమస్యా లేదు. తమ మధ్య తగవులను ప్రజలు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీల ద్వారా పరిష్కరించు కొన్నారు. ఇన్ని సంవత్సరాలలో ప్రజలు తమంతట తాముగా దేవీపట్నం పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కిన సందర్భాలు వేళ్ళ మీద లెక్కపెట్ట గలిగినన్ని కూడా లేవు.

## 1990-2004 వరకూ ఉద్యమ విస్తరణ కాలంలో :

ఈ కాలపు కార్యకలాపాల గురించి తగినంత, అచ్చులో ఉన్న సమాచారం ఉంది. ముఖ్య అంశాలు ఇలా చెప్పుకోవచ్చు.

1991 మార్చి 18న కొండమొదలు గిరిజనోద్యమ నిర్మాణంలో ప్రాముఖ్యత గల కృషి చేసిన కామ్రేడ్ సోమయ్య గారు అనారోగ్యంతో అంతిమశ్వాస విడిచారు. 1969లో కొండమొదలు వచ్చింది మొదలు 91 వరకూ ఆయన క్షేత్ర

స్థాయిలో ప్రజలను అంటిపెట్టుకొని నిలిచారు. ఆయన అంతిమయాత్ర, 1992లో ప్రథమ వర్ధంతి, స్తూప ఆవిష్కరణ సభలు, నాటి నుండి 2022 మార్చి 18న జరిగిన 31వ వర్ధంతి సభ వరకూ ఆయన సంస్మరణ సభలు స్ఫూర్తినిచ్చేలా జరిగాయి.

1990 దశాబ్దం కొండమొదలు ఉద్యమం వేగంగా విస్తరించిన కాలం. సంఘం తీసుకొన్న విధాన నిర్ణయాల వల్ల కొండమొదలు ఉద్యమ విస్తరణ వివిధ రూపాలలో, దశలలో సాగింది.

1977 నాటికి తూర్పు గోదావరి ఏజెన్సీలో అనేక ప్రాంతాలలో కార్యకలాపాలు సాగేవి. 80ల నాటికి పెరుగుతున్న ఉద్యమ అవసరాల రీత్యా కొండమొదలుపై ఎక్కువగా కేంద్రీకరించాల్సి వచ్చింది, కొండమొదలు చుట్టూ ఉన్న విప్లవ కమ్యూనిస్టు శక్తులతో ఘర్షణ వాతావరణం ఉన్నా వేరే విప్లవ సంస్థ పని చేస్తున్న ప్రాంతంలో మనం నిర్మాణ కార్యక్రమాలు చేపట్టరాదని నిర్ణయం జరిగింది. 1980ల కాలంలో కొండమొదలు పక్కనే విస్తరించే పని పెట్టుకోకుండా ప్రజాపంథా వెలుగులో ఇతర విప్లవశక్తులు లేని ప్రాంతాలుగా విజయనగరం, కోరాపుట్ జిల్లాలలోని ప్రాంతాలను ఎంచుకొని పని జరిగింది. అప్పటి శ్రీకాకుళ ఉద్యమ నిర్మాణ కార్యక్రమాలు జరిగిన మక్కువ, కొమరాడ ప్రాంతాలలో పని జరిగింది. అంతకు ముందు కోరాపుట్, మల్కన్‌గిరి ప్రాంతాలో ప్రజాపంథా వెలుగులో కేంద్రీకరించిన కృషి సాగింది. అతి తక్కువ కాలంలోనే ఇటు దుగ్గేరు ప్రాంత ఉద్యమం, అటు కోరాపుట్ ప్రాంత ఉద్యమాలు గొప్ప ప్రజా కదలికలను తెచ్చాయి.

తూర్పు గోదావరి జిల్లా ఏజెన్సీలోని గోదావరి నది వెనుకవైపు వున్న కొండమీది ప్రాంతాలను గండి మీద ప్రాంతం అంటారు. అక్కడ విప్లవ శక్తులు పనిచేస్తున్న రీత్యా, ప్రజా సమస్యలపై రాజకీయ వైఖరులను ప్రచారం చేయడం తప్ప నిర్మాణ రూపాలు ఇచ్చేందుకు మనంగా కృషి చేయకూడదని నిర్ణయం జరిగింది.

అయితే 1982 నుంచి కొండమొదలు ఉద్యమం సాధించిన ఫలితాలు ప్రజలందరి ముందు కనపడుతున్న కొద్దీ, సంఘాన్ని తమ తమ ప్రాంతాలకు రమ్మనమని ఆహ్వానించడం మొదలైంది. ముఖ్యంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీకి చెందిన, గోదావరి ఒడ్డు ప్రాంతాల నుంచి ఆదివాసులు వారి వారి గ్రామాల్లో సమావేశాలు జరుపుకొని కొండమొదలు సంఘాన్ని ఈ గ్రామాలకు కూడా తెచ్చుకోవాలనుకొన్నారు. ఇవన్నీ 1969లో కొండమొదలు సంఘ ప్రేరణ, సహకారాలతో కదిలిన గ్రామాలు. నిర్బంధాల వల్ల, భూస్వామ్య శక్తులు తెచ్చిన చీలికల వల్ల అప్పుడు దూరం అయ్యాయి. మరల ఇప్పుడు సంఘ విజయాలతో కదిలారు. 1988ల నాటికి గోదావరి నదికి రెండు వైపులవున్న తూటిగుంట, తెల్లవరం, మంటూరు తదితర ప్రాంతాల్లో సంఘ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. క్రమంగా వెంకటరెడ్డి గూడెం, తదితర పోలవరం దిగువ నుండే గ్రామాల వారు సంఘంతో సంబంధాలలోకి వచ్చారు. క్రమంగా భూపోరాటాలు ఈ ప్రాంతాలన్నిటా వ్యాపించాయి.

1994-95నాటికి దొండపూడి వద్దనుండే కుంకాల, మనుగోపుల ప్రాంత ఏజెన్సీ గ్రామాలకు సంఘం విస్తరించింది. ఇవన్నీ 1930-50 దశాబ్దాల కాలంలో గిరిజనోద్యమాలు సాగిన ప్రాంతాలే. 1948-51 మధ్య కాలంలో జమీందారులకు వ్యతిరేకంగా తమ భూముల కోసం ఆదివాసులు పోరాడారు. ఆప్పటి నిర్బంధం, విచ్ఛిన్నాల వల్ల ఆ పోరాటాలు దెబ్బతిన్నాయి. నాటి పోరాటాలలో ఉన్న (యువకులుగా పాల్గొన్నవారు) ఆదివాసి పెద్దలు, కొక్కెర చంద్రయ్య, కరకం రామయ్య గార్లు, కుంకాల ప్రాంతం నుంచి కొండమొదలుకు నడచి వెళ్ళి కామ్రేడ్ విశ్వం గార్ని కలిసారు. సంఘాన్ని నిర్మించుకొంటామని, కాపాడుకొంటామని నాయకులకు చెప్పి సంఘాన్ని ఆహ్వానించారు. అలా ఆ గ్రామాలు మరల గిరిజన సంఘం అందిస్తున్న భూపోరాట కార్యక్రమాన్ని అందుకొని ముందుకు వచ్చాయి. ఫలితంగా 1997 నవంబరు 4 నాటికి మనుగోపాలలో జమీందారు భూ ఆక్రమణలకు వ్యతిరేకంగా వచ్చిన ప్రజా నిరసనను కాలరాయడానికి భూస్వాములు, పోలీసులు కలిసి చేసిన దాడిలో కామ్రేడ్ కారం పార్వతి అమరురాలైంది.కాల్పులు నిర్బంధం తర్వాత కూడా భూపోరాటం ముందుకు సాగింది. ఈ మేరకు విజయాలు సాధించడం కోసం,ఒక విప్లవాత్మక కార్యక్రమం అందించే నిబద్ధ నాయకత్వం కోసం వారు 40 సంవత్సరాల పాటు ప్రయాస పడాల్సి వచ్చింది.

కొండమొదలు సంఘమూ, ప్రజలూ 'భూస్వాముల దోపిడీని ఎదుర్కోవాలని, పోగొట్టుకొన్న తమ భూములు తాము దక్కించుకోవాలని' అనుకొంటున్న ప్రతి వారినీ ఆదరించాయి. భూములు దున్నుతామని వస్తే వారికి విత్తనాలు, కార్యకర్తలను ఇచ్చి పంపింది. కొండమొదలు ఆదివాసులు మా భూములు మాకే అనే స్వార్థ వైఖరిని ఎప్పుడూ తీసుకోలేదు. తమ ప్రాంతంలో భూపోరాటం బతికి బట్ట కట్టాలంటే ఇలాంటి అనేక కొండమొదలు నిర్మించబడాలన్నదే ప్రజల ఉద్దేశం. భూపోరాటం భూములు దక్కటం తోటే ముగియదని, భూములను నిలబెట్టుకోవడం చాలా సుదీర్ఘ కాలం సాగే యుద్ధమనే అవగాహన ప్రజలు ఉండబట్టే కొండమొదలుకు 100 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ ఆదివాసీ ఆదివాసేతర పీడిత ప్రజలు తమకు ఈ కష్టం వచ్చిందని వస్తే వారికి అన్ని రకాలుగా అండగా నిలిచింది. 1990ల తర్వాత చింతూరు ప్రాంతంలో గుత్తికోయల గ్రామాలు అనేకం ఉన్నాయి. (ఇవి కొండమొదలు నుంచి సుమారు 100 కిలోమీటర్ల దూరం ఉంటాయి.) ఆ గుత్తి కోయలను ఒడిషా, ఛత్తీస్‌ఘడ్‌ల నుంచి వలసలు వచ్చారని ఫారెస్టు వారు వేధించి, వారి గ్రామాలను తగుల పెట్టేవారు. చింతూరు, భద్రాచలం ప్రాంతంలో అన్ని పార్టీలు ఉన్నాయి. కానీ వారు మాత్రం కొండమొదలు గురించి తెలుసుకొని వారు ఎదుర్కొంటున్న ప్రమాదాల నుంచి రక్షణ కోసం కొండమొదలు వచ్చేవారు. వారికి బట్టలు, మందులు, ఆహారధాన్యాలు, విత్తనాలే కాక వారికి అండగా సంఘం కార్యకర్తలను పంపింది.

కొండమొదలు ఉద్యమం కొండ ఎక్కదు, దిగదన్న వ్యాఖ్యానాలకు ఆచరణ పూర్వక సమాధానం ఇది.

ఈ కాలంలోనే వివిధ విప్లవ శక్తులతో ఉద్యమ రాజకీయ వివాదాలు తలెత్తాయి. తుదుండెబ్బ వారితో పశ్చిమ గోదావరిలో, సిపిఐ (ఎం-ఎల్) ప్రజాపంథా వారితో దేవీపట్నం ప్రాంతంలో, మావోయిస్టు వారితో చింతూరులో వివాదాలు ముందుకు వచ్చాయి. చింతూరులో దాదాపు ఆరుగురు ఆదివాసులను పోలీసు ఇన్‌ఫార్మర్‌లనే పేరుతో మావోయిస్టులు, స్థానిక పెత్తందారులు చంపివేశారు. అన్ని చోట్లా ఏజెన్సీ గిరిజన సంఘం, వివిధ విప్లవ సంస్థలతో తలెత్తిన వివాదాలపై, బహిరంగ చర్చారూపం ఇవ్వకుండా, ఆంతరంగిక చర్చకు పరిమితం చేయాలనుకొన్నది. అలాగే వివాదాలను ప్రజాతంత్రవాదుల దృష్టికి తీసుకొని వెళ్ళి, వాళ్ళ జోక్యానికి విజ్ఞప్తి చేయాలనుకొని సంఘం వ్యవహరించింది. అవతలి కామ్రేడ్‌ల బహిరంగ ఆరోపణలకు మాత్రమే బహిరంగ సమాధానాలు ఇచ్చింది.

కొండమొదలు నుంచీ ఆదివాసీ ఉద్యమం వివిధ ప్రాంతాలకు విస్తరించుతున్న కాలంలో, 1992 నాటికి ఏడు విప్లవ శక్తుల ఐక్యతగా సి.పి.ఐ(ఎం-ఎల్) జనశక్తి ఏర్పడింది. విప్లవ శక్తుల ఐక్యతను ఏజెన్సీ ఉద్యమ ప్రజానీకం హృదయపూర్వకంగా ఆహ్వానించారు.ఆ కాలంలో తూర్పుగోదావరి జిల్లా మైదాన ప్రాంతంలో

నాయకులు చేపట్టిన కొన్ని చర్యల వల్ల నిర్మాణం పెద్ద ఎత్తున నిర్బంధానికి గురైంది. టాడా కేసులలో నాయకులు నిర్బంధించబడ్డారు. ఎక్కడైనా ఏజెన్సీ ప్రాంతాలకు బయటి ప్రాంతాల నుంచీ కార్యకర్తలు వెళతారు. అలాంటిది ఆ సమయంలో మైదాన ప్రాంత ప్రజలలో ప్రజలనూ, పార్టీని నిలపడానికి, ఏజెన్సీ నుంచీ ఆదివాసీ కార్యకర్తలు వెళ్ళి మైదాన ప్రాంత గ్రామాలలో పనిచేయాల్సి వచ్చింది. ఆ కాలంలో తలెత్తిన విచ్ఛిన్న పరిస్థితులలో ఒక ప్రక్క విచ్ఛిన్న చర్యలను ఎదుర్కొంటూనే ఐక్యతా ధర్మాలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉండేందుకు ప్రజలు చాలా భారాలు మోసారు. నిర్బంధ కారణం చూపి దజన్లకొద్దీ జనాలను కొండమొదలు పంపితే, వాళ్ళ ఆలనాపాలనా చూడటమేకాక, ఆర్థిక భారాలను సైతం మోసారు. అంతా చేసాక కొందరు నాయకులు కొండమొదలు ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయాలన్న దురుద్దేశంతో పంపిన కార్యకర్తలను సైతం రాజకీయంగా విజ్ఞానవంతం చేసి, సరిచేసి పంపారు. ఆ నాయకులే 'సంఘమే భూస్వామి' అంటూ చేసిన వాఖ్యానాలను విని, గమనిస్తూ ఉద్యమాన్ని, కార్యకర్తలను విచ్ఛిన్నాల బారిన పడకుండా కొండమొదలు ప్రాంత పార్టీ నాయకత్వంతో కలిసి ప్రజలు కాపాడుకొన్నారు. వీటన్నిటి మధ్య ఉద్యమ రక్షణకు, విస్తరణకు కావాల్సిన చర్యలనన్నింటినీ తీసుకొన్నారు.

అంతేగాక, 1999లో విజయనగరం జిల్లాలోని, దుగ్గేరులో కామ్రేడ్ జెన్ని తిరుపతి భూస్వాములను ప్రతిఘటిస్తూ అమరుడైనాడు. ఆ సందర్భంగా అమలైన నిర్బంధంలో దాదాపు 72 మంది కార్యకర్తలు, ప్రజలు జైళ్ళలో నిర్బంధించబడి ఉన్నపుడు, కొండమొదలు నుంచీ కార్యకర్తలూ, ప్రజలూ దుగ్గేరు ప్రాంతం వెళ్ళారు. గ్రామగ్రామాన తిరిగి ప్రజలకు ధైర్యం చెప్పి వచ్చారు.

ఈ విధంగా 2004 నాటికి పోలవరం ప్రాంతంలో దొండపూడి నుంచి, ఖమ్మం జిల్లాలో చింతూరు వరకూ తూర్పు, పశ్చిమ, ఖమ్మం ఆదివాసీ ప్రాంతాలలో అనేక గ్రామాలలో సంఘం విస్తరణ కార్యక్రమాలు జరిగాయి. 1998లో భద్రాచలం పార్లమెంటుకు ఎంసిపిఐ నాయకులు కామ్రేడ్ ముర్ల ఎర్రయ్య రెడ్డిని బలపరుస్తూ 100 మంది యువతీ యువకులు ప్రచార బృందాలుగా ప్రచారం సాగించారు.

ఇక్కడ ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల సమయంలో సంఘ నాయకత్వాన ప్రజల పాత్రను ప్రస్తావించాలి. 1986 వరదల నుండీ 2006 వరకూ ప్రతి పెద్ద వరదలలో సంఘం ప్రజలను సన్నద్ధం చేయడమేగాక, ఎవరో వస్తారని దేబిరిస్తూ ఎదురుచూసేవారుగా కాక ఒకరికొకరు సహాయపడుతూ ఆత్మవిశ్వాసంతో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనగలిగే విధంగా నడిపించింది. సంఘం అందించిన రాజకీయ చైతన్యం వల్లనే 2018 మంటూరు బోటు ప్రమాదం జరిగిన వెంటనే మంటూరు ప్రజలు భాధితులను రక్షించడం నుంచీ ప్రమాదం గురించి బయటి ప్రాంతాలకు తెలియచేయడం వరకూ అన్ని చర్యలూ తీసుకొన్నారు. అమరుడు కామ్రేడ్ వీరపురెడ్డి నాయకత్వాన మంటూరు యువకులు సాహసోపేతంగా వ్యవహరించిన తీరును అనేక మంది అభినందించారు.

## 2004-పోలవరం ప్రాజెక్టు నిర్మాణం-భూపోరాటాల-పరిస్థితి-పునరావాసం కోసం పోరాటం :

2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. జలయజ్ఞంలో భాగంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం అయింది. దీనితో ఆదివాసీ భూపోరాటల బలాబలాల్లో మార్పులు వచ్చాయి. ఆదివాసీ ప్రాంతాల్లో ప్రతి గ్రామంలో ఆదివాసుల మధ్య రక్త సంబంధాలు, స్థానికులు, బయటివారు, ఇలా రకరకాల కారణంగా సాంఘిక వైరుధ్యాలు ఉంటాయి. బయటి శక్తుల జోక్యం లేనంత కాలం తాటికల్లు వచ్చే రోజులలో (వేసవి కాలం) ఈ వైరుధ్యాలు బయటపడి, మళ్ళీ వర్షాలు పడి, పనులు మొదలు కాగానే సమసి పోతాయి. కానీ భూస్వామ్య వర్గాలు ఎప్పుడైతే ఏజెన్సీలో ప్రవేశించారో వారు ఈ వైరుధ్యాలను శత్రు పూరితం చేసి తమ స్వప్రయోజనాలకు వినియోగించుకొన్నారు. వారు ప్రజల మధ్య తలెత్తే మిత్రపూరిత వైరుధ్యాలను శత్రుపూరితం చేశారు. ప్రతి గ్రామంలో ఆదివాసులను రెండు మూడు గ్రూపులుగా చీల్చారు. భూస్వాములు ఆదివాసుల మధ్య వైరుధ్యాలను ఎంత అధ్యయనం చేసినా వారి పునాది ఆదివాసులను దోపిడీ చేసుకోవడం మీద ఆధారపడి ఉంది. విప్లవ గిరిజనోద్యమం ఏజెన్సీలోకి వచ్చాక ప్రజల మధ్య వైరుధ్యాలు వారి భూపోరాట క్రమంలో సమసిపోయి ఐక్యత ఏర్పడింది. అయినా కొద్దిమంది ఆదివాసులు భూ పోరాటాలకు దూరంగా ఉండటమో, తటస్థంగా ఉండిపోవడమో జరిగింది. కొందరు సంఘానికి వ్యతిరేకంగా భూస్వాముల పక్షాన నిలబడి పోయారు. తటస్థులు, వ్యతిరేకులను దాటుకొని అనేక గ్రామాల్లో భూపోరాటాలు సాగాయి.

ఇలాంటి స్థితిలో పోలవరం ప్రాజెక్టుతో పెద్ద పెద్ద కాంట్రాక్టర్లు రంగంలోకి వచ్చారు. వీళ్ళు పాలక పార్టీల నాయకులు, పార్లమెంట్ సభ్యులు (నామా నాగేశ్వరరావు, రాయపాటి సాంబశివరావు తదితరులు). వీరితో మొత్తం అధికార యంత్రాంగం కదిలింది. అంతకు ముందు భూపోరాటాల కాలంలో వైరుధ్యం భూస్వాములకు ఆదివాసులకు ఉన్నప్పుడు, 1/70 చట్టాన్ని అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం క్రియాశీలంగా భూస్వాముల తరపున నిలబడ లేకపోయింది. పోలవరం ప్రాజెక్టు రావడంతో పాలకులు అభివృద్ధికి, ఆదివాసుల జీవితాలకు పోటీ తెచ్చారు. (అభివృద్ధి వర్సెస్ ఆదివాసుల జీవనం). అభివృద్ధికరమైన పోలవరం ప్రాజెక్టు కట్టాలంటే కొంత మంది ఆదివాసుల గ్రామాలు మునిగిపోక తప్పదనే వాదన తెచ్చారు. ఈ అన్ని శక్తులు కలిసి, ఆదివాసుల్లోని భూపోరాట వ్యతిరేకులను, తటస్థులను కలుపుకొని, ఆదివాసుల పోరాట ఫలితాలను పోరాడుతున్న ఆదివాసులకు దక్కకుండా చేయాలని పూనుకొన్నారు. అవినీతి దీనికి ఇంధనంగా పని చేసింది. అనేక గ్రామాల్లో భూముల నష్టపరిహారాలు ఆదివాసులకు దక్కకుండా భూస్వాములే తీసుకొన్నారు. ఇదంతా ఒక క్రమంలో జరిగిన పరిణామం.

2004 నవంబరులో జరిగిన పోలవరం ప్రాజెక్టు శంకుస్థాపన నాటికే, రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్), దానికి అనుబంధ సంఘంగా ఏజెన్సీ గిరిజన సంఘంలు-అటు ప్రభుత్వం ముందు, ఇటు ప్రజల ముందు పునరావాసానికి సంబంధించిన తమ వైఖరిని ఈ విధంగా ఉంచారు.

1. నిర్వాసితులందరికీ ముందు సమగ్ర పునరావాసాన్ని కల్పించి, ఆ తర్వాతే ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టాలి.

2. పునరావాసం బిచ్చం కాదు. నిర్వాసితుల హక్కు. నిర్వాసితుల త్యాగాన్ని ముందు గుర్తించాలి. వీరికి న్యాయం చేసిన తర్వాతే ఇంకెవరికైనా న్యాయం చేయాలి. కనుక, భూమికి భూమి, అడవికి అడవి, శాస్త్రీయ సమగ్ర పునరావాసం కల్పించాలి.

3. ఆదివాసులు వ్యక్తిగతంగా పేదవారు. కానీ సామాజికంగా ఆస్తిపరులు. ఊరుమ్మడి, సాముదాయక ఆస్తులకు వారంతా ఉమ్మడి యజమానులు. రెవెన్యూ, భూసేకరణ చట్టాలు, నియమాలు-నష్టపరిహార లెక్కింపులో వీటిని పరిగణలోకి తీసుకోవు. నూటికి 95 మంది ఆదివాసులు, ఎటువంటి పట్టాలు లేనివారు. కానీ వీరందరూ భూములు సాగుచేస్తున్న రైతులు. కనుక మొదట ప్రభుత్వం వీరందరిని రైతులుగా పరిగణించి, ప్రతి కుటుంబానికి భూమికి భూమి ఇవ్వాలి.

పై మూడు అంశాలపై ఏజెన్సీ గిరిజన సంఘం 2004 నుండి ఈనాటి వరకు మడమ తిప్పకుండా నిలబడి, పోరాడుతోంది. ప్రజానీకానికి సమగ్ర శాస్త్రీయ పునరావాసంపై అవగాహన కల్పించేందుకు సంఘర్షణ పడింది. ప్రజలు చైతన్యంతో సంఘ అవగాహనను పట్టుకొని నిలిచిన చోట వారితో కలసి పురోగమించింది. ప్రజలు ఒడుదుకులకు గురై ఆగిపోయిన చోట వారిని నిలబెట్టానికి కృషి చేసింది.

2004 ప్రాజెక్టు నిర్మాణం పేరుతో ప్రభుత్వం చాలా దూకుడుగా వ్యవహరించింది. ప్రజలతో సంప్రదించకుండానే పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. ప్రొక్లయిన్లతో ఆదివాసుల శ్మశానాలను, సమాధులను తవ్వి పారేశారు. ఆదివాసుల మనోభావాలను నిర్లక్ష్యంగా దెబ్బతీశారు. గ్రామసభల తీర్మానాలను కూడా లెక్క చేయకుండా అధికార యంత్రాగం మొండిగా అన్ని నియమాలను పక్కనపెట్టి వ్యవహరించింది. అంతేగాక ప్రభుత్వం ఏజెన్సీ గిరిజన సంఘ నాయకులు కామ్రేడ్స్ సున్నం రాజులు, కుంజం రామారావు తదితర నాయకులను అరెస్టు చేసి రాజద్రోహ నేరం మోపి జైళ్ళలో నిర్బంధించింది.

ఇలాంటి పరిస్థితుల్లో ఆదివాసీ ప్రజానీకం, గిరిజన ప్రజలు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో తమ బతుకులు చీకటిమయమై పోతున్నాయని భయపడి, ఆందోళన చెందటం ప్రారంభించారు. ఆ సమయంలో ప్రభుత్వం 2009 నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందంటూ చేస్తున్న ప్రకటనల దూకుడు చూసి, ప్రజలు తీవ్రమైన మానసిక కుంగుబాటుకి గురయ్యారు. తమ ఇంటి సొంత పనులు, వ్యవసాయ పనులు కూడా చేసుకోవడం మానేశారు. అలాంటి పరిస్థితుల్లో 2006లో ఏజెన్సీ గిరిజన ఉద్యమ అగ్ర నాయకులైన సింహాద్రి సుబ్బారెడ్డి తదితరులు ఏజెన్సీ గ్రామాలలో పర్యటించారు. సమావేశాల్లో ప్రజలకు ధైర్యం చెప్పారు. 2020 నాటికి కూడా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాదని 2006లోనే వారు చెప్పారు. పాలకముఠాల మధ్య తగాదాలు, నిధుల కొరతల వల్ల ప్రాజెక్టును ప్రభుత్వం చెపుతున్నట్లు 2009 నాటికి పూర్తి చేయలేరని వివరించారు. ప్రజలు నిర్భయంగా భూముల కోసం నిలబడి, పునరావాస సాధన కోసం పోరాడుతూ, ప్రాజెక్టు కట్టి నీళ్ళు నిలబడేవరకు, ఇక్కడ మన భూముల్లో మనం నిలబడి పంటలు పండించుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రజలు ఈ పిలుపుని అందుకొని, అర్థంచేసుకుని, ధైర్యంగా నిలబడ్డారు. కొండమొదలు తదితర గ్రామాల వారందరూ 2022 జూన్ వరకూ వారి గ్రామాలలోనే ఉండి వ్యవసాయాలు సాగించారు.

## భూసేకరణ అధికారుల భూస్వామ్య పక్షపాతం-భూమి హక్కులను నిలుపు కొనేందుకు నిర్వాసితుల పోరాటం-కొండమొదలు అనుభవం :

కొండమొదలు ఆదివాసుల భూపోరాట హక్కులను పోలవరం ప్రాజెక్టు భూసేకరణ అధికారుల అండతో దెబ్బ తీసేందుకు భూస్వామ్య వర్గాలు పునుకొన్నాయి. దీని కోసం తూర్పు గోదావరి జిల్లాలో భూస్వామ్య వర్గాలకు మేలు చేకూర్చేందుకు, కొందరు అధికారులు ఆదివాసులకు అనుకూలంగా పరిష్కారమై పోయిన కొండమొదలు భూమి వివాదాలను తిరగతోడారు. ఆదివాసులకు తెలియకుండా మరలా భూవివాదాల ప్రత్యేక కోర్టు ద్వారా భూస్వాములకు నోటీసులు ఇచ్చి ప్రత్యేక కోర్టులో కేసులు వేశారు. కొండమొదలులో 1969లోనే 1/70 రెగ్యులేషన్ ప్రకారం ఏజెన్సీ భూ వివాదాలను విచారించడానికి రెవెన్యూ అధికారులే జడ్జీలుగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టుల వ్యవస్థ ఏర్పడి ఉంది. కొండమొదలు భూ వివాదాలలో తాలుకా కోర్టు, తరువాత సబ్ డివిజనల్ స్థాయి కోర్టులలో విచారణలు జరిగాయి. చివరకు జిల్లా కోర్టులో "ఆదివాసుల భూములను గిరిజనేతర భూస్వాములు ఆక్రమించుకొన్నారని, వారిని ఖాళీ చేయించి భూములను గిరిజనులకు అప్పగించాలని" 1989 నాటికే జిల్లా కోర్టు తీర్పు చెప్పింది. భూములలో ఆదివాసులు సాగులో ఉన్నారని సుప్రీంకోర్టు సైతం ధృవీకరించింది. ఆ భూములన్నీ కొండమొదలులో 1985 నాటి నుండి ఆదివాసుల సాగులో ఉన్నాయి. భూస్వాములు ఆ గ్రామాలను ఖాళీ చేసి ఎప్పుడో వెళ్లిపోయారు.

ఆయితే జిల్లా కోర్టు తీర్పు చెప్పి మూసివేసిన కేసులో ఇప్పుడు 2011లో జిల్లా కోర్టు కంటే కిందస్థాయి (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్) అధికారులు- భూస్వాములే ఆ భూములలో ఉన్నట్లు, మిమ్మల్ని ఎందుకు ఖాళీ చేయించరాదో చెప్పాలని నోటీసులు ఇచ్చి, కేసులు నమోదు చేశారు. వాళ్ళు లేని భూములలో వారు ఉన్నట్లు నిర్ధారిస్తూ, నోటీసులు ఇచ్చారు. ఈ విషయంలో సాగులో ఉన్న ఆదివాసులకు ఏ మాత్రం తెలియకుండా దీన్ని భూస్వాములు-అధికారుల విషయంగా మార్చారు. ఇదంతా ఒక కుట్ర ప్రకారంచేశారు. ఈ కోర్టుల్లో ప్రభుత్వాధికారులు మౌనంగా ఉండి, భూస్వాములు గెలిచేలా చూస్తారు. భూస్వాములకు అనుకూలంగా వచ్చిన కోర్టు తీర్పును అమలుచేసే పేరిట, భూసేకరణ అధికారులు భూస్వాములకే నష్టపరిహారం అందచేస్తారు. ఇదీ వారి పథకం. ఇదీ అర్థం చేసుకొన్న కొండమొదలు ఆదివాసులు ఈ కేసులన్నీటిలో 2013లో ప్రతివాదులుగా చేరారు. కోర్టుల్లో భూస్వాముల పన్నాగాలను ఎదుర్కొంటూ ఆ కేసులన్నింటిలో తమ వాదన వినిపిస్తూ నిలబడ్డారు.

ఈ క్రమంలో 2013లో కొత్త భూసేకరణ చట్టం అమలులోకి వచ్చింది. పోలవరం ప్రాజెక్టుకు ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభ తీర్మానం ప్రభుత్వాధికారులకు అవసరం అయింది. అధికారులు తమ సహజ నిర్లక్ష్య వైఖరిలో భాగంగా కొండమొదలులో జరగని ఒక గ్రామ సభను జరిగినట్టు చూపిస్తూ రికార్డు తయారు చేశారు. ప్రభుత్వ అధికారులు తయారుచేసిన ఈ తప్పుడు రిపోర్టుని వ్యతిరేకిస్తూ ఆదివాసులు హైకోర్టుకు వెళ్లారు. హైకోర్టు ఆదివాసుల వాదనలో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి అని చెబుతూ భూసేకరణ నోటిఫికేషన్‌లను అమలు చేయకుండా స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో కొండమొదలు ఆదివాసీ ప్రజానీకం తోటి ఒక ఒప్పందం చేసుకోవడానికి ప్రధానంగా ఐ.ఏ.ఎస్ అధికారుల చొరవతో, అధికార యంత్రాగం ముందుకు వచ్చింది. కొండమొదలు ఆదివాసులు ఏ భూముల కోసం అయితే గత 50 ఏళ్ళుగా పోరాడుతున్నారో, ఆ భూముల కోసం ఆదివాసులు కోరుకొన్న చోట 426 ఎకరాలు భూమిని కొనుగోలు చేసి అప్పగించడానికి, ఆదివాసుల సాగులోని 150 ఎకరాల బంజరు భూములకు ప్రభుత్వం చేత నష్టపరిహారం ఇప్పించడానికి 22-6-2017న అవగాహన పూర్వక ఒప్పందం (మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎం.ఓ.యూ) కుదిరింది. దీనిపై ప్రాజెక్టు అధికారులు, భూసేకరణ అధికారులు సంతకాలు చేసి, వాటినే రాష్ట్ర హైకోర్టుకు సమర్పించినాక ఆదివాసులు తమ కేసులు ఉపసంహరించుకొన్నారు.

ఇది ఇలా ఉండగా ఆదివాసులతో అధికార యంత్రాంగం చేసుకొన్న ఎంఓయు ను అమలు చేయడం కంటే ముందు భూస్వాములకే భూములపై నష్టపరిహారం ఇప్పించాలని మరికొన్ని శక్తులు పూనుకొన్నాయి. సరిగ్గా కోవిడ్ లాక్‌డౌన్‌లకు ముందు జనవరి నెల 8,9 తేదీలలో, 2011 నాటి కేసుల్లో ఇస్తున్న తీర్పు అంటూ భూస్వాములకు అనుకూలంగా భూవివాదాల కేసుల్లో అధికారి (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్) తీర్పులు ఇచ్చాడు. ఆ తీర్పులన్నీ వెనుకటి

తేదీలతో రాసినవి. ఈ తీర్పులు రావడానికి ముందే కొందరు భూస్వాములకు, భూసేకరణ అధికారులు, భూములకు నష్టపరిహారం కింద మొత్తం 17 కోట్ల రూపాయలు ఇచ్చారు. వీటిపై ఆదివాసులు కోవిడ్ సమయంలోనే ఆందోళన చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇచ్చిన పక్షపాత, చట్ట వ్యతిరేక తీర్పులపై జిల్లా కలెక్టర్, స్టే ఇచ్చారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కన్నా ఉన్నతమైన ప్రాజెక్టు ఆఫీసర్‌కి కేసులను అప్పగించారు. అప్పుడు కేసులన్నీ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి పిఓ నిర్వహించే సెటిల్మెంట్ కోర్టులో సువామోటోగా విచారణ జరపమని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పిఓ కోర్టు విచారణ జరిపి, 2022 ఫిబ్రవరిలో భూస్వాముల వాదనలను కొట్టివేస్తూ తీర్పు చెప్పింది. భూస్వాములకు అక్రమంగా డబ్బులు చెల్లించిన భూసేకరణ, రెవెన్యూ అధికారులను, వారు వేరే కేసులో కూడా అవినీతి చర్యలకు పాల్పడినందుకు అరెస్టు చేసి జైళ్ళలో పెట్టారు. కేసులు నమోదు చేసి ఇప్పుడు విచారణ చేస్తున్నారు.

2019 నుంచి గోదావరి ఎగువ ప్రాంతాలు వరదలలో ముంపుకు గురికావడం ఎక్కువైంది. కారణం గోదావరి నదిలో ప్రాజెక్టుకు ఎగువున కాఫర్ డ్యాము నిర్మాణం చేయడమే. ఫలితంగా దేవీపట్నంలోని అనేక గ్రామాల ప్రజలు నష్టపరిహారాలు అందకుండానే తమ తమ గ్రామాలను ఖాళీ చేసి కాలనీలకు తరలి పోయారు. కానీ కొండమొదలు పంచాయితీలోని గ్రామాల ప్రజలు వరదల మధ్య కూడా ఎత్తైన ప్రాంతాలకు వెళ్ళి పాకలు వేసుకొని ఉన్నారు కానీ భూముల సమస్య స్పష్టపడే వరకూ కదల రాదని నిర్ణయించుకొన్నారు. భూములకు సంబంధించిన ప్రాధమిక నోటిఫికేషన్‌లు అన్నీ విడుదల అయ్యాక, కాలనీ నిర్మాణం అంతా పూర్తి అయ్యాకనే నేలదోనేలపాడు కాలనీకి తరలి రావాలని నిర్ణయించుకొన్నారు. ఎంఓయులో పేర్కొన్న 426 ఎకరాల భూముల సేకరణకు ప్రాధమిక నోటిఫికేషన్‌లు విడుదల అయ్యాయి. అంతకు ముందే కొండమొదలు ఆదివాసులలో 424 కుటుంబాలకు 426 ఎకరాల కొనుగోలుకు అవసరమైన 42 కోట్ల రూపాయలు విడుదల అయ్యాయి. మిగిలిన క్రమం పూర్తి అయ్యేవరకు అంటే భూములు దక్కే వరకూ అప్రమత్తంగా ఉండాలని ఆదివాసులు అనుకొన్నారు. ఆ ప్రకారమే 2022 ఏప్రిల్ 19న కాలనీ ప్రారంభోత్సవంను ప్రజలు జరుపుకొన్నారు. కొత్త సమస్యలతో, సవాళ్ళతో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు.

ఈ చరిత్రంతా భూస్వాముల పెత్తనం సాగుతున్న నేటి వ్యవస్థలో చారెడు నేల కోసం పోరాడి భూస్వామ్య వర్గాలను ఎదిరించి ఆదివాసులు, పీడితులు భూములను నిలబెట్టు కోవాలంటే ఎంతో చైతన్యాన్ని, పోరాట పటిమను, పట్టువిడుపుల వైఖరిని, కలిగి ఉండాలని తేటతెల్లం చేస్తున్నది. భూపోరాటం భూముల మీదే కాక రకరకాల చట్టపర వేదికల మీద, వివిధ రూపాలలో సాగుతుందనీ –దృఢంగా పీడిత ప్రజలు సంఘ నిర్మాణాల వెనుక నిలబడి, బలపడాలని అనుభవాలు నేర్పుతూ ఉన్నాయి.

కొండమొదలు ఆదివాసుల భూపోరాటం, భూముల మీదే కాక కోర్టుల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, కాగితాల మీద ఇలా ప్రతి చోటా సాగింది. అన్ని మలుపులలో పునరావాసం కోసం పోరాటం, భూపోరాటంతో జతపడి సాగుతూనే వచ్చింది.

కొండమొదలు ప్రేరణ, మద్దతులతో పశ్చిమ గోదావరిలో వెంకటరెడ్డిగూడెం, కుంకాల, మనుగోపాల తదితర ప్రాంతాలలో ఆదివాసి భూపోరాటం సాగుతున్నది. మంటూరు ఆదివాసులు చివరి వరకూ అమరుడు కామ్రేడ్ వీరపరెడ్డి నాయకత్వంలో గిరిజనోద్యమ పురోగమనం కోసం కృషి చేసారు.

ఈ కాలం అంతా కొండమొదలు ప్రజలు తమ కోసం నిలిచిన నాయకులను, కార్యకర్తలను తమవాళ్ళుగా సొంతం చేసుకొన్నారు. గొప్ప ప్రేమాభిమానాలను చూపించారు. అదే సమయంలో ఈ అనుబంధాలకు ఉద్యమ, రాజకీయ స్వభావాలు కోల్పోకుండా చూసుకొన్నారు. ఎందరో కార్యకర్తలు తాత్కాలికం గానూ, దీర్ఘకాలంగానూ కొండమొదలులో పని చేయడానికి వచ్చారు.కొందరు వెళ్ళిపోయారు. వారు కృషి చేసిన కాలం ఎంత తక్కువదైనా కూడా ప్రజలు వారి కృషిని గుర్తుంచుకొన్నారు. అదే సందర్భంలో ఇక్కడే పుట్టి పెరిగినవారు వేరే నిర్మాణాలలోకి వెళ్ళినపుడు, సంఘానికి వ్యతిరేకంగా నిలచినపుడు వారిని పక్కన పెట్టడానికి ఒక్కక్షణం కూడా వారు వెనుకాడలేదు.

ఈ కాలంలో గిరిజనోద్యమ నాయకులు కామ్రేడ్స్ కుండ్ల గంగరాజు, కుండ్ల (వెజ్జు) రామిరెడ్డి, మడి పండయ్య, చింతలాడ పెద్దిరెడ్డి, చింతలాడ చిన్నబ్బాయి (తూటిగుంట), గొర్రె లక్ష్మమ్మ, వంజం కన్నమ్మ, సున్నం రాజు, చెదల వీరపురెడ్డి, తదితరులు, కొండమొదలును అన్నిరకాలుగా కనిపెట్టుకొన్న కామ్రేడ్ మానం రామారావు గారు, కామ్రేడ్ జస్వంత్, ఆదివాసుల ఆత్మబంధువు బి.డి.శర్మ ఇంకా అనేక మంది అమరులైనారు. వాళ్ళ స్ఫూర్తితో ఉద్యమం పురోగమిస్తుంది.

దీనిలో పేర్కొన్న వివిధ అంశాల గురించిన వివరాలు, ఆధారాలు లోపలి పేజీలలో చూడవచ్చు. ★

## శ్రీకాకుళ...

(చివరి పేజీనుండి)

ప్రాంతాన్ని వ్యవసాయకంగా అభివృద్ధి చేయవచ్చని, అలాగే ఉద్దానం ప్రాంతంలో ఉన్న మంచినీటి సమస్యను పరిష్కరించవచ్చని, తద్వారా ఆ ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు అరికట్టవచ్చని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను పెంచి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించవచ్చని, కానీ ప్రభుత్వాలు ఆ పనిచేయడం లేదని,ఈ ప్రాంతాన్ని వెనుకబడిన ప్రాంతంగా, వలసల కేంద్రంగా ఉంచుతున్నారని దీనికి వ్యతిరేకంగా ఈ ప్రాంత ప్రజలందరూ పోరాడాలని పిలుపునిచ్చారు.

ఏపీటీఎఫ్ భానుమూర్తి గారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సరైన ఉపాధి అవకాశాలు లేక యువత వలసలు పోతున్నారని ఈ ప్రాంత యువతకు ఉపాధి కల్పించే విధంగా ఫ్యాక్టరీలను ఏర్పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్య క్రమంలోరైతు కూలీ సంఘం మన్యం జిల్లా నాయకులు కామ్రేడ్ పి. శ్రీను నాయుడు, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ తవిటమ్మ పాల్గొని ప్రసంగించారు. రైతు కూలీ సంఘం (ఆంప్ర) నాయకులు కామ్రేడ్స్ పోలారావు, లక్ష్మీనారాయణ, చుట్టుపక్కల గ్రామాల నుండి రైతులు, గిరిజనులు, మహిళలు పాల్గొన్నారు.

## పార్వతీపురంలో ప్రదర్శన, ధర్నా

మహత్తర శ్రీకాకుళ గిరిజన రైతాంగ ఉద్యమ తొలి అమరులు కామ్రేడ్స్ కోరన్న, మంగన్నలకు జోహార్లు అర్పిస్తూ, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పార్వతీపురం గిరిజన భవన్ వద్ద నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రైతు కూలీసంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తొలుత గిరిజన భవన్ వద్ద సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ పి.శ్రీనునాయుడు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో సంఘం రాష్ట్ర నాయకులు కామ్రేడ్స్ ఎస్. ఝాన్సీ, డి.వర్మ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ★

కార్మికవర్గ ఆందోళనలూ, సమ్మెలు

కొమరయ్య

# 1982 నాటి బొంబాయి జౌళి కార్మికుల చారిత్రాత్మక సమ్మె-గుణపాఠాలు

**1982** సం॥లో 8 నెలలపాటు సాగిన బొంబాయి జౌళి మిల్లు కార్మికుల సమ్మె, భారత దేశచరిత్రలో అతిపెద్దదైన, సుదీర్ఘకాలంపాటు జరిగిన సమ్మె. ఈ సమ్మెను పాలకులు, పాలకవర్గాలు, మిల్లు యజమానులు, వ్యవస్థీకృత కేంద్ర ట్రేడ్ యూనియన్ల సహకారంతో అధికారంలోనున్న పాలకవర్గ పార్టీ ప్రభుత్వం, ఘోరంగా ఓడించింది. బొంబాయి జౌళి మిల్లు కార్మికుల సమ్మెపట్ల వ్యవస్థీకృత కేంద్ర వామపక్ష ట్రేడ్‌యూనియన్ల పాత్ర, వారి దృక్పధము, మహారాష్ట్రలోను, కేంద్రంలోనూ అధికారంలో నున్న పాలకపార్టీ అయిన కాంగ్రెస్(ఐ)కు అనుబంధంగా నున్న కేంద్ర ట్రేడ్ యూనియన్ ఐఎన్‌టియుసికి ఏవిధంగా భిన్నంగా లేదు. భారత కార్మికోద్యమంపై ఈ సమ్మె దీర్ఘకాల ప్రభావాన్ని కలగించటంతోపాటు కార్మికవర్గ ఉద్యమానికి ప్రాధాన్యత కలిగినదిగా వుంది. భారత కార్మికోద్యమాన్ని ఒక నిజమైన, అవసరమైన తీరులో రూపొందించటానికి ఈ సమ్మె నుండి అనేక గుణపాఠాలను తీసుకోవచ్చు.

బొంబాయి జౌళిమిల్లు కార్మికులకు సమరశీలమైన, ఇంకా రాజకీయ సమరశీలమైన పోరాటాలను నిర్వహించిన మహత్తరమైన గత చరిత్ర వుంది. బొంబాయి జౌళి కార్మికులు, భారత శ్రామికోద్యమానికి అగ్రగామిగా ఒక సందర్భంలో గుర్తింపు పొందారు. తొట్టతొలి రోజుల్లో అత్యంత సమరశీల రూపాలతో బొంబాయి జౌళి కార్మికులు భారతదేశంలో నిర్మాణయుతమైన శ్రామికులుగా వున్నారు. బ్రిటిష్ పాలకులు మోపిన దేశద్రోహం కేసులో 1908 సం॥లో లోకమాన్య బాలగంగాధర తిలక్‌కు ఆరు సం॥ల కఠిన కారాగార శిక్ష విధించటాన్ని నిరసిస్తూ బొంబాయి జౌళి కార్మికులు ఐక్యంగా ఉద్యమించారు. ఆరు రోజులపాటు బొంబాయిలోని మిల్లులన్నీ మూత బడ్డాయి. ఈ తిరుగుబాటు గురించి వార్తలను విన్న లెనిన్, "భారత కార్మికవర్గం వర్గచైతన్యంతో రాజకీయ ప్రజాపోరాటాలు నిర్వహించేందుకు తగిన పరిపక్వతను ఈ పాటికే పొందింది..." అని రాశారు.

ఆనాటి నుండి మొదలుకొని, బొంబాయి జౌళి మిల్లు కార్మికులు మెరుగైన తమ జీవన పరిస్థితులకోసం, ప్రాథమిక హక్కులకోసం, న్యాయమైన అవకాశాలకోసం పోరాడుతూనే వున్నారు.

1947లో అధికారమార్పిడి తదనంతరం కూడా, కార్మికుల జీవన పనిపరిస్థితులు మెరుగుకాకపోవడంతో, తమ ఆర్థిక డిమాండ్లతో మాత్రమేకాక, రోజురోజుకీ దిగజారుతున్న తమ జీవన-పని పరిస్థితులలో మెరుగుకోసం, వాటిని సాధించుకునేందుకు సమ్మెలు చేయటం మినహా వారికి మరో గత్యంతరం లేకపోయింది.

"మిల్లులో పరిస్థితులు చాలా నాసిగా వున్నాయి-బీటలు వారిన భవనాలు, కాంతి హీనమైన పని ప్రదేశాలు, మురికిగోడలు, మొదలుగా సదుపాయాలన్నీ శిథిలావస్థలో నున్నాయి. పాతకాలపు యంత్రసామాగ్రితో నున్న అత్యధిక మిల్లులను పారిశ్రామిక మురికివాడలుగా మాత్రమే వర్ణించగలం... మిల్లుల నిర్వహణ, యంత్రాలు అన్నీ దాదాపు అవసానదశ స్థితిలో నిర్వహించబడుతున్నాయి" అని 1975 నాటి ప్రపంచబ్యాంకు నివేదిక చెబుతోంది.

1982 నాటికి కార్మికుల స్థితిగతులు మరింత దిగజారాయి. ఈ దశాబ్దంలో పనిభారం క్రమంగా పెరిగింది. 1980 నాటికి గడిచిన 2 దశాబ్దాల కాలంలో మిల్లుల ఆధునీకరణ, యాంత్రీకరణలు-16 శాతం కార్మికుల సంఖ్యను కుదించటానికేగాక, యంత్రాల వేగాన్ని పెంచటం ద్వారా కార్మికుల పనిభారాన్ని పెంచేందుకు కూడా కారణమయ్యాయి. మిల్లుల ఆధునీకరణకు ముందు దశలో, ఒక్కో కార్మికుడు నాలుగు మగ్గాలను నిర్వహిస్తూ వుండేవారు. అయితే ఆధునీకరణ తర్వాత ప్రతి జౌళికార్మికుడు నిర్వహించాల్సిన మగ్గాల సంఖ్య 16 లేదా 22కు పెరిగింది. పనిలో ఈ విధమైన భారీ పెరుగుదల, అత్యంత వత్తిడిని, నిస్సత్తువను పెంచి పని ప్రదేశాల్లో కార్మికుల ప్రమాదాలను మరిన్ని పెంచటంతోపాటు, కార్మికుల ఆరోగ్యం మరింత దిగజారిపోయేందుకు, కార్మికులు అత్యధిక శాతంలో గైర్హాజరుకావటానికి కూడా ఇది దోవతీసింది.

అయితే ఇంతటి ప్రమాదకరమైన, వత్తిడితో కూడిన పరిస్థితులలో కార్మికులచే కష్టభరితమైన శ్రమ చేయిస్తున్నప్పటికీ, వేతనాలు దాని కనుగుణంగా ఏమాత్రం లేవు. ఈ ప్రాంతంలోని ఇతర పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలలో పోల్చినపుడు కూడా జౌళి కార్మికుల వేతనాలు సాపేక్షంగా తక్కువగా వున్నాయి. ఈ వేతనాలతో కార్మికులు కనీస సంతృప్తస్థాయి జీవనాన్ని కూడా గడపగల పరిస్థితి లేదు.

పైగా, ఈ మిల్లులలో పనిచేసే 2.3 లక్షల మందికి పైగా కార్మికులలో లక్షమందికి పైగా కార్మికులు 'బదిలీ' కార్మికులుగా వున్నారు. వీరిలో అత్యధికులకు సాధారణంగా నెలలో 5 నుండి 10 రోజులలో మాత్రమే పని దొరుకుతుంది. ఏవిధమైన గ్యారంటీ లేకుండానే పని దొరుకుతుందో లేదో అని ప్రతిరోజూ వారు పనికోసం ఆశతో మిల్లులవద్దకు వెళ్తారు. 'బదిలీ' కార్మికులు ఎప్పటికీ పర్మినెంటు కార్మికులు కాలేరు. ఒక పద్ధతి ప్రకారం వారి పనిదినాలలో అంతరాయాలు కల్పిస్తూ, నిరంతరాయంగా 240 రోజుల సర్వీసును పూర్తిచేస్తే అనేక సదుపాయాలకు వారు అర్హులవుతారు కనుక ఆవిధంగా వారు పూర్తిచేయకుండా నిరోధిస్తారు.

జౌళి మిల్లు కార్మికుల జీవన పరిస్థితులు, 20వ శతాబ్దపు రెండో అర్ధభాగంలో కూడా శోచనీయంగా వున్నాయి. అత్యధిక కార్మికులు మురికిగా వుండే సత్రాలలో 10 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు వుండే ఒక్కో గదిలో 15 నుండి 30 మంది నివసించేవారు. ఒక గదిలోని పడకలను రొటేషన్ పద్ధతుల్లో వివిధ షిఫ్టులలో పనిచేసే కార్మికులు 60 నుండి 80 మందికి ఉపయోగించేవారు. శిథిలమైన సత్రాలలో, మురికి తాండవించే ఇరుకు సందులలో, దాదాపు ఎప్పుడూ తగినంత నీటి సరఫరా వుండని కామన్ లెట్రిన్‌లను ఉపయోగించుకుంటూ వారు జీవించేవారు. వారు నివసించే సత్రాల బయట రహదార్లు మురుగునీటితో తేమగా వుండి దుర్భరంగా వుండేవి.

కార్మికుల ఈ దుర్భరమైన జీవన-పని పరిస్థితులు, వారి దుస్థితి అనివార్యంగా 1982లో వారు సమ్మె బాట చేపట్టేందుకు కారణమైంది. ఈ సమ్మె 1982 జనవరిలో ప్రారంభమైంది. 'మహారాష్ట్ర గిర్ని కామ్‌గార్

యూనియన్'(ఎమ్‌జెకెయు) బ్యానర్ క్రింద 60 మిల్లులకు చెందిన 2,30,000 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. పూర్వ కాంగ్రెస్(ఐ)కి చెందిన ఎమ్ఎల్ఏ, ఇంజనీరింగ్ పరిశ్రమలో ఐఎన్‌టియుసి కార్మిక సంఘాల నాయకుడైన డా॥దత్తాసామంత్ దీనికి నాయకత్వం వహించాడు.

1957 వరకు బొంబాయి జౌళిమిల్లు కార్మికులు తమ వీరోచిత పోరాటాల ద్వారా వివిధ పరిశ్రమలలోని ఇతర కార్మికులకంటే మెరుగైన వేతనాలను, సౌకర్యాలను పొంద గలిగారు. అయితే, ఐఎన్‌టియుసికి అనుబంధంగా వున్న, గుర్తింపు పొందిన యూనియన్ ఆర్ఎమ్ఎమ్ఎస్, కార్మికుల ప్రయోజనాలు సాధించటంలో విఫలమైంది. మిల్లు యాజ మాన్యాలతో చేతులు కలిపి, యాజమాన్యలతో జౌళి కార్మికుల ప్రయోజనాలకు నష్టంచేసే అనేక హానికరమైన ఒప్పందాలపై సంతకాలు చేయటం ద్వారా ఆర్ఎమ్ఎమ్ఎస్ కార్మికులను మోసగించింది. ఇతర పారిశ్రామిక కార్మికు లందరితోపాటు జౌళి మిల్లు కార్మికులకు కూడా శాపంలాగా పరిణమించిన, 1946లో ఆమోదం పొందిన బొంబాయి పారిశ్రామిక సంబంధాల చట్టం(బిఐఆర్) దీనికి తోడైంది. ఈ చట్టం చట్టబద్ధ సమ్మెలోకి వెళ్ళటాన్ని కూడా కార్మికులకు అసాధ్యం చేసింది. కార్మికులకు చర్చలలో ప్రాతినిధ్యం వహించే ప్రతినిధిని కూడా ఈ చట్టమే నిర్ణయించటమనేది, పాలక కాంగ్రెస్ పార్టీ సహకారంతో ఆర్ఎమ్ఎమ్ఎస్ గుర్తింపు యూనియన్‌గా రావటానికి దోహదపడింది. కార్మికులు తమ చట్టబద్ధమైన హక్కుల సాధన కోసం మిల్లు యజమానులకు వ్యతిరేకంగా న్యాయమైన పోరాటం సాగించేందుకు కూడా బిఐఆర్ చట్టం కార్మికులకు ఓ స్థిరమైన అడ్డంకిగా తయారైంది. ఆర్ఎమ్ఎమ్ఎస్‌ను సవాల్‌చేస్తూ తలెత్తిన కార్మిక సంస్థదేన్నైనాగానీ అణచి వేసేందుకు బిఐఆర్ చట్టాన్ని ఒక సాధనంగా వినియోగిస్తూ వచ్చారు.

మరోవైపున ఏఐటియుసి, సిఐటియు వంటి వ్యవస్థీకృత కేంద్ర వామపక్ష ట్రేడ్ యూనియన్లు, ఆర్ఎమ్ఎమ్ఎస్ సాగించే అఘాయిత్యాలనుండి తమను రక్షించాలని, తమ సమస్యలను చేపట్టాలని కోరుకుంటున్న బొంబాయి మిల్లు కార్మికులను కాపాడేందుకు ఎలాంటి చొరవా తీసుకోలేదు. ఆ సమయానికే, ఆ ట్రేడ్ యూనియన్లు చట్టబద్ధ యంత్రాంగాన్ని అనుసరిస్తూ యాజమన్యాలచే బాధ్యతాయుతమైన ట్రేడ్ యూనియన్లుగా, అప్పటికే పరిగణించబడుతూ వున్నాయి.

కార్మికుల దుర్భరమైన జీవన-పని పరిస్థితులకు తోడు, చట్టబద్ధ యంత్రాంగంతో కార్మికులలో పూర్తి నిస్పృహ ఆవరించి వుండటమనేది వారి సమరశీల మానసికస్థితిని పెంపుచేసే ఒక ముఖ్యమైన అంశంగా వుండి, మిల్లు కార్మికులు పోరాట మార్గాన్ని ఎంచుకొని 1982 జనవరి 18 నుండి నిరవధిక సమ్మె చేపట్టారు.

ప్రభుత్వం సమ్మెచేస్తున్న కార్మికులపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది. 144 మరియు 30 సెక్షన్లు విధించింది. అనేకమంది చురుకైన కార్యకర్తలను అరెస్టు చేసింది. మిల్లు కార్మికులపై క్రూరంగా లాఠీఛార్జీకి పాల్పడింది. అనేకమంది కార్మికులను తప్పుడు కేసులలో ఇరికించింది. 'ఎస్మా' క్రింద సమ్మెకు నాయకత్వం వహిస్తున్న వారిని జైళ్ళలో నిర్బధించింది. సమ్మెచేస్తున్న కార్మికులు నిర్వహించే సమావేశాలపై పోలీసులు దాడులు చేశారు. అనేకమంది కార్మికుల కుటుంబాలను పోలీసులు నిర్బంధించి, వేధించారు. 1974 నాటి అఖిలభారత రైల్వే కార్మికుల సమ్మె సందర్భంగా చేసినట్లే, కార్మికుల ఇంటింటికీ వెళ్ళి పనిలోకి తిరిగి వెళ్ళవలసిందిగా కార్మికులను ఆదేశించారు. సమ్మెలో క్రియాశీలురైన వారిని 'నాసా' చట్టంక్రింద నిర్బంధించారు. ఈ సమ్మెను శాంతిభద్రతల సమస్యగా పరిగణించి అణచివేతకు పాల్పడ్డారు.

ఈ సమ్మెకు వ్యతిరేకంగా మిల్లు యజమానులు మొండివైఖరి తీసుకున్నారు. మిల్లులను మూసివేయటం తమ ప్రయోజనా లకు తగినదిగా వుంటుందని వారు భావించారు. విద్యుత్తు మగ్గాల విభాగానికి వారు తమ ఉత్పత్తిని మళ్ళించారు. 1975 నాటి ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, జౌళి పరిశ్రమ లాభాలలో పరిగణించదగిన భాగం, ఇతర పరిశ్రమలకు మళ్ళించబడింది. సమ్మె సమయంలో బొంబాయిలోని సమ్మిళిత మిల్లుల యజమానుల ఆధ్వర్యంలో అసంఖ్యాక విద్యుత్తు మగ్గాలు స్వంతంగాగానీ, వారి ప్రాపకంతోగానీ ఆవిర్భవించాయి. పైగా, ఒక దృఢమైన వైఖరితో వుండవలసిందిగా కేంద్రప్రభుత్వం మిల్లు యజమానులకు సలహా నిచ్చింది. దీనికి తోడు, కేంద్రప్రభుత్వం ప్రత్యేకించి, ఈ సమ్మెకు నాయకత్వం వహిస్తున్న దత్తాసామంత్‌తో చర్చలు జరపవద్దని మిల్లు యజమానులకు నొక్కి చెపుతూ దిశానిర్దేశం చేసింది. ఈ సమ్మెతో, తమ మిల్లులను మూతవేసి, ఆ భూములను అమ్ముకొని, నగరానికి వెలుపల, శ్రమశక్తి, విద్యుత్తు, నీటివసతి, ఇతర మౌలిక సదుపాయాలు చౌకగా లభించే ప్రాంతాలలో ఆధునిక యంత్రాలతో పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చని మిల్లు యజమానులు నమ్మకంగా వున్నారు. ప్రభుత్వం తీసుకున్న మిల్లులకు చెందిన మిగులు భూమిని అంతిమంగా అమ్ముకునే అవకాశం కల్పించినందుకు మిల్లు యజమానుల నుండి కాంగ్రెస్(ఐ) 50 కోట్ల రూ॥ల లంచం తీసుకొందని రాజకీయ విభాగాలలో పుకారు వుంది. మిల్లుల భూముల అమ్మకం, స్థిరాస్థి వ్యాపారపు సుందర భవిష్యత్తు కూడా సమ్మెచేస్తున్న కార్మికులతో చర్చలు జరిపి, సమ్మెనువిరమింపజేసే ప్రయత్నాలను మిల్లు యజమానులు చేపట్టకుండా మొండివైఖరితో నుండటంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషించింది. ఉదాహరణకు, ఇటీవల 2023 సెప్టెంబర్ 14న-బాంబే డైయింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ 5,200 కోట్ల రూపాయల మొత్తంగా పరిగణించే వర్లీకి చెందిన 22 ఎకరాలను 'గోయిసు రియాల్టి ప్రైవేట్ లిమిటెడ్'కు అమ్మేందుకు ఆమోదం తెల్పింది. కనుక, కాలంచెల్లిన యంత్రసామాగ్రితో, అత్యధిక కార్మికుల వినియోగంతో కూడిన మిల్లులను నడిపే కాలంలో, ఆ మిల్లుల భూములను స్థిరాస్థి వ్యాపారంతో, అమ్మకంతో, లభించే అసాధారణ ఆదాయం ద్వారా పొందే గొప్ప సంపదల గురించి ఇది మనకు తెలియజెప్తోంది.

సమ్మెపట్ల మిల్లు యజమానులు, ప్రభుత్వం అనుసరించే మొండివైఖరిని, సాగించే పోలీసు నిర్బంధాన్ని బలపరిచే వైపుగానే న్యాయవ్యవస్థ వ్యవహరించింది. సమ్మె చేస్తున్న కార్మికులు మిల్లుల ఎదుట పికెటింగ్ చేయటాన్ని న్యాయస్థానాలు నిషేధించాయి. సమ్మెచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని, మిల్లు యజమానులను న్యాయ స్థానాలు ఆదేశించలేదు. పాలకుల, పాలకవర్గాల ప్రయోజనాలు నెరవేర్చేందుకు వారి చేతిలో సాధనాలుగా అవి రుజువుచేసుకున్నాయి.

'సమస్యాత్మక కార్మికులను', సమ్మెచేస్తున్న జౌళి మిల్లు కార్మికులను ఎంతమాత్రం సహించబోమనే ఐఎంఎఫ్ షరతులకు తలొగ్గి, ఐఎంఎఫ్ నుండి ప్రభుత్వం తీసుకున్న 5 వేల కోట్ల రూపాయల రుణం కూడా, జౌళి కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వం కఠినవైఖరిని తీసుకోవటంలో ఒక పాత్ర పోషించింది.

ప్రచార మాధ్యమాలు - 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వంటి జాతీయ దినపత్రికలు, మాతృభాషలో వెలువడే దాని వార్తా దినపత్రిక 'లోకసత్తా' వంటి పత్రికలు-వక్రీకరించబడిన వార్తాంశాలు, సంపాదకీయాలు, వ్యాఖ్యానాలు మొదలగు వాటితో, సమ్మెకు నాయకత్వం వహిస్తున్న సామంత్‌పై ఆరోపణలు చేస్తూ, మిల్లు యజమానుల, ప్రభుత్వ అభిప్రాయాలను

ప్రతిబింబించి, కార్మికులను తప్పుదోవ పట్టిస్తూ, జౌళి కార్మికులను వ్యతిరేకించటంలో తమ పాత్రను పోషించాయి. సమ్మెను వ్యతిరేకిస్తూ మిల్లు యాజమాన్యాల పూర్తి పేజీ ప్రకటనలను కూడా అవి ప్రచురించాయి.

కేంద్ర ట్రేడ్ యూనియన్ కేంద్రాలతో సహా వ్యవస్థీకృత కేంద్ర ట్రేడ్ యూనియన్లు సమ్మెకు వ్యతిరేకమైన, శత్రుపూరితమైన, పాత్రను పోషించాయి. కార్మికులను, శ్రామిక ప్రజానీకాన్ని నిర్దాక్షిణ్యమైన దోపిడీకి, అణచివేతకు గురిచేస్తున్న పెట్టుబడిదారులకు, పాలకవర్గాలకు, ఆధిపత్య పీఠాలకు వ్యతిరేకంగా కార్మిక, ప్రజాపోరాటాలు నిర్మించి, అభివృద్ధిచేస్తాయని చెప్పబడే వామపక్ష ట్రేడ్ యూనియన్లు దోపిడీదారులకు, అణచివేత దారులకు మద్దతుగా వున్న వ్యవస్థ పక్షాన నిలిచాయి. పీడకులకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలనే కార్మికుల సంకల్పానికి జౌళి కార్మికుల సమ్మె ఒక నిశ్చిత రూపంలోని వ్యక్తీకరణగా అర్థంచేసుకొనేందుకు వీరు నిరాకరించారు. ట్రేడ్ యూనియన్ నాయకత్వాన్ని హస్తగతం చేసుకునేందుకు దత్తాసామంత్‌ను పోటీదారుగా భావించే తమ సంకుచిత శతృత్వ యూనియన్ దృష్టితో, వ్యతిరేకతతో, వామపక్ష ట్రేడ్ యూనియన్లు, సమ్మె చేస్తున్న కార్మికుల నడుమ ఉన్నతస్థాయి వర్గ చైతన్యాన్ని పెంపొందించటానికి, ఈ భారీ సమ్మెను ఒక అవకాశంగా వినియోగించకోవటంలో ఉద్దేశ్య పూర్వకంగానే విఫలమయ్యాయి. సమ్మెచేస్తున్న జౌళి మిల్లు కార్మికుల నడుమ, వారి వర్గ చైతన్యాన్ని, సమరశీలతను పెంపొందించే విధంగా, సమ్మెను విస్తృతపరిచి, ఇతర విభాగాల లోని కార్మికుల మధ్యకు తీసుకెళ్ళేందుకు అనుగుణంగా కార్మికుల నడుమ పనిచేయటాన్ని వారు ఉద్దేశ్యపూర్వకంగా ఎగవేశారు. సమ్మె విజయవంతం అయ్యేందుకు కార్యాచారణ పథకాన్ని అభివృద్ధిచేయటానికి వారి చట్టబద్ధ వాదం వారిని అనుమతించలేదు. "ఆనాటి పారిశ్రామిక కాలంతో నెలకొన్న భౌతిక పరిస్థితులు మరియు జౌళి పరిశ్రమలో గత సంవత్సరాలలో సంభవించిన వరుస చారిత్రక పరిణామాల అనివార్య ప్రతిఫలనం"గా ఈ సమ్మెను చూడకుండా ఉద్దేశ్యపూర్వకంగా వారు నిర్లక్ష్యం వహించారు.

కేంద్ర ట్రేడ్ యూనియన్లు చీలికలకు గురవటం, అవి విడివిడిగా రూపొందటమనేది కూడా కార్మికులపైనా, పోరాటాలపైనా ఒక దుష్ప్రభావాన్ని చూపింది. స్వాతంత్ర్యం తర్వాత దాదాపు ప్రతి రాజకీయపార్టీ తమ స్వీయ ట్రేడ్ యూనియన్ విభాగాన్ని నెలకొల్పాయి. కాంగ్రెస్ ఐఎన్‌టియుసిని ఏర్పరచింది. సోషలిస్టులు హెచ్‌హెచ్ఎమ్‌పిని ఏర్పరచగా అది హెచ్ఎమ్ఎస్‌లో విలీనమైంది. అసంతృప్తి చెందిన సోషలిస్టులు యుటియుసిని ఏర్పరచి, దానిని ఆర్ఎస్‌పికి అనుబంధం చేశారు. సిపిఐలో చీలికతో, ఏఐటియుసి విడివడి సిఐటియు ఏర్పడింది. బిజెపి బిఎంఎస్‌ను స్థాపించింది. ప్రాంతీయ పార్టీలైన శివసేన, డిఎంకె, ఏఐడిఎంకె, టిడిపి వంటివి తమస్వీయ జేబుసంస్థలైన ట్రేడ్ యూనియన్లను ఏర్పరచు కున్నాయి. ఈ రకంగా విడివడి వుండటంవలన ఏ యూనియన్‌తోనైనా తాము కలిసివుండటాన్ని తాత్విక, సైద్ధాంతిక ప్రాతిపదికపై కంటే కూడా, ఒక ఒప్పంద ప్రాతిపదికగా కార్మికులు పరిగణిస్తూ వచ్చారు. శ్రామికోద్యమం, కార్మికుల నడుమ ఉన్నతస్థాయి చైతన్యాన్ని కల్గించటానికి కంటే కూడా, ఫక్తు ట్రేడ్ యూనియన్ లక్ష్యాలను కొనసాగించే ఒక ఉద్యమంగా మిగిలిపోయింది. కేంద్ర ట్రేడ్ యూనియన్లు, ఉన్నత వేతనాల కొరకు పోరాట ఆర్థికవాదాన్ని మించి తమ స్థానాలను నిలుపుకునేందుకు ప్రభుత్వాలు, యాజమాన్యాలతో అవకాశవాద ఒప్పందాలు చేసుకోవటం మినహా ఒక నూతన వ్యూహాన్ని అభివృద్ధిచేయటంలో విఫలమయ్యాయి. ట్రేడ్ యూనియన్ ప్రజాస్వామ్యాన్ని నిరాకరిస్తూ వారి నాయకత్వం నిరంకుశంగా తయారైంది.

మరోవైపున లాల్ నిశాన్ పార్టీ అనుబంధమైన 'సర్వశ్రామిక్ సంఘ్', దాని కార్యకర్తలు సమ్మెకు మద్దతు తెలిపారు. 'శ్రామిక్ విచార్' అనే వార్తా దినపత్రిక సమ్మెకు క్రియాశీలకమైన మద్దతును అందించింది. వ్యవస్థీకృతమైన యూనియన్‌లలోని కొందరు కార్యకర్తలు తమంతట తాము స్వచ్ఛందంగా సమ్మెను బలపరిచి, సమ్మెచేస్తున్న వారి నడుమ పనిచేశారు. ఇతర పరిశ్రమల్లోని యూనియన్లు, ఎల్ఐసి వంటి వైట్‌కాలర్ ఉద్యోగులతో సహా ఇతర పరిశ్రమలలోని ఉద్యోగులు జౌళి కార్మికుల సహాయార్థం నిధులు సేకరించారు. తమ గ్రామాలకు తిరిగివెళ్ళిన మిల్లు కార్మికులు, గ్రామీణ పేదలనుండి ప్రత్యేకించి పేద, మధ్యతరగతి రైతాంగం నుండి మద్దతు కూడ గట్టారు. రైతుల నుండి ఆహారధాన్యాలను సేకరించి, గ్రామీణ ప్రాంతాలలోని గ్రామీణ కార్మికుల నడుమ సంఘీభావాన్ని దృఢపరిచారు. ఎల్ఐసి కార్మికులు, వెస్టర్న్ రైల్వే కార్మికులు, గ్లాక్సో, ఆర్‌సిఎఫ్ మొదలైన సంస్థలలోని అధిక యూనియన్లు సమ్మెకు సంఘీభావంగా నగదు, ధాన్యం రూపంలో సహకరించారు. ఇతర పరిశ్రమలలోని 85,000 మంది కార్మికులు సమ్మెకు మద్దతుగా తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందించారు. నవజవాన్ భారత్ సభ(ఎన్‌బిఎస్) కార్యకర్తలు, పోలీసు కేసులకు గురైన వారికి ఇతర రూపాల అణచివేతను తిప్పికొట్టేందుకు, సమ్మెచేస్తున్న కార్మికులకు చురుగ్గా తోడ్పాటునందించారు. అన్ని వామపక్ష ట్రేడ్ యూనియన్లు సమ్మెకు మద్దతు తెలిపే స్థితిని బహిరంగంగా స్వీకరించినప్పటికీ, వాస్తవంలో విజయం దిశగా సమ్మెను ముందుకు నడిపించటానికి వారు చేసిందేమీ లేదు. కేంద్ర ట్రేడ్ యూనియన్ల జాతీయ ప్రచార కమిటి సమ్మెకు మద్దతుగా చేపట్టిన ఏకైక ప్రజల కార్యాచరణ ఏమంటే-దేశవ్యాపితంగా వున్న అన్ని జౌళి మిల్లులలో ఒకరోజు సాధారణ సమ్మె జరపటం! ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాతంత్ర కార్మికులు ఒక సంఘీభావ కమిటీగా ఏర్పడి కరపత్రాలు, గేట్ మీటింగులు, విజయవాడలో సెమినార్ నిర్వహించటం ద్వారా సమ్మె చేస్తున్న కార్మికులకు సంఘీభావంగా విస్తృత ప్రచారం చేశారు. సమ్మెను పూర్తిగా సమర్థిస్తూ సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్క రించటంలో ప్రభుత్వ మిల్లు యజమానుల నిరంకుశ, మొండివైఖరిని ఖండిస్తూ ఈ ప్రచారం సాగించారు. దేశవ్యాపిత కార్మికుల నడుమ ఐక్యతను దృఢపరచటంతోపాటు సమ్మెచేస్తున్న కార్మికులతో మమేకతను చాటవలసిందిగా దేశవ్యాపితంగా కార్మికులను కోరారు. కార్మికోద్యమంలో బొంబాయి జౌళిమిల్లు కార్మికుల సమ్మె ప్రాధాన్యతను, గుర్తింపును గురించి, ఐక్యత ప్రాధాన్యతను గురించి రాష్ట్ర వ్యాపితంగా అన్ని పరిశ్రమల, విభాగాలలోని కార్మికుల నడుమ వివరించారు.

దత్తాసామంత్ నాయకత్వంలో ఉత్పాదన్ రోకో, బంద్, జైల్‌భరో, లాంగ్‌మార్చ్, మోర్చా మొదలైన అనేక ఆందోళనలను సమ్మెను నిలబెట్టటానికి, సమ్మెచేస్తున్న కార్మిక నైతిక ధృతిని పెంచేందుకు భారీ స్థాయిలో చేపట్టాడు. 'కామ్‌గార్ అవధి' ద్వారా అతను ఎన్నికలను కూడా ఉపయోగించే ప్రయత్నంలో భాగంగా జనవరి 18న సమ్మె వార్షిక ప్రదర్శన సందర్భంగా నిరుత్సాహానికి గురైన కార్మికులకు పునరుత్తేజం కల్గించే క్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించాడు.

ఏమైనప్పటికీ, ఈ సంఘీభావ ప్రయత్నాలు, సమ్మెను కొనసాగించటానికి చేసిన ప్రయత్నాలు, మిల్లు యజమానుల, ప్రభుత్వ క్రూరమైన మొండివైఖరులతో సరితూగలేక పోయాయి. దత్తా సామంత్‌యొక్క అధిక మోతాదు వ్యక్తిగత పనివిధానము, రాజ్యంతో వీరోచితంగా

తలపడటాన్ని ఎగవేసే ఆతని 'శాంతియుతంగా కార్మికులను ఇంటివద్ద వుండమనే' సమ్మె విధానం-రాజ్యం, పాలకవర్గాలు, మిల్లు యజమానుల కూటమి సాగించే అణచివేత ముందు నిలువజాలలేక పోయింది. 1983 జూన్ నాటికి, ఒక స్వతంత్ర 'బూర్జువా సంస్కరణవాద' యూనియన్ నాయకుడైన దత్తాసామంత్ నాయకత్వంలో ప్రభుత్వం, మిల్లు యజమానుల కూటమి నడుమ సాగిన మహత్తర పోరాటం, భంగపాటుకు గురైంది.

ఈ ఓటమియొక్క విధ్వంసక ప్రభావం, సమ్మెలో పాల్గొన్న కార్మికులపై పడింది. 2.3 లక్షలమంది కార్మికులేగాక, ఆ సంఖ్యకు నాలుగురెట్ల ప్రజానీకంపై ఈ సమ్మె ప్రత్యక్షంగా ప్రభావం చూపింది. సమ్మె కాలంలో అనేకమంది కార్మికులను పనుల నుండి తొలగించారు. మిల్లు యాజమాన్యాలు కార్మికులతో వాగ్దానాలు, కట్టుబాటులతో కూడిన ఒప్పందాలపై సంతకాలు తీసుకున్నాయి. యాజమాన్యాలపట్ల నిరపేక్షమైన విశ్వాసం కలిగివుంటూ తిరిగి మరోమారు సమ్మెలోకి వెళ్ళబోమనే హామీలతో కార్మికులను తిరిగి పనులలోకి తీసుకున్నారు. సూపర్‌వైజర్లు వారిపట్ల చాలా అవమానపరిచే రీతిలో వ్యవహరించారు. అనేకమంది పర్మినెంటు కార్మికులు 'బదిలీ' కార్మికులుగా తీసుకోబడగా, మరికొంతమందికి మునపటి వేతనాలలో సగం మాత్రమే చెల్లించారు. ఉద్యోగ విరమణ లేదా రాజీనామా చేసిన వేలాదిమంది కార్మికులకు గ్రాట్యుటీ, ఇతర ప్రయోజనాలను నిరాకరించారు. తొలగించబడిన కార్మికులు రోజువారీ కూలీలు గానో, రోడ్ల ప్రక్కన కూరగాయాలు అమ్ముకునే వారిగానో మారిపోయారు. సమ్మె ఓటమి తర్వాత మిల్లు కార్మికుల విషాదకర జీవన దుస్థితి ఇలా తయారైంది.

ఈ సమ్మె ఓటమికి గురైనప్పటికీ, బొంబాయి జౌళి కార్మికుల సమ్మె అనుభవాల నుండి గ్రహించే విలువైన పాఠాలు, మెరుగైన కార్మికోద్యమాన్ని నిర్మించటంలో మరింత ఉపకరిస్తాయి. తద్వారా యాజమాన్యాల, ప్రభుత్వ ద్వయం యొక్క అణచివేత నుండి కనీసం కార్మికుల మౌలిక ప్రయోజనాలను ప్రభావ శీలంగా పరిరక్షించేందుకు, అలాగే మరింత సమరశీల కార్మికుల పోరాటాలకు నాయకత్వం వహించే సామర్థ్యాన్ని అందించేందుకు అవి మరింత ప్రయోజనకరంగా వుంటాయి. ఆ గుణపాఠాలు ఇలా వున్నాయి.

1. భారతదేశంలో పార్లమెంటరీ వామపక్ష వాదం స్తబ్దతలో వుందని ఈ సమ్మె స్పష్టంగా విపులీకరించింది. వామపక్షాలు ముడివేసుకున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, అన్ని విప్లవకర శక్తులను ధ్వంసం చేసింది. వామపక్ష ట్రేడ్ యూనియన్లు మరింకే మాత్రమూ సమరశీల కార్మికుల, శ్రామిక ప్రజాఉద్యమాలను నడపగలిగే స్థితిలో లేవు.

2. కార్మికులు కేవలం పారిశ్రామిక యాజమాన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయటమేగాక, పరోక్షంగా కార్మికోద్యమాన్ని తన ఆర్థికసంస్థలైన ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు ద్వారా అసంఖ్యాక పద్ధతుల్లో, షరతులతో అదుపుచేస్తున్న సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలి. కార్మికుల పోరాట మొన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టాలి.

3. గ్రామీణ భారతదేశంలో రాజ్యంయొక్క అధికారం ఫ్యూడల్‌శక్తులు, భూస్వాముల చేతుల్లో వుంది. పాలనా వ్యవస్థ నుండి ఈ అధికారాన్ని సంపూర్ణంగా తొలగించనంతవరకు, కార్మికుల పోరాటాలు విజయం సాధించలేవు. 1982 నాటి ఇపిడబ్ల్యు నివేదిక ఇలా పేర్కొంది.: "గ్రామీణ ప్రభుత్వ నిర్మాణం కూడా వినియోగించబడింది. గ్రామ పంచాయితీల అధ్యక్షులను, సమ్మెలో పాల్గొంటున్న కార్మికుల పేర్లను అందజేయమని మాత్రమేగాక, సమ్మెచేస్తున్న కార్మికుల వద్దకు వెళ్ళి తిరిగి విధులకు వెళ్ళమని వారిని ఒప్పించవలసినదిగా కోరటం జరిగింది" మన పాలనావ్యవస్థ భూస్వామ్య ఆధారితంగా ఎలా వుందో ఇది స్పష్టంగా చూపుతోంది. కనుక కార్మికుల పోరాటాలు ఫ్యూడల్ వ్యతిరేకంగా కూడా వుండి తీరాలని ఇది హెచ్చరిస్తోంది.

4. కార్మికుల పట్టణ-గ్రామీణ ప్రాంత సంబంధాలు, సమ్మెల సందర్భంగా మాత్రమే ఏర్పడే తాత్కాలిక ధోరణిలో వుండరాదు. ఇవి ఒక కార్మిక, రైతాంగ శాశ్వత కూటమిగా వుండి తీరాలి. రైతాంగం తమ పోరాటాలను ఉన్నత స్థితికి తీసుకువెళ్ళే పోరాటాలలో అన్ని సందర్భాల్లోనూ కార్మికులు రైతాంగ ప్రయోజనాల కొరకు పోరాడాలి.

5. కార్మికవర్గ రాజకీయాలతో కార్మికులు తమను తాము రాజకీయవంతం, చైతన్యయుతం చేసుకోవటం ద్వారా, రైతాంగ, శ్రామికులతో కలిసి సాగించే సమరశీల పోరాటాలతో కార్మికవర్గం మేథోపరంగా అభివృద్ధిచెందాలి.

6. దేశవ్యాపితంగా అన్ని విభాగాలలోని కార్మికులు తమ మధ్య బలమైన ఐక్యతను అభివృద్ధిచేసుకొని, జరుగుతున్న పోరాటాలకు క్రియాశీల సంఘీభావాన్ని అందించాలి.

7. కార్మిక వ్యతిరేక చట్టాల రద్దుకోసం మాత్రమే నిరంతరాయంగా కార్మికులు పోరాడటం గాకుండా, వివిధ సందర్భాలలో ముందుకుతెస్తున్న వ్యవసాయ వ్యతిరేక చట్టాల రద్దుకోసం కూడా పోరాడాలి.

8. బడా పెట్టుబడిదారుల, దళారీ పెట్టుబడిదారుల పూర్తిస్థాయి ప్రయోజనాలకోసం కార్మికుల చట్టబద్ధ, రాజ్యాంగపరమైన హక్కు లన్నింటినీ రద్దుచేసే కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌ల రద్దుకోసం కార్మికులు పోరాడాలి.

9. ప్రజాస్వామ్య హక్కులకోసం, రాజ్య అణచివేతకు వ్యతిరేకంగా కార్మికవర్గం నిరంతరాయంగా పోరాడాలి.

10. కార్మికులు తమ వర్గ రాజకీయాల రాజకీయ సిద్ధాంతం నుండి స్వతంత్రంగా వుండరాదు; కార్మికవర్గ రాజకీయాల సిద్ధాంత, రాజకీయ, నిర్మాణకృషి సాగిస్తూ కార్మికవర్గంతో సహా ఇతర శ్రామిక ప్రజానీకాన్ని అంతటినీ విముక్తిచేసి, సోషలిజం సాధించే లక్ష్యంతో మరింత చైతన్యం పెంపొందించుకోవాలి.

**-అక్టోబర్ 2023('క్లాస్‌స్ట్రగుల్' నుండి అనువాదం)**





రైకూసం ప్రచురణ

**అఖిల భారత ఆదివాసీ సదస్సు సావనీర్-2023**

కాపీలకు : **మైత్రీబుక్‌హౌస్,**

**జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2**

# ప్రపంచ ఆకలి సూచీలో దిగజారుతున్న భారతదేశం

**ప్రపంచ** ఆకలి సూచీలో భారతదేశం ప్రతి సంవత్సరం దిగజారుతోందనే వార్తలు చూసినప్పుడు గత ఆరు దశాబ్దాల కాలంగా మన దేశ వ్యవసాయ రంగంలో ప్రభుత్వాలు చేసిన సంస్కరణలు,ప్రయోగాలు ప్రజల ప్రయోజనాల కనుగుణంగా సాగుతున్నాయా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

దాదాపు రెండు శతాబ్దాల కాలం సాగిన బ్రిటిష్ వలస పాలకుల దోపిడీ విధానాలు, ఆనాటికి తమ దేశాల్లో పెరుగుతున్న పారిశ్రామిక అవసరాలకు కావలసిన ముడి సరుకును ఉత్పత్తి చేసే విధంగా మనదేశ వ్యవసాయ రంగాన్ని మలిచాయి. తమ అవసరాల కోసం రైతులపై నిర్బంధం సాగించి,దమనకాండ ప్రయోగించి పత్తి, నీలిమందు వంటి పంటలను ఉత్పత్తి చేయించుకున్నారు. ఆహార ధాన్యాల కొరత, కరువు కాటకాలతో నిత్యం దుర్భిక్షం వెంటాడుతూ కరువు వాతబడి పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయినా, వారికేమీ పట్టలేదు. ఆహార పంటలను ప్రోత్సహించక పోవడంతో పాటు పండిన ఆహార ధాన్యాలలో అధిక భాగాన్ని బ్రిటిష్ వారు, స్థానిక జమీందారులు నిర్బంధంగా లెవీ విధించి, వారి సిబ్బంది, సైనిక అవసరాలకు వినియోగించి, ప్రజలను పస్తులకు, ఆకలి చావులకు గురి చేశారు.

మన దేశం, చైనా - రెండు సంవత్సరాల తేడాతో, చైనా -1949లో విముక్తి కాగా, 1947లో మన దేశానికి 'స్వాతంత్రం' ప్రకటించ బడింది. మన దేశం కంటే అనుకూల వాతావరణ పరిస్థితులు, తక్కువ మోతాదులో సాగుభూమి కలిగి ఉండి మన దేశ జనాభా కంటే ఆనాటికే అధిక జనాభా ఉన్న చైనా, విప్లవాత్మక భూసంస్కరణలు చేపట్టిందని,ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచడంతో పాటు అందరికీ ఆహారాన్ని అందుబాటులోకి తెచ్చిందనే విషయాన్ని గమనంలోకి తీసుకోవాలి. అయితే, మన దేశ వ్యవసాయ రంగపు ఈనాటి దుస్థితికి, క్షీణతకు కారణాలను రేఖామాత్రంగానైనా పరిశీలిద్దాం.

మనదేశంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా ఆహార ధాన్యాల అవసరం ఉందనే కారణాన్ని అడ్డుపెట్టుకొని, అధికారమార్పిడి తదనంతరం కూడా మన దేశంపై ఆధిపత్యం చలాయిస్తున్న అమెరికా, బ్రిటన్ తదితర సామ్రాజ్యవాద దేశాలు తమ ప్రయోజనాలకు అనుగుణమైన విధానాలతో మనదేశ వ్యవసాయ రంగంలో జోక్యం చేసుకుంటూనే ఉన్నాయి.

1951లోనే అమెరికా, భారత దేశంలో అత్యవసరంగా ఆహారకొరతను నివారించేందుకు అంటూ 20 లక్షల టన్నుల గోధుమలను తన నుండే కొనుగోలు చేయడానికి 142.28 కోట్ల రుణం ఇచ్చింది. ఆ విధంగా తన మిగులు ఉత్పత్తిని లాభకరంగా వదిలించుకోవడంతో పాటు, ఈ రుణ చెల్లింపులో భాగంగా తనకు అవసరమైన కీలకమైన వ్యూహాత్మక రీత్యా ప్రాధాన్యత గల పదార్థాలను తక్షణం, నిరంతరం సరఫరా చేయాలనే షరతులతో ఈ సహాయం ప్రారంభమైందని కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి పేర్కొన్నారు.

తనకు మిగులుగా ఉన్న వ్యవసాయ సరుకులను ముఖ్యంగా గోధుమలను మన దేశం వంటి వెనుకబడిన దేశాలకు సరఫరా చేసేందుకు అమెరికా 1954లో పబ్లిక్ లా (పిఎల్)-480 అనే విధానాన్ని రూపొందించింది. దానితో అమెరికా తన మిగులు గోధుమలన్నీ భారత దేశానికి సరఫరా చేసింది. గోధుమలు అమ్మగా వచ్చిన డబ్బునంతా భారత రాజకీయ ఆర్థిక వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు మంచి సాధనంగా అమెరికా సామ్రాజ్యవాదం వినియోగించుకుంది.

వివిధ వాతావరణ, నైసర్గిక పరిస్థితుల్లో మనదేశంలో 1,20,000 రకాల పైగా వరి పండేవి.రైతుల జీవితానుభవంలో నుండే వీటిని అభివృద్ధి చేశారు. 1950లలో ఒరిస్సా కేంద్రంగా కేంద్రీయ వరి పరిశోధన కేంద్రాన్ని( సి ఆర్ ఆర్ ఐ) ఏర్పరిచినా, చీడ, పీడలను తట్టుకుంటూ, ఆహార ఉత్పత్తిని పెంచే వరి వంగడాలను అభివృద్ధి చేసే కృషిని పాలకులు నిరుత్సాహపరుస్తూ వచ్చారు.

కాగా, వరి వినియోగమే లేని దేశమైన అమెరికా, 1960లో రాక్ ఫెల్లర్,ఫోర్డ్ ఫౌండేషన్ల పెట్టుబడులతో అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రం (ఐ ఆర్ ఐ )ని ఫిలిప్పీన్స్ లో ఏర్పరిచింది. భారతదేశపు వ్యవసాయ రంగ కీలకమైన, వ్యూహాత్మక విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానమంతా తెలిసిన డాక్టర్ స్వామినాథన్‌ను ఈ కేంద్రానికి డైరెక్టర్ జనరల్‌గా నియమింప చేసుకుంది.

ఐఆర్ఆర్ఐ 1966లో అధిక ఎరువులతో, అధిక దిగుబడులని ఇచ్చే ఐఆర్-8 అనే రకపు వరి వంగడాన్ని అభివృద్ధి చేసింది. సస్య విప్లవం పేరుతో 1967లో తొలుత ఈ వంగడాలను, వాటికి ఎరువులను, పురుగుమందులను విస్తృతంగా రైతాంగం వినియోగించేందుకు అనుగుణంగా మనదేశ పాలకులను ఒప్పించారు. ఈ రకమైన వరి సాగుతో తెగుళ్ల విస్తారంగా వ్యాపిస్తాయనీ, క్రిమి కీటకాల దాడులను తట్టుకోలేక పోతా యనీ రిచారియా వంటి భారత వ్యవసాయ శాస్త్రవేత్తల అభ్యంతరాలను పాలకులు తోసిపుచ్చారు. బలవంతంగా, అవమానకరంగా ఆయనను కేంద్రీయ వరి పరిశోధనా కేంద్ర డైరెక్టర్‌గా పదవీ విరమణ చేయించారు.

సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత తిరిగి రిచారియా ను మధ్యప్రదేశ్ ప్రభుత్వం, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా తీసుకుంది. ఐ.ఆర్.ఆర్.ఐ రూపొందించిన వరి వంగడాలకు భిన్నంగా, రిచారియా నేతృత్వంలో బలమైన, పొట్టి వరి వంగడాలను రూపొందించి ప్రయోగాత్మకంగా మధ్యప్రదేశ్ లో విజయం కూడా సాధించారు. సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అడ్డుపడుతున్న రిచా రియాను లోబరుచుకునే ప్రయత్నాలు సాగించారు. అవి విఫలమవడంతో భారత పాలకుల ద్వారా రిచారియా నాయకత్వంలోని మధ్యప్రదేశ్ రైస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌నే మూసి వేయించారు.

ఫలితంగా హరిత విప్లవంతో అధిక దిగుబడి విత్తనాలు విస్తృతంగా వ్యవసాయ రంగంలో ప్రవేశించాయి. దీనిని వెన్నంటే వ్యవసాయ రంగంలో ఉత్పాదకాలపై రైతాంగం చేసే వ్యయం కూడా భారీగా పెరిగింది. సంస్థాగత రుణ సదుపాయం లేకపోవడంతో అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యాపారులపై ఆధారపడటం పెరిగి, రుణభారం రైతాంగానికి మరింత విషమంగా పరిణమించింది. మరీ ముఖ్యంగా కౌలు రైతులు, కౌలు కూడా చెల్లించాల్సి రావడంతో, మరింత అధిక ఒత్తిడికి, రుణభారాలకు లోనయ్యారు. రుణభారాలను తట్టుకోలేని రైతుల ఆత్మహత్యలు,ప్రత్యేకించి కౌలు రైతుల ఆత్మహత్యలు లక్షలాదిగా కొనసాగుతూ అవి రోజువారీ వార్తలుగా మారిపోయాయి.

దీనికి మరో పార్శ్వాన్ని పరిశీలిస్తే రైతులకు విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు మొదలుకొని వ్యవసాయ ఉప కరణాల తయారీదారులైన సామ్రాజ్యవాద, బహుళజాతికార్పొరేట్ పరిశ్రమలు అసాధారణ లాభాలను గడిస్తూ వస్తున్నాయి.

**(తరువాయి 22వ పేజీలో)**

# బళ్ళారిలో నీటి కోసం రైతుల ఆందోళన



**ఒకవైపు** కరువు మరొకవైపు డ్యాములలో నీటి నిలువ తగ్గిపోవడం, వున్న నీళ్లను పరిశ్రమల కోసం మళ్ళించడం రైతులకు నిరంతర సమస్యగా మారుతున్నది. ఈ పరిస్థితి రాకూడదనే ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు, కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి ప్రాంతానికి నీరందించే తుంగభద్ర డ్యామ్ లో నిండుతున్న సిల్ట్ ను తొలగించాలని కర్ణాటక రాజ్య రైతు సంఘ హాగు హసిరు సేనే (KRRS) అధ్వర్యంలో చాలా కాలంగా ఆందోళన సాగుతూ వుంది. తుంగభద్ర ఆయకట్టులోని హెచ్.ఎల్.సి – ఎల్ఎల్సీ పరిధిలో ఈ సీజన్లో సుమారు నాలుగు లక్షల ఎకరాల లో పత్తి, మిర్చి, వరి, జొన్న , మొక్కజొన్న వంటి పంటలు వేశారు. మిర్చి పంట కైతే ఒక ఎకరానికి లక్ష రూపాయల వరకు ఇప్పటికే పెట్టుబడి పెట్టారు. డ్యామ్ లో ఉన్న నీరు నవంబర్ 5 వ తేదీ వరకే సరిపోతుందని, ఆ తర్వాత వ్యవసాయానికి నీళ్ళు ఇవ్వడం కుదరదని, జిందాల్ వంటి పరిశ్రమలకు ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు ప్రకటించడంతో రైతాంగం ఆందోళన బాట పట్టారు. కర్ణాటక రాజ్య రైతు సంఘ కార్యకర్తలు విస్తృతంగా గ్రామాలలో పర్యటించి ఈ సమస్యలపై కార్యక్రమం రూపొందించారు. 31. 10 .23 తేదీన వందకు పైగా ట్రాక్టర్లతో 2000 మంది రైతులు ర్యాలీ నిర్వహించి, బళ్ళారి జిల్లా ఆఫీసు ముందు ఆందోళన చేపట్టారు. డిసెంబర్ 15 వరకు నీళ్ళు ఇవ్వకపోతే వేలాది కుటుంబాలు కోట్లాది రూపాయలు నష్టపోవాల్సి వస్తుందని, ఇప్పటికే కరువు వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం అందలేదని, మరొకవైపు బ్యాంకులు అప్పులు తీర్చమని ఒత్తిడి తెస్తున్నారని ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంటలను రక్షించుకునేందుకు రైతులంతా పోరాటాన్ని ఉధృతం చేయడానికి సిద్ధంగా ఉండాలని AIKMKS అనుబంధ KRRS అధ్యక్షుడు ఆర్.మాధవరెడ్డి పిలుపునిచ్చారు. ✸

---

**అమెరికా...** (7వ పేజీ నుండి)

అప్పటికే యుద్ధంలో స్టాలిన్ నాయకత్వాన సోవియట్ యూనియన్ నాజీలను, హిట్లర్ సైన్యాన్ని ఓడించి, తుదముట్టించింది. ఇక యుద్ధం కాదు–శాంతి కావాలని కోరుతూ ఐక్యరాజ్యసమితిలో సోవియట్ ప్రతినిధి పదేపదే ప్రకటిస్తున్నాడు.

అయినా అటు ఆమెరికా పాలకులూ, యిటు బ్రిటన్ (ఇంగ్లండు) పాలకులూ, పలువురు రాజనీతిజ్ఞులూ సోవియట్ యూనియన్‌పై ఆటంబాంబులు వేసి, ధ్వంసం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ నేపధ్యంలో ఆమె ఆ అమెరికన్ ప్రశ్నావళికి జవాబుగా, ఒక చిన్న పుస్తక రూపంలో జవాబునిచ్చింది.

ఆ ప్రశ్నావళిలో "మీరు మీ దేశంలో ఎవరిని అత్యంత ప్రముఖులుగా భావిస్తారు?" అన్న ఒక ప్రశ్న వుంది.

అందుకు ఆమె యిచ్చిన జవాబు: సోవియట్ యూనియన్‌లో 2 కోట్లమంది ప్రజలందరూ అత్యంత ప్రముఖులే!

ఈ జవాబునుబట్టే ఒక సోషలిస్టు సమాజంలోని ప్రజల ఆలోచనా స్వభావానికీ, సోషలిస్టేతర ప్రపంచంలోని ప్రజల ఆలోచనా స్వభావానికి గల తేడా మనకు స్పష్టంగా బోధపడుతుంది.

అనేక వివరాలతో నాటి సోవియట్ దేశ ప్రజల స్థితిగతులను, సోవియట్ ప్రభుత్వం దేశ పునర్నిర్మాణానికి చేబట్టిన విధానాలనూ, వాటి స్వభావాలను ఒక చిన్న పుస్తకరూపం ద్వారా, ప్రపంచ ప్రజానీకానికి అందించింది ప్రస్కోవ్యా ఏంజెలినా!

ఇది ఎంతో స్ఫూర్తిదాయకంగా అందరూ, ప్రత్యేకించి మహిళా సమస్యలపై పనిచేస్తున్న కార్యకర్తలు చదవవలసిన పుస్తకంగా వుంది. సోవియట్ వ్యవస్థను గురించిన యదార్ధ వివరాలు తెల్సుకోవటానికి యీ చిన్న పుస్తకం దోహదకారిగా వుంటుంది! ఈ పుస్తకాన్ని 1949లో ప్రచురించారు. ✸

---

**ప్రపంచ ...** (21వ పేజీ తరువాయి)

1990 నుండి వరుసగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలన్నీ అనుసరిస్తూ వస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు రైతాంగ పరిస్థితిని మరింత దుర్భరం చేశాయి. నూతన వ్యవసాయ విధానం,మరో సస్య విప్లవం పేరుతో దేశ పాలకులు మరో అడుగు ముందుకు వేసి జన్యు మార్పిడి విత్తనాలను ప్రవేశపెట్టారు. ఇవి జీవావరణం, పర్యావరణా లకు మరింత హానికరంగా పరిణమించడమే కాకుండా మన దేశంపై సామ్రాజ్యవాద జీవ-సాంకేతిక, వ్యవసాయ–వాణిజ్య, వ్యవసాయ – ఆహార కంపెనీల గుత్తాధిపత్యాన్ని పెంచడానికి దోహదపడ్డాయి. ఆర్థిక మీటలతో వ్యవసాయం నుండి, సాగుభూముల నుండి రైతాంగాన్ని బలవంతంగా పరాయీకరించే చర్యలు వేగవంతం అయ్యాయి. దొడ్డి దోవన అమలయ్యే ఈ విధానాలకు నిర్దిష్ట చట్ట రూపం ఇచ్చి, సామ్రాజ్యవాద బహుళజాతి,కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలను పరిరక్షించేందుకు వీలుగా ముందుకు వచ్చినవే, ఇటీవల మోడీ ప్రభుత్వం ప్రకటించిన మూడు వ్యవసాయ చట్టాలు అనేది అర్థం చేసుకోవాలి.

మరోవైపున తప్పుడు లెక్కలతో ప్రజలను మాయ చేస్తున్నారు. దేశ జనాభా అవసరాలకు మించి ఆహార ధాన్యాలను పండించి ఎగుమతి కూడా చేయగలుగుతున్నామని చెబుతున్నారు. అయితే దేశ జనాభాకు సరిపడిన మోతాదులో ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగినప్పటికీ, వారందరికీ ఆహారం అందడం లేదనే అంశాన్ని మరుగుపరుస్తున్నారు.

ఇటీవలే ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని ప్రపంచ ఆహార కార్యక్రమం విడుదల చేసిన ప్రపంచ ఆకలి సూచీని గమనిస్తే 125 దేశాల ఈ జాబితాలో మనం గత సంవత్సరం కంటే నాలుగు స్థానాలు దిగజారి 111వ స్థానంలో ఉన్నామని తెలుస్తోంది. మరి ఈ హరిత విప్లవాలు, మరో సస్య విప్లవాలు ఎవరిని ఉద్ధరిస్తున్నాయి?! ఆహార లభ్యతే ఇలా ఉంటే ఇక పౌష్టికాహారం గురించి వేరే చెప్పుకోవలసిన అవసరమేముంది?! ✸

# వివిధ దేశాలలో కార్మికుల ఆందోళనలు

### మయన్మార్ దుస్తుల రంగంలోని కార్మికుల దురవస్థ

ఫిబ్రవరి 2021లో జరిగిన సైనిక తిరుగుబాటు అనంతర కాలంలో మయన్మార్ లోని దుస్తుల పరిశ్రమలో పనిచేసే కార్మికుల పని పరిస్థితులు నానాటికి దుర్భరమవుతున్నాయి. మయన్మార్‌లో ప్రపంచంలోని అతిపెద్ద బ్రాండ్ కంపెనీలైన హెచ్&ఎమ్ జారా, ఇండిటెక్స్, ప్రిమార్క్, మార్క్స్ & స్పెన్సర్ లాంటి ప్రతిష్ఠాత్మకమైన బ్రాండ్ కంపెనీల దుస్తులు ఈ దేశంలో తయారు చేయబడతాయి.

మానవహక్కుల వనరుల కేంద్రం అనే ప్రభుత్వేతర సంస్థ ప్రకారం మయన్మార్‌లోని 124 దుస్తుల మిల్లులలో కార్మికుల పని పరిస్థితులు నానాటికీ దిగజారిపోతున్నాయి. కార్మికుల వేతనాలలో కోతబెట్టడం, కార్మికుల వేతనాల నుండి జరిమానాల రూపంలో కోతలు బెట్టడం, అక్రమంగా ఉద్యోగాల నుండి తొలగించటం, బలవంతంగా ఓవర్‌టైం పని చేయించటం లాంటి రూపాలలో దుస్తుల రంగ కార్మికులు వేధింపబడుతున్నారు.

ఈ పరిస్థితులను నిరసిస్తూ జారా ఫ్యాక్టరీ కార్మికులు సమ్మె చేయనిర్ణయించారు. దానితో జారా కంపెనీ, దక్షిణ ఆసియా దేశాలనుండి తన బ్రాండ్ దుస్తులు ఉత్పత్తి చేయించుకోవటాన్ని విరమించటానికి నిర్ణయించుకొంది.

హెచ్ & ఎం కంపెనీ, కార్మికులపై జరుగుతున్న వేధింపులు, అక్రమ పనిపరిస్థితులపై దర్యాప్తుకు పూనుకొంది. అదేవిధంగా అనేక బ్రాండ్ కంపెనీలు, యీ విషయమై దర్యాప్తులు సాగించటానికి, కార్మికుల పని పరిస్థితులను చక్కబరచటానికీ పూనుకొంటున్నాయి.

### కృత్రిమ మేధోసాంకేతికత ప్రమాదం పట్ల భయపడుతున్న అమెరికా

అమెరికాలో కృత్రిమ మేధకు చెందిన ఛాట్ జిపిటి విడుదల కావటంతో, అత్యంత నైపుణ్యం గల ఉద్యోగులు కూడా, తమ ఉద్యోగాలు ఆటోమేషన్‌కు గురవుతాయని భయపడుతున్నారు. అమెరికాలోని కార్మికులలో 22% రాబోయే రెండు, మూడు సంవత్సరాల్లో యీ కృత్రిమ మేధ సాంకేతికత వలన తమ ఉద్యోగాలకు హాని జరుగుతుందని భయపడుతున్నారు. గాలప్ అనే సంస్థ నిర్వహించిన సర్వేప్రకారం, యీ సాంకేతికతవల్ల 72% మంది ఉద్యోగుల వేతనాలు, పనిగంటలు, యితర సదుపాయాలపై తీవ్ర ప్రభావం పడుతుందని భావిస్తున్నారు. లేబరేటరీలలో ఎక్కువ సంఖ్యలో పనిచేసే మహిళా ఉద్యోగుల ఉద్యోగాలపై యీ కృత్రిమ మేధో సాంకేతికత ప్రభావం ఎక్కువగా వుంటుందని భయపడుతున్నారు.

ఇదిలావుండగా అమెరికాలోని అమెజాన్, ఆల్ఫాబెట్, ఎం.ఎస్, మెటా కంపెనీలలో 'అదృశ్య కార్మికులుగా' తెరచాటున పనిచేసే అనేకమంది సాంకేతికరంగ కార్మికుల పనిపరిస్థితులపై అమెరికా ప్రభుత్వం దర్యాప్తు జరుపుతోంది.

'అదృశ్య కార్మికులు'గా పిలవబడే లక్షలమంది డేటా కార్మికులు, ప్రపంచమంతటా ఒత్తిడిలో, నిరంతర నిఘా క్రింద పనిచేస్తున్నారు. వారు ఎటువంటి శిక్షణ లేకుండా, ఎటువంటి పర్యవేక్షణ లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వీరికి అతి తక్కువ వేతనాలు యిచ్చి, ఎటువంటి సదుపాయాలు యివ్వకుండా కంపెనీలు పనిచేయించుకొంటున్నాయి.

కృత్రిమ మేధస్సుపై కేంద్రీకరించిన కేంద్రాలూ, కంపెనీలూ తమకు పనిచేసే కార్మికులను సబ్-కాంట్రాక్టర్ల ద్వారా నియమించుకొంటున్నాయి. వీరు కంపెనీ వున్న దేశంలో వుండి పనిచేస్తారు. లేదా విదేశాలలో వుండి కూడా పనిచేస్తారు. కంపెనీలు వీరిని ఉత్పత్తుల నాణ్యత లేదా ఉత్పత్తియొక్క సారాంశాన్ని నాణ్యతలో నిలబెట్టే పనులలో ఉపయోగించుకొంటాయి.

ఈ కార్మికుల సమర్థత గురించీ, వారికి యిచ్చే విశ్రాంతి సమయాల గురించి, వారి మానసిక ఆరోగ్య పరిస్థితిని సంరక్షించే ఏర్పాట్ల గురించీ, వారి పనిభద్రత ఏర్పాట్ల గురించే అమెరికన్ ప్రభుత్వం యిప్పుడు విచారణ జరుపుతోంది. ఇప్పటికే కృత్రిమ మేధస్సు ప్రమాదం నుండి తమను తాము పరిరక్షించుకొనేందుకు హాలీవుడ్ రచయితలు, కళాకారులూ సమ్మె జరుపుతున్న నేపథ్యంలో యీ కృత్రిమ మేధో సాంకేతికత నుండి ఎదురయ్యే ప్రమాదాన్ని ఎదుర్కోవటానికి కార్మికులూ, ఉద్యోగులూ సంసిద్ధపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### తమ పనిగంటలు, తదితర డిమాండ్ల సాధనకోసం ఆటోరంగ కార్మికుల సమ్మె

1,50,000 మంది సభ్యులుగల యునైటెడ్ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వారానికి 4 రోజులలో, 32 గంటల పనీ, వేతనాల-సదుపాయాల పెంపుదల తదితర డిమాండ్ల సాధనకోసం, ఏకకాలంలో అమెరికాలోని డెట్రాయిట్‌కు చెందిన మూడు పెద్ద కంపెనీలు సెప్టెంబరు 16 నుండి సమ్మె చేశాయి.

ఫోర్డు కంపెనీయొక్క మిచిగాన్‌లోని వెయిన్‌లో గల బ్రాంకో అసెంబ్లీ ప్లాంటులోనూ, మిసిసిపీలోని వెంట్స్‌విలీలోగల జనరల్ మోటార్సుయొక్క పిక్-అప్ ట్రక్కు అసెంబ్లీ ప్లాంటులోనూ, ఓహియోలోని టొలెడోలోగల క్రిజ్లర్ మాతృసంస్థ అయిన స్టెల్లాంటీ యొక్క జీప్ అసెంబ్లీ ప్లాంటులోనూ ఒకే సమయంలో సమ్మె మొదలైంది.

అమెరికా దేశపు ఆటో పరిశ్రమలో ఒకే సమయంలో మూడు కంపెనీలలో, ఒకే యూనియన్ నాయకత్వాన సమ్మె జరగటం అన్నది చాలా అరుదుగా సంభవించే విషయం. ఈ సమ్మె ప్రభావం అమెరికా దేశపు ఆటో పరిశ్రమ రంగంలో పనిచేసే 10 లక్షలమందిపై పడుతుందని అమెరికా బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ సంస్థ తెలియజేస్తోంది. ✱







**సిపిఐ(ఎం-ఎల్) ప్రచురణ**

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్,**
**జలీల్ వీధి,**
**కారల్‌మార్క్స్ రోడ్,**
**విజయవాడ-2**

**Janasakti (Communist Revolutionaries' Monthly) RNI No. 8315/63 VJ-077/2022-24**
No.of pages : 24 Date of publication : 1st & 2nd of Every Month Posting date : 5th or 6th of Every Month

# శ్రీకాకుళ గిరిజన ఉద్యమ తొలి అమరులు కామ్రేడ్స్ కోరన్న మంగన్నల 56వ వర్ధంతి సభ

**శ్రీకాకుళం, పార్వతీపురం, 31 -10- 23:** మహత్తర శ్రీకాకుళ గిరిజన రైతాంగ అమరులు కామ్రేడ్స్ కోరన్న మంగన్నలకు ఘనంగా నివాళి అర్పిస్తూ, అమరల స్ఫూర్తిని స్మరించుకుంటూ శ్రీకాకుళం -ఆముదాలవలస బైపాస్ రోడ్డు పక్కనున్న అమరుల స్తూపం వద్ద రైతు కూలీ సంఘం (ఆంప్ర)ఆధ్వర్యంలో 31 -10 -23న సభ జరిగింది. రైతు కూలీ సంఘం(ఆంప్ర) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర అరుణ జెండా ఆవిష్కరణ చేసి, సభకు అధ్యక్షత వహించారు.

రైతు కూలీ సంఘం (ఆంప్ర) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఎస్.ఝాన్సీ మాట్లాడుతూ శ్రీకాకుళ పోరాటంలో 360 మంది కామ్రేడ్స్ అమరులయ్యారని, వాళ్ళ త్యాగాలకు నిదర్శనం ఈ స్థూపం అని అన్నారు. అమరులస్ఫూర్తితో పోరాటాలు నిర్మించాలని అన్నారు. అమర వీరులందరికీ జోహార్లు అర్పించారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అటవీ సంరక్షణ (సవరణ) చట్టం- 2023ను తీసుకు




వచ్చిందని, అడవుల సంరక్షణ పేరుతో అడవుల్లో ఉన్న ఆదివాసులను ఖాళీ చేయించి, లక్షల కోట్ల రూపాయల విలువచేసే అడవుల్లోని సహజ ఖనిజ సంపదలను కార్పొరేట్లకు బహుళజాతి కంపెనీలకు సామ్రాజ్యవాదులకు కట్టబెడుతున్నదన్నారు. ఆదివాసులు, ప్రజలంతా ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ సంఘటితంగా కదిలినప్పుడే ఇలాంటి చట్టాలను అడ్డుకోగలమని తమను తాము కాపాడుకోవడం సాధ్యమవుతుందని వివరించారు.

సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ దంతులూరి వర్మ మాట్లాడుతూ శ్రీకాకుళంలో కావలసినన్ని సహజ వనరులు, జీవనదులు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు వాటిని పట్టించు కోకుండా, ఈ ప్రాంతాన్ని వెనుకబడిన ప్రాంతంగానే మిగిల్చాయని, వంశధార, నాగావళి, జంఝావతి, సువర్ణముఖి వంటి జీవనదులకు ఆనకట్టలు నిర్మించి ఈ

**(తరువాయి 16వ పేజీలో)**

## (ప్రకటన) నవంబర్ 27, 28 తేదీలలో విజయవాడలో మహా ధర్నాను విజయవంతం చేయండి

బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ,కార్మిక,ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా 500లకు పైగా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పడిన సంయుక్త కిసాన్ మోర్చా,వివిధ కార్మిక సంఘాల సమన్వయంతో దీర్ఘకాలంగా ఆందోళనలు సాగిస్తూ వస్తున్న విషయం తెలిసిందే.

2020- 21 లలో ఢిల్లీ ప్రవేశ రహదారులనే ఆవాసాలుగా చేసుకుని సంవత్సర కాలం పైగా, ప్రధానంగా, మూడు వ్యవసాయ నల్ల చట్టాల రద్దు కోసం సంయుక్త కిసాన్ మోర్చా సుదీర్ఘ ఆందోళన ఉద్యమం సాగించింది. ప్రకృతి విపత్తులకు, కరోనాకు, ప్రభుత్వ దుర్మార్గ ప్రచారాలకు, నిర్బంధాలకు, కేసులకు ఎదురొడ్డి 700 మందికి పైగా రైతుల బలిదానాలతో సాగిన ఉద్యమం ఫలితంగా మోడీ ప్రభుత్వం తాత్కాలికంగా వెనకడుగు వేయక తప్పలేదు. మూడు నల్ల చట్టాలను రద్దు చేయడంతో పాటు మద్దతు ధర,విద్యుత్ బిల్లు తదితర అంశాలపై రైతులతో చర్చించి నిర్ణయిస్తామని రాతపూర్వక హామీ నిచ్చింది. అయితే మూడు నల్ల చట్టాలను దొడ్డిదోవన ఇప్పటికే వివిధ రాష్ట్రాలలో అమలుచేస్తూ ఉండగా, రైతు సంఘాలతో సంప్రదించకుండానే ప్రమాదకరమైన విద్యుత్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. మరొక ముఖ్యమైన కనీస మద్దతు ధరల అంశంపై హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఆదివాసులకు, ప్రజలందరికీ వ్యతిరేకమైన అటవీ సంరక్షణ (సవరణ) చట్టం - 2023ను ముందుకు తెచ్చింది. ఈ నేపథ్యంలో ఎస్‌కెఎమ్ దేశవ్యాపిత పిలుపులో భాగంగా నవంబర్ 27, 28 తేదీలలో విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతంచేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

**ఏపి కార్మికసంఘాల సంయుక్త వేదిక** **ఏపి రైతుసంఘాల సమన్వయ సమితి(ఏపిఎస్‌కెఎం)**

Printed, Published and Owned by S. Seshamma
32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
Printed at SVR Offset Printers & Binders, D.No. 24-29-128B, Garimallavari Street, Gulabithota, Vijayawada-3
Editor : S. Seshamma, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010